# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 02, సంచిక : 79, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) శుక్రవారం -06 - జూన్ - 2025


## ఛత్తీస్ గఢ్ లో భీకర ఎన్‌కౌంటర్...

● మావోయిస్టు అగ్రనేత సుధాకర్ మృతి




- ●బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్
- ●మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ హతం
- ●సుధాకర్ తలపై రూ. కోటి రివార్డు
- ●తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో మోస్ట్ వాంటెడ్

## పుతిన్ గట్టిగానే చెప్పారన్న ట్రంప్..

# ధ్రువీకరించిన క్రెమ్లిన్




- ●ఉక్రెయిన్ డ్రోన్ల దాడికి తాము బదులుతీర్చుకుంటాం
- ●ప్రతీకార దాడులు చేయాలన్న తమ ప్లాన్ గురించి ఫోన్ కాల్‌లో ట్రంప్‌నకు వెల్లడి
- ●పుతిన్‌తో 75 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడా

## కాళేశ్వరంపై 10న సీఎం సమీక్ష!

బనకచర్ల-గోదావరి అనుసంధానంపై కూడా..




ఉద్యోగుల అంశాలపైనే సుదీర్ఘ చర్చతో.. గురువారం నాటి భేటీలో జరగని సమీక్ష

# ఉద్యోగులకు 2 డీఏలు




- ●తక్షణమే ఒకటి చెల్లింపు.. 6 నెలల తర్వాత రెండో డీఏ
- ●మళ్లీ జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీలు
- ●ఉద్యోగులకు వైద్య సదుపాయం కోసం ట్రస్ట్
- ●ప్రతి నెలా రూ. 700 కోట్ల మేర ఉద్యోగుల పెండింగ్ బిల్లుల చెల్లింపు
- ●సచివాలయంలో 12.5 శాతం నాన్ సెక్రటేరియట్ సర్వీసెస్ కోటా
- ●అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనం రూ. 2 లక్షలకు పెంపు
- ●ఎన్నికల్లో బదిలీ అయిన ఉద్యోగులు తిరిగి సొంత స్థానాలకు బదిలీ
- ●హామ్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రోడ్ల అభివృద్ధి
- ●కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో మెట్రో రైలు విస్తరణ
- ●సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గ భేటీలో కీలక నిర్ణయాలు

**వివరాలు వెల్లడించిన డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొన్నం, పొంగులేటి**

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 2 డీఏలు (కరువు భత్యం) చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏలలో ఒక డీఏను తక్షణమే చెల్లించాలని నిర్ణయించింది. నాటి నుంచి ఇప్పటివరకు చెల్లించాల్సిన డీఏ బకాయిలను 28 వాయిదాల్లో చెల్లించనుంది. ఇక మరో డీఏను 6 నెలల తర్వాత చెల్లించనుంది. వచ్చే ఏప్రిల్‌లో దీనిపై ప్రకటన చేయనుంది. ఉద్యోగులకు 5 పెండింగ్ డీఏలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉండగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుతానికి రెండు డీఏలపైనే కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గం ఈ మేరకు పలు అంశాలపై చర్చించి కీలక నిర్ణయాలు తీసుకుంది. సాయంత్రం 4:30 నుంచి రాత్రి 9:30 గంటల వరకు జరిగిన ఈ సమావేశంలో ఉద్యోగులకు సంబంధించిన అపరిష్కృత సమస్యలపై విస్తృతంగా చర్చించి సానుకూల నిర్ణయాలు తీసుకుంది. ఉద్యోగుల సమస్యలపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘానికి నేతృత్వం వహించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.. మంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో విలేకరులకు వివరాలను వెల్లడించారు.

### ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘ చర్చ..

ఉద్యోగ సంఘాలతో జరిపిన చర్చల వివరాలను డిప్యూటీ సీఎం భట్టి కేబినెట్‌కు నివేదించారు. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ తమ నివేదికను సమర్పించింది. ఉద్యోగుల 57 డిమాండ్లను మిగతా.. 2లో

## ఉద్యోగుల డిమాండ్లపై

# క్యాబినెట్‌లో చర్చ.

ఉద్యోగుల సమస్యలపై అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక, డీఏ, ఆరోగ్య భద్రత

పెండింగ్ బిల్లుల కార్యాచరణపై చర్చ

ప్రస్తుతం ఒక డీఏ, ఆరునెలల తర్వాత మరో డీఏ చెల్లిస్తాం

**బీమాకు ఉద్యోగులు ప్రతినెలా రూ.500చెల్లిస్తే.. ప్రభుత్వం కూడా కొంత చెల్లిస్తుంది**

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైన తెలంగాణ మంత్రివర్గం ఉద్యోగుల డిమాండ్లపై ప్రధానంగా చర్చించింది. దాదాపు ఐదున్నర గంటల పాటు జరిగిన సమావేశంలో.. ఉద్యోగుల




సమస్యలపై అధికారుల కమిటీ ఇచ్చిన నివేదిక, డీఏ, ఆరోగ్య భద్రత పెండింగ్ బిల్లుల కార్యాచరణపై చర్చించినట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను భట్టి విక్రమార్క, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మిగతా.. 2లో




## మొక్కలు నాటకపోతే భవిష్యత్‌లో ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి

హైదరాబాద్: మొక్కలను నాటడంలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు ఆక్సిజన్ మాస్కులు పెట్టుకునే పరిస్థితి వస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో మంత్రి మొక్కలు నాటారు. కాలుష్య నియంత్రణ చేయకపోవడంతో అనేక రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని.. వాటిని సంరక్షించుకోవాలని కోరారు.

## బెంగళూరు తొక్కిసలాట... కమిషనర్ సహా ఐదుగురు

# పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటు

- ●చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాటలో 11 మంది మృతి
- ●బెంగళూరు పోలీస్ కమిషనర్ సహా ఐదుగురు సీనియర్ అధికారుల సస్పెన్షన్



బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనలో 11 మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనపై తీవ్రంగా స్పందించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ బి. దయానంద, డీసీపీ (సెంట్రల్ డివిజన్) హెచ్.టి. శేఖర్‌తో సహా ఐదుగురు సీనియర్ పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. విచారణను క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి అప్పగిస్తున్నట్లు వెల్లడించారు. విధానసౌధలో గురువారం నిర్వహించిన అత్యవసర మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఈ కీలక నిర్ణయాలను వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపేందుకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైఖేల్ డి'కున్హా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. "కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (గిరీష్ ఎ.కె.), ఆ జోన్ అసిస్టెంట్ కమిషనర్ మిగతా.. 2లో




## మళ్లీ కరోనా కలకలం... 24 గంటల్లో

# 564 కొత్త కేసులు.. ఏడుగురి మృతి

### భారత్‌లో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు

### యాక్టివ్ కేసుల సంఖ్య 4,866కు చేరిక

### కేరళలో అత్యధికంగా 1,487 యాక్టివ్ కేసులు

ఢిల్లీ: దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టినట్లు కనిపించిన మహమ్మారి, ఇప్పుడు మళ్లీ విజృంభిస్తుండటంతో ప్రజల్లో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. దేశవ్యాప్తంగా యాక్టివ్ కేసుల సంఖ్య గణనీయంగా పెరిగింది, మరణాలు కూడా మిగతా.. 2లో

## బక్రీద్ వేళ కొందరు గోవులను దొంగ చాటుగా

# కబేళాలకు తరలించే అవకాశం ఉంది



అమరావతి: గోవులను సంరక్షించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. గోవులను పవిత్రంగా ఆరాధించే గొప్ప సంస్కృతి మన సమాజంలో ఉందని, అటువంటి గోమాతలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆయన అన్నారు. చట్టాలు కూడా గోవధను ఏమాత్రం అంగీకరించవని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేశారు. "గోమాతల సంరక్షణ కోసం ఇప్పటికే ఉన్న చట్టాలను సమర్థవంతంగా అమలు చేయడంలో అధికార యంత్రాంగానికి ప్రజల నుంచి పూర్తి సహకారం అందాలి. అప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి" అని తెలిపారు. గో సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ దీన్ని సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా బక్రీద్ పండుగ సమీపిస్తున్న తరుణంలో, కొందరు వ్యక్తులు గోవులను అక్రమంగా, దొంగచాటుగా కబేళాలకు తరలించే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అరికట్టేందుకు అధికారులు ఇప్పటికే పలు జిల్లాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన మిగతా.. 2లో

## స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు..

# ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

### చెట్టు లేని జీవితాన్ని ఊహించలేం: పవన్ కల్యాణ్

- ●గత ప్రభుత్వంలో సీఎం హెలికాప్టర్‌లో వస్తున్నా చెట్లు నరికేశారు: చంద్రబాబు
- ● నేడు ఒక్కరోజే కోటి మొక్కలు నాటుతున్నాం
- ●ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నాం
- ●"రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది






అమరావతి: నేడు ఒక్కరోజే కోటి మొక్కలు నాటుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది 5 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. అమరావతి పరిధి అనంతవరం ఏడీసీఎల్ పార్కులో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ , మంత్రి నారాయణతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడారు. "రాష్ట్రంలో అడవులను 37 శాతానికి పెంచాల్సిన అవసరం ఉంది. అటవీ విస్తీర్ణం పెంచడంలో దేశానికే ఏపీ ఆదర్శంగా నిలవాలి. గత ప్రభుత్వం చెట్లు నరకడం తప్ప సంరక్షించింది లేదు. అప్పుడు సీఎం హెలికాప్టర్‌లో వస్తుంటే కూడా చెట్లు నరికారు. అలా నరికితే కొన్ని దేశాల్లో జైల్లో పెడతారు. మొక్కలు పెంచని వారికి గాలి పీల్చే హక్కు ఎక్కడిది?

స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు.. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్‌గా మారింది. మిగతా.. 2లో




## 34 ఏళ్ల హెరిటేజ్ ప్రస్థానం.. వేడుకలకు హాజరైన మంత్రి నారా లోకేశ్

- ●హెరిటేజ్ ఫుడ్స్ 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మంత్రి నారా లోకేశ్




## వాళ్ల ఆవేదన పట్టించుకోండి... మంత్రి నారా లోకేశ్ కు షర్మిల విజ్ఞప్తి

ఏపీలో రేపటి నుంచి మెగా డీఎస్సీ

డీఎస్సీ అభ్యర్థుల ఆవేదనను పట్టించుకోవాలన్న షర్మిల మంత్రి లోకేశ్ ను ఉద్దేశిస్తూ ట్వీట్

# 34 ఏళ్ల హెరిటేజ్ ప్రస్థానం.. వేడుకలకు హాజరైన మంత్రి నారా లోకేశ్

అమరావతి: హెరిటేజ్ ఫుడ్స్ సంస్థ 34వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను కొనియాడారు. రైతుల సాధికారతకు, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించడంలో హెరిటేజ్ ఫుడ్స్ పోషిస్తున్న పాత్రను ప్రశంసించారు. హెరిటేజ్ ఫుడ్స్ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొనడం తనకు గర్వకారణంగా ఉందని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. దార్శనికుడైన చంద్రబాబు నాయుడు స్థాపించిన ఈ సంస్థ, రైతులను శక్తివంతం చేయడంలోనూ, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులు అందించడంలోనూ కీలక పాత్ర పోషించిందని ఆయన అన్నారు. తాను కూడా ఒక పూర్వ విద్యార్థిలా గర్వంగా భావిస్తున్నానని, పాత మిత్రులు, సహోద్యోగులను కలుసుకోవడం సంతోషాన్నిచ్చిందని లోకేశ్ తెలిపారు. సంస్థను నడిపిస్తున్న బలమైన నాయకత్వం, విలువలను చూసి తాను ఎంతగానో ఉత్తేజితుడనయ్యానని మంత్రి వివరించారు. హెరిటేజ్ బృందం అంకితభావాన్ని అభినందించిన ఆయన, భవిష్యత్తులో కూడా సంస్థ మరింతగా వృద్ధి చెందుతుందని, దేశ ప్రగతికి గణనీయమైన తోడ్పాటు అందిస్తుందని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు. సంస్థకు ఉజ్వల భవిష్యత్తు ఉండాలని లోకేశ్ ఆకాంక్షించారు. ఈ జ్ఞాపకాన్ని మరింత ప్రత్యేకంగా మార్చుకునేందుకు, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాను ఒక మొక్కను నాటినట్లు మంత్రి నారా లోకేశ్ తెలియజేశారు. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానం రైతులకు అండగా నిలుస్తూ, వినియోగదారుల మన్ననలు పొందుతూ విజయవంతంగా కొనసాగుతోందని ఆయన ప్రశంసించారు. సంస్థ ఉద్యోగులు, యాజమాన్యానికి లోకేశ్ తన శుభాకాంక్షలు తెలియజేశారు.

### నారా లోకేశ్ గారికి కృతజ్ఞతలు: నారా బ్రాహ్మణి

ఈ కార్యక్రమంలో నారా లోకేశ్ అర్ధాంగి నారా బ్రాహ్మణి కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగించారు. "హెరిటేజ్ ఫుడ్స్ 34 వసంతాల సుదీర్ఘ ప్రస్థానాన్ని మేము వేడుకగా జరుపుకుంటున్న ఈ ప్రత్యేక సందర్భంలో, మా సంస్థ సాధించిన విజయాలు, మా ప్రయాణం నాకెంతో గర్వకారణంగా ఉంది. రైతులను ఆర్థికంగా శక్తివంతం చేస్తూ, దేశ ప్రజలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలనే ఒక గొప్ప సంకల్పంతో మా మామగారు, శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు ఈ సంస్థకు బీజం వేశారు. అటువంటి గొప్ప వారసత్వంలో నేను కూడా ఒక భాగమైనందుకు ఎంతో సంతోషిస్తున్నాను. 1992లో ఆయన దార్శనికతతో, ఒక చిన్న ప్రయత్నంగా మొదలైన హెరిటేజ్ ఫుడ్స్, ఈ రోజు దేశవ్యాప్తంగా ఇంతటి మహోన్నత స్థాయికి చేరుకోవడం వెనుక ఆయన అకుంఠిత దీక్ష, మా అందరి సమష్టి కృషి ఉన్నాయి. కేవలం వ్యాపార విస్తరణే కాకుండా, అన్నదాతల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చే ఒక వేదికగా, కోట్లాది ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇచ్చే ఒక విశ్వసనీయమైన సంస్థగా హెరిటేజ్ రూపుదిద్దుకుంది. మా మామగారు చూపిన మార్గం, ఆయన ఆశయాలు ఎప్పటికీ మాకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ప్రస్తుతం, హెరిటేజ్ ఫుడ్స్ దేశంలోని 13 రాష్ట్రాలలో తన కార్యకలాపాలను విజయవంతంగా కొనసాగిస్తోంది. మూడు లక్షలకు పైగా రైతు సోదరులతో మాకున్న విడదీయరాని అనుబంధం మా సంస్థకు వెలకట్టలేని ఆస్తి. వారి నిరంతర సహకారంతోనే, కోటి మందికి పైగా వినియోగదారుల ఆదరాభిమానాలను మేము పొందగలుగుతున్నాం. హెరిటేజ్ అంటేనే నమ్మకం, నాణ్యత, ఒక ఉన్నతమైన సామాజిక లక్ష్యం అనే బలమైన భావనను ప్రతి వినియోగదారుడి మదిలో నిలబెట్టగలిగాం. ఈ అద్భుత ప్రయాణంలో మేము మరో కీలకమైన ఆర్థిక మైలురాయిని కూడా అధిగమించాం. 2025 ఆర్థిక సంవత్సరంలో మా సంస్థ వార్షిక ఆదాయం రూ.4,000 కోట్లు దాటింది. ఇది మా 3,300 మందికి పైగా ఉన్న ఉద్యోగుల అంకితభావం, నిబద్ధత, సమిష్టి కృషి వల్లే సాధ్యపడింది. ఈ విజయం మా ఉద్యోగులందరిది. ఈ విజయవంతమైన ప్రయాణంలో నేను కూడా ఒక భాగస్వామిని అయినందుకు వ్యక్తిగతంగా ఎంతో గర్వపడుతున్నాను. ఈ రోజు మా వార్షికోత్సవ వేడుకల్లో నారా లోకేశ్ గారు పాల్గొని, మా సంస్థ అభివృద్ధికి అహర్నిశలూ పాటుపడుతున్న, దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులను స్వయంగా సత్కరించడం మాకు రెట్టింపు ఆనందాన్నిచ్చింది. ఆయన పలికిన ప్రోత్సాహకరమైన మాటలు, చూపిన ఆత్మీయత మా హెరిటేజ్ కుటుంబ సభ్యులందరికీ, వ్యక్తిగతంగా నాకు ఎంతో అమూల్యమైనవి. ఈ సందర్భంగా ఆయనకు నా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. హెరిటేజ్ ఫుడ్స్ ప్రస్థానం భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో, రెట్టించిన ఉత్సాహంతో కొనసాగుతుందని నేను దృఢంగా విశ్వసిస్తున్నాను. రాబోయే రోజుల్లో మరింత మంది రైతుల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తామని, దేశ ప్రజలకు మరింత నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందిస్తామని హామీ ఇస్తున్నాను. ఈ గొప్ప సంస్థలో భాగమైనందుకు సంతోషిస్తూ, మా ఈ ప్రయాణానికి తోడుగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అంటూ వివరించారు.

## ఛత్తీస్ గఢ్ లో భీకర ఎన్‌కౌంటర్...

ఛత్తీస్ గఢ్ : మావోయిస్టు పార్టీకి మరో తీవ్రమైన ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ అగ్రశ్రేణి నాయకుల్లో ఒకరైన, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ సుధాకర్, భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు హతమైన నెల రోజుల వ్యవధిలోనే ఈ ఘటన జరగడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా ఇంద్రావతి టైగర్ రిజర్వ్ ప్రాంతంలో మావోయిస్టు సీనియర్ నాయకులు సమావేశమయ్యారన్న కచ్చితమైన సమాచారంతో భద్రతా దళాలు రంగంలోకి దిగాయి. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) దళాలు సంయుక్తంగా ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి, గాలింపు చర్యలు చేపట్టాయి. ఈ క్రమంలో, గురువారం తెల్లవారుజామున మావోయిస్టులకు, భద్రతా దళాలకు మధ్య భీకరమైన కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో సుధాకర్ మరణించినట్లు అధికార వర్గాలు తెలిపాయి. సుధాకర్... మావోయిస్టు వర్గాల్లో గౌతమ్, ఆనంద్, చంటి బాలకృష్ణ, రామరాజు, సోమన్న వంటి అనేక మారుపేర్లతో సుపరిచితుడు. ఆయన స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు గ్రామం. గత నాలుగు దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమంలో చురుగ్గా పనిచేస్తున్న సుధాకర్‌పై ప్రభుత్వం రూ. కోటి రివార్డు ప్రకటించింది. 2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో జరిగిన శాంతి చర్చల్లో కూడా ఆయన పాల్గొన్నారు. బీజాపూర్ ఎస్పీ డాక్టర్ జితేంద్ర యాదవ్ ఈ ఎన్‌కౌంటర్ ఘటనను ధృవీకరించారు. అయితే, సుధాకర్ మృతికి సంబంధించి అధికారిక ప్రకటన ఇంకా వెలువడాల్సి ఉంది. ప్రస్తుతం బీజాపూర్ అటవీ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఆయన తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గత ఆరు నెలల కాలంలో మావోయిస్టు కేంద్ర కమిటీకి చెందిన ముగ్గురు కీలక నాయకులను భద్రతా దళాలు ఎన్‌కౌంటర్ చేయడం, మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బగా పరిగణిస్తున్నారు. మూడు వారాల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద ఎదురుదెబ్బ.

ఇదే ప్రాంతంలో మరికొందరు మావోయిస్టు అగ్రనేతలు!

ఇదే ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మావోయిస్ట్ పార్టీ మాజీ ప్రెస్ ఇన్‌ఛార్జి బండి ప్రకాశ్, స్పెషల్ జోన్ కమిటీ సీనియర్ లీడర్ పాపారావు కూడా ఉన్నట్లు తమకు సమాచారం అందిందని బస్తర్ ఐజీ పి.సుందర్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశ్... మావోయిస్టుల నియామకాలు, ప్రచారం, దక్షిణ బస్తర్‌లోని కార్యకలాపాల పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్నాడని, ఆయనపై రూ.25 లక్షల రివార్డు ఉందని పేర్కొన్నారు. ఇక పాపారావు గెరిల్లా యుద్ధతంత్రంలో నిపుణుడని, ఐఈడీ దాడులతో సహా అనేక హింసాత్మక ఘటనల్లో మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడని, అతడిపై రూ.20 లక్షల రివార్డు ఉందని తెలిపారు. అయితే, వీరిద్దరి ఆచూకీకి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. భద్రతా దళాలు ఆ ప్రాంతంలో తమ గాలింపును ముమ్మరం చేశాయి.

## మళ్లీ కరోనా కలకలం... 24 గంటల్లో 564 కొత్త కేసులు.. ఏడుగురి మృతి

మొదటి పేజి తరువాయి



మరణాలు కూడా నమోదవుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం... నిన్నటి వరకు 4,302గా ఉన్న యాక్టివ్ కేసుల సంఖ్య, ఈరోజు 4,866కు చేరింది. కేవలం 24 గంటల వ్యవధిలో 564 కొత్త కేసులు నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇదే సమయంలో గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా ఏడుగురు కోవిడ్ కారణంగా మరణించారు. మృతుల్లో ఢిల్లీకి చెందిన ఐదు నెలల చిన్నారి కూడా ఉండటం తీవ్ర విచారకరం. ఆ చిన్నారికి ముందే శ్వాసకోశ సమస్యలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ఆరుగురు మృతులు వృద్ధులు కాగా, వీరు మధుమేహం, అధిక రక్తపోటు, న్యూమోనియా వంటి ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని సమాచారం. మహారాష్ట్రలో ముగ్గురు, ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో చెరో ఇద్దరు చనిపోయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రస్తుతం కేరళ రాష్ట్రంలో అత్యధికంగా 1,487 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఆ తర్వాతి స్థానాల్లో ఢిల్లీ (562), పశ్చిమ బెంగాల్ (538), మహారాష్ట్ర (526), గుజరాత్ (508) రాష్ట్రాలు నిలిచాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఒక్కరోజే 105 కొత్త కేసులు వెలుగుచూడటం గమనార్హం. ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు మొత్తం 44 కోవిడ్ సంబంధిత మరణాలు నమోదయ్యాయని, వీరిలో ఎక్కువ మంది ఇతర అనారోగ్య సమస్యలు ఉన్నవారేనని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం నమోదవుతున్న కేసుల్లో చాలా వరకు స్వల్ప లక్షణాలతో ఉన్నాయని, బాధితులు హోమ్ కేర్‌లోనే కోలుకుంటున్నారని ఆరోగ్య అధికారులు చెబుతున్నారు. ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. అలాగే దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనారోగ్యంగా ఉన్నప్పుడు రద్దీ ప్రదేశాలకు వెళ్లవద్దని సూచించారు. శ్వాసకోశ సంబంధిత లక్షణాలు కనిపిస్తే, పరిస్థితిని గమనిస్తూ, లక్షణాలు తీవ్రమైతే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని కోరారు. తప్పుడు సమాచారం, వదంతులు వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి అధికారిక సమాచార వనరులపైనే ఆధారపడాలని అధికారులు ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## బక్రీద్ వేళ కొందరు గోవులను దొంగ చాటుగా కబేళాలకు తరలించే అవకాశం ఉంది

మొదటి పేజి తరువాయి



వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని ఆయన వెల్లడించారు. ఈ చర్యలకు ప్రజలందరూ తమ వంతు సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గోవుల అక్రమ రవాణా లేదా వధకు సంబంధించిన సమాచారం తెలిసినా వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు.

## ఉద్యోగులకు 2 డీఏలు

మొదటి పేజి తరువాయి

ఉద్యోగుల 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించి మిగిలిన వాటిని పరిశీలనకు స్వీకరించింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను ఇకపై ప్రతి నెలా క్రమపద్ధతిలో చెల్లించాలని నిర్ణయించింది. ప్రతి నెలా రూ. 700 కోట్లకు తగ్గకుండా బిల్లులు చెల్లించనుంది. ఉద్యోగుల హెల్త్ కార్డులకు సంబంధించి మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు హెల్త్ కేర్ ట్రస్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రతి ఉద్యోగి నుంచి నెలకు రూ. 500 వసూలు చేయడంతోపాటు సమాన మొత్తాన్ని ప్రభుత్వ వాటాగా ట్రస్ట్‌కు చెల్లించనుంది. ట్రస్ట్ చైర్మన్‌గా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వ్యవహరించనుండగా ఇతర అధికారులు, ఉద్యోగుల ప్రతినిధులు సభ్యులుగా ఉండనున్నారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా ట్రస్ట్ ద్వారా వైద్య సదుపాయం కల్పించనున్నారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి ఏటా సెప్టెంబర్‌లో శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ) సమావేశం నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఇక జిల్లా, రాష్ట్ర స్థాయిలో మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ కమిటీ ఏర్పాటు చేయాలన్న మరో కీలక డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. జాయింట్ స్టేట్ కౌన్సిల్, అసోసియేషన్లను గుర్తించేందుకు ఒప్పుకుంది. జీవో 317లో ఇంకా కొన్ని కేటగిరీలను చేర్చాలని నిర్ణయం తీసుకుంది. సచివాలయంలో ప్రస్తుతం పూర్తిగా సెక్రటరియేట్ సర్వీసెస్ ఉద్యోగులే పనిచేస్తుండగా ఇకపై 12.5 శాతం నాన్ సెక్రటరియేట్ సర్వీసెస్ కోటాను అమలు చేయాలనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. పదవీవిరమణ పొందిన ఉద్యోగులను మళ్లీ నియమించరాదనే మరో డిమాండ్‌ను మంత్రివర్గం ఆమోదించింది. గ్రామ కార్యదర్శి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించింది. ఎన్నికల సందర్భంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉద్యోగులను సొంత జిల్లాలకు తిరిగి పంపించేందుకు అంగీకరించింది. జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాల పూర్తితోపాటు నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు డిమాండ్లకు సైతం సమ్మతి తెలిపింది. అంగన్‌వాడీల పదవీవిరమణ ప్రయోజనాలను రూ. 2 లక్షలకు పెంచింది. ఉద్యోగుల అద్దె వాహనాల పెండింగ్ బిల్లుల చెల్లింపుతోపాటు వాహనాల అద్దెల పెంపునకు ఆమోదం తెలిపింది.

### మరికొన్ని నిర్ణయాలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేసిన ఎర్త్ సైన్స్ యూనివర్సిటీకి మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పేరు పెట్టాలని నిర్ణయించింది. స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ)కు రూ. 10 లక్షల ప్రమాద బీమా పథకాన్ని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమల్లోకి తెచ్చింది. బీమా కంపెనీలకు చెల్లించాల్సిన ప్రీమియం భారం కాకుండా ప్రభుత్వమే నేరుగా బాధితులకు రూ. 10 లక్షలు చెల్లించాలని నిర్ణయించింది. ఇప్పటివరకు 385 మంది మరణించగా రూ. 38.5 కోట్ల చెల్లింపులకు మంత్రివర్గం ఆమోదించింది. హైబ్రీడ్ యాన్యూటీ మోడ్ (హామ్) కింద రాష్ట్రంలోని అన్ని (పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ) రోడ్లను అభివృద్ధి చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తొలి దశ కింద 7,947 కి.మీ. పంచాయతీరాజ్, 5,190 కి.మీ. ఆర్ అండ్ బీ రోడ్లు కలిపి మొత్తం 13,137 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయనుంది. పంచాయతీరాజ్ రోడ్లకు రూ. 16,780 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 16,414 కోట్లు ప్రభుత్వం ఖర్చు పెట్టనుంది. వచ్చే రెండున్నరేళ్లలో రోడ్ల నిర్మాణం పూర్తి చేయనుండగా 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలను ఏజెన్సీలకే ప్రభుత్వం అప్పగించనుంది. పార్లమెంట్ స్థానాన్ని ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాలవారీగా ఒక్కో జిల్లాను ఒక్కో ప్యాకేజీగా విభజించి రోడ్ల అభివృద్ధి చేయాలని నిర్ణయం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో రూ. 19,579 కోట్లతో అంచనాలతో హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. కారిడార్%-%1లో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ., కారిడార్%-%2లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ., కారిడార్%-%3లో భాగంగా జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ. కలిపి మొత్తం 86.1 కి.మీ. కారిడార్‌ను నిర్మించనుంది. ఈ మేరకు కేంద్రానికి ప్రతిపాదనలు పంపాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ ఈ విషయంలో కేంద్రాన్ని ఒప్పించాలని మంత్రి పొంగులేటి కోరారు.

- రాష్ట్రంలో సన్న ధాన్యం పండించే రైతులకు ప్రోత్సాహాన్ని కొనసాగించాలని.. ప్రజలకు మేలు చేసే కార్యాక్రమాలకు గ్రీన్ చానల్‌లో చెల్లింపులు జరపాలని నిర్ణయించింది. - ములుగు జిల్లా ఇంచర్ల గ్రామంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు 12 ఎకరాల కేటాయింపును మంత్రివర్గం ఆమోదించింది.

## వాళ్ల ఆవేదన పట్టించుకోండి... మంత్రి నారా లోకేశ్ కు షర్మిల విజ్ఞప్తి

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో డీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయమై లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని, వారి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉద్దేశించి ఆమె పలు కీలక సూచనలు చేస్తూ, అభ్యర్థుల పట్ల కనికరం చూపాలని కోరారు. డీఎస్సీ విషయంలో అభ్యర్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని షర్మిల పేర్కొన్నారు. "విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గారూ, రేపటి నుంచి డీఎస్సీ పరీక్షలు నిర్వహించడం సరైన పద్ధతి కాదని లక్షలాది మంది అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పటి నుంచి పరీక్ష సమయానికి కేవలం 45 రోజులు మాత్రమే గడువు ఇవ్వడం ఎంతవరకు సమంజసం?" అని ఆమె ప్రశ్నించారు. ఇది మెగా డీఎస్సీ కాదని, అభ్యర్థులను మోసం చేసే 'దగా డీఎస్సీ' అని వారు వాపోతున్నారని షర్మిల తెలిపారు. కనీసం 90 రోజుల ప్రిపరేషన్ సమయం ఉండాలని అభ్యర్థులు కోరుతున్నారని, కేవలం 45 రోజుల్లో మొత్తం సిలబస్ చదవడం సాధ్యం కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆమె వివరించారు. "మూడున్నర లక్షల మంది డీఎస్సీ అభ్యర్థుల పట్ల ప్రభుత్వం కనికరం చూపాలి. వారు మీకు లేఖల మీద లేఖలు రాస్తున్నా స్పందించకపోవడం, నిరుద్యోగుల మొరను పట్టించుకోకపోవడం కూటమి ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు నిదర్శనం" అని షర్మిల విమర్శించారు. డీఎస్సీ వాయిదా వేయాలని కోరడాన్ని రాజకీయ కుట్రగా మంత్రి లోకేశ్ అభివర్ణించడం ఆయన తొందరపాటు నిర్ణయానికి అద్దం పడుతోందని ఆమె అన్నారు. కాంగ్రెస్ పార్టీ పక్షాన కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామని చెబుతూ, డీఎస్సీ నిర్వహణలో పరీక్ష రాసే అభ్యర్థుల డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవాలని షర్మిల కోరారు. "90 పాఠ్య పుస్తకాలను కేవలం 45 రోజుల్లో అభ్యర్థులు ఎలా చదవగలరో ప్రభుత్వం అర్థం చేసుకోవాలి. ప్రిపరేషన్ గడువును మరో 45 రోజులు పెంచే అంశంపై తక్షణమే పరిశీలన చేయాలి" అని ఆమె డిమాండ్ చేశారు. అంతేకాకుండా, నార్మలైజేషన్ పద్ధతిలో కాకుండా డీఎస్సీ పరీక్షలను ఒకే జిల్లా, ఒకే పేపర్ విధానంలో నిర్వహిస్తే బాగుంటుందన్న అభ్యర్థుల వాదనపై కూడా ప్రభుత్వం పునరాలోచన చేయాలని షర్మిల కోరారు.

## మంత్రివర్గంలో మాదిగలకూ అవకాశం కల్పించండి

న్యూఢిల్లీ, : మంత్రివర్గ విస్తరణలో మాదిగలకూ అవకాశం కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌ను ఆ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మందుల సామేల్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలే యాదయ్య కోరారు. గురువారం ఢిల్లీలో వారిని కలిసిన అనంతరం.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. 'మంత్రివర్గంలో నిజమైన మాదిగలకు అవకాశం కల్పించాలి. మంత్రివర్గంలో ఉన్న కొందరు మాదిగలమని చెప్పుకొంటున్నారు.. కానీ తెలంగాణ మంత్రివర్గంలో మాదిగలెవరూ లేరు. ఇది మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేల అంశం కాదు. ఇది యావత్ తెలంగాణ మాదిగల ఆత్మగౌరవానికి చెందిన అంశం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యవసర సమావేశం ఉండడంతో కలవలేకపోయాం. ఈ విషయమై ఆయనకూ లేఖ రాశాం' అని వెల్లడించారు.

## ఉద్యోగుల డిమాండ్లపై క్యాబినెట్‌లో చర్చ.

మొదటి పేజి తరువాయి

మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను భట్టి విక్రమార్క, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు.

క్యాబినెట్ నిర్ణయాలివే..

ఉద్యోగులకు రెండు డీఏలు చెల్లించాలని క్యాబినెట్ నిర్ణయించించి. ప్రస్తుతం ఒక డీఏ, ఆరునెలల తర్వాత మరో డీఏ చెల్లిస్తాం. రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ ఉద్యోగులకు మేలు చేసే విధంగా క్యాబినెట్ నిర్ణయాలు ఉద్యోగుల ఆరోగ్య బీమాకు సంబంధించి ట్రస్ట్ ఏర్పాటు చేస్తాం. బీమాకు ఉద్యోగులు ప్రతినెలా రూ.500చెల్లిస్తే.. ప్రభుత్వం కూడా కొంత చెల్లిస్తుంది. ఉద్యోగులు, ప్రభుత్వం చెల్లించే డబ్బులను ట్రస్టులో జమ చేస్తాం. ఉద్యోగులకు ఏవైనా ఆరోగ్య ససమస్యలు వస్తే ట్రస్టు ద్వారా డబ్బులు చెల్లిస్తాం. ఉద్యోగులకు సంబంధించిన బిల్లుల పెండింగ్ బకాయిలను నెలకు రూ.700 కోట్లకు తగ్గకుండా చెల్లిస్తాం. పెండింగ్ బకాయిలను నెలల వారీగా క్లియర్ చేస్తాం. గతేడాది 385 మంది మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు మరణించారు. మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు మరణిస్తే రూ.10లక్షలు ఇచ్చేందుకు నిర్ణయం. కొత్తగూడెంలోని ఎర్త్ సైన్స్ వర్సిటీకి మన్మోహన్‌సింగ్ పేరు పెట్టేందుకు క్యాబినెట్ నిర్ణయం. హైమ్ విధానంలో రోడ్ల ఆధునికీకరణ చేపట్టాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో 5,100 కి.మీ, పంచాయతీరాజ్ పరిధిలో 7,947 కి.మీ రహదారులు ఆధునికీకరణ. రూ.19,575 కోట్లతో సుమారు 86 కి.మీ మెట్రో నిర్మాణానికి క్యాబినెట్ నిర్ణయం

## బెంగళూరు తొక్కిసలాట... కమిషనర్ సహా ఐదుగురు పోలీస్ అధికారులపై సస్పెన్షన్ వేటు

మొదటి పేజి తరువాయి

"కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ (గిరీష్ ఎ.కె.), ఆ జోన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ) (బాలకృష్ణ), సెంట్రల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) (హెచ్.టి. శేఖర్), స్టేడియం భద్రతకు బాధ్యత వహించిన అదనపు పోలీస్ కమిషనర్, బెంగళూరు నగర పోలీస్ కమిషనర్ (బి. దయానంద)లను తక్షణమే సస్పెండ్ చేయాలని నిర్ణయించాం" అని సిద్ధరామయ్య పేర్కొన్నారు. ఈ విషాద ఘటనకు సంబంధించి ఉప ముఖ్యమంత్రి, హోంమంత్రి, మంత్రులు హెచ్.కె. పాటిల్, ఎం.సి. సుధాకర్, హెచ్.సి. మహదేవప్పలతో పాటు సీఐడీ అధికారులతో చర్చించిన అనంతరం ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు సీఎం వివరించారు. "ప్రాథమికంగా ఈ అధికారుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించాయి. అందుకే వారిని సస్పెండ్ చేయాలని నిర్ణయించాం" అని ఆయన స్పష్టం చేశారు. ఆర్సీబీ జట్టు తొలిసారిగా ఐపీఎల్ ట్రోఫీ గెలిచిన సందర్భంగా జరిగిన సంబరాల్లో ఈ తొక్కిసలాట జరగడం బాధాకరమని, మృతి చెందిన వారికి సంతాపం తెలియజేస్తున్నామని సీఎం అన్నారు. ఈ అంశాన్ని గురువారం జరిగిన సాధారణ కేబినెట్ సమావేశంలో తీవ్రంగా చర్చించామని, నిన్నటి దురదృష్టకర ఘటనపై చర్చించిన తర్వాతే ఈ నిర్ణయాలు తీసుకున్నామని సిద్ధరామయ్య తెలిపారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఫ్రాంచైజీ, డీఎన్‌ఏ ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) ప్రతినిధులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వారిని అరెస్ట్ చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు సీఎం చెప్పారు. వారిపై ఇప్పటికే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. "నేను ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఉప ముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి నుంచి ఇలాంటి ఘటన జరగలేదు. ఈ ఘటన మమ్మల్ని తీవ్రంగా కలచివేసింది" అని సిద్ధరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. "నిన్న ఆదేశించినట్లుగా మేజిస్టీరియల్ విచారణ ప్రారంభమైంది. ఈ పెను విషాదంపై కొంత సమాచారం అందిన తర్వాత, కేబినెట్ సమావేశంలో చర్చించాం. మూడు సంస్థలపై (ఆర్సీబీ, డీఎన్‌ఏ ఈవెంట్స్, కేఎస్‌సీఏ) దర్యాప్తును సీఐడీకి అప్పగించాం" అని ఆయన పునరుద్ఘాటించారు.

## పుతిన్ గట్టిగానే చెప్పారన్న ట్రంప్.. ధ్రువీకరించిన క్రెమ్లిన్

ఇంటర్నెట్‌డెస్క్: ఉక్రెయిన్ డ్రోన్ల దాడికి తాము బదులుతీర్చుకుంటామని రష్యా అధ్యక్షుడు పుతిన్ తనతో చాలా గట్టిగా చెప్పారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ విషయాన్ని రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ ధ్రువీకరించింది. ప్రతీకార దాడులు చేయాలన్న తమ ప్లాన్ గురించి ఫోన్ కాల్‌లో ట్రంప్‌నకు వెల్లడించినట్లు తెలిపింది. పుతిన్‌తో 75 నిమిషాల పాటు ఫోన్‌లో మాట్లాడానని, సంభాషణ సవ్యంగానే కొనసాగినప్పటికీ ఉక్రెయిన్- రష్యా మధ్య శాంతి సాధనకు అది ఉపకరించదని సామాజిక మాధ్యమంలో ట్రంప్ పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే క్రెమ్లిన్ స్పందన వచ్చింది. తుర్కియే నగరం ఇస్తాంబుల్ వేదికగా రష్యా, ఉక్రెయిన్ మధ్య మరోసారి శాంతి చర్చలు జరగనున్న వేళ.. 'స్పైడర్ వెబ్' పేరుతో గత ఆదివారం మునుపెన్నడూ లేని రీతిలో ఉక్రెయిన్ భారీ ఆపరేషన్ చేపట్టింది. ఏకంగా రష్యా భూభాగంలోకి కంటెయినర్లలో డ్రోన్లను తరలించి వైమానిక స్థావరాలే లక్ష్యంగా ఉక్రెయిన్ దాడులు చేపట్టింది. ఈ ఘటనలో రష్యాకు చెందిన 41 యుద్ధ విమానాలు, పలు ఎయిర్ బేస్‌లు ధ్వంసం అయ్యాయి. రష్యా భూభాగంలోని 4,000 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇర్కుట్స్క్ ప్రాంతంలోని వైమానిక స్థావరంలోకి వెళ్లి మరీ డ్రోన్లు దాడులు చేశాయి. ఈ దాడిలో టీయూ-95, టీయూ-22ఎం3 బాంబర్లు, కీలకమైన ఏ-50 ఎయిర్ క్రాఫ్టులు ఈ ఘటనలో ధ్వంసం అయ్యాయి. మూడేళ్లకు పైగా కొనసాగుతున్న యుద్ధంలో ఈ ఘటన మాస్కోకు పెద్ద కుదుపు కాగా, ఉక్రెయిన్ దళాలకు మరింత ఆత్మస్థైర్యం లభించినట్టు అంతర్జాతీయ విశ్లేషకులు తెలిపారు.

### ఉక్రెయిన్‌పై డ్రోన్లతో దాడి..

ఈ పరిణామాల వేళ రష్యా గురువారం ఉక్రెయిన్‌లోని ప్రైలుకీ నగరంలో డ్రోన్ల దాడి జరిపింది. అవి నివాస ప్రాంతాన్ని తాకాయని, ఒక ఏడాది బిడ్డ సహా ఐదుగురు మృతిచెందారని అధికారులు వెల్లడించారు. ఆ నగరం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు 100 కి.మీ.దూరంలో ఉంది. అక్కడ ఎలాంటి మిలిటరీ ఆస్తులు లేవు. ఇక ప్రైలుకీతో పాటు మిగిలిన నగరాలను కూడా 103 డ్రోన్లు తాకాయని అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు.

## స్వర్ణాంధ్ర అంటే ఆదాయం మాత్రమే కాదు.. ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ

మొదటి పేజి తరువాయి

గ్లోబల్ వార్మింగ్ ప్రపంచానికే పెద్ద సవాల్‌గా మారింది. దీంతో వాతావరణంలో మార్పులు వస్తున్నాయి. పద్మశ్రీ వనజీవి రామయ్య నా వద్దకు ఎప్పుడు వచ్చినా.. మొక్క తీసుకుని వచ్చేవారు. ఆయన్ను అందరం స్మరించుకోవాల్సిన అవసరముంది. ఇవాళ 16 రకాల మొక్కలు నాటాం. మూడేళ్ల వరకు మనం మొక్కను కాపాడితే తర్వాత అదే పెరుగుతుంది. ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం కూడా పర్యావరణ పరిరక్షణలో కీలకమైంది. స్వర్ణాంధ్ర అంటే కేవలం ఆదాయం పెంచడం మాత్రమే కాదు. ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించుకోవడమూ అందులో భాగమే. నా మనసుకు బాగా దగ్గరగా ఉండే సబ్జెక్ట్ పర్యావరణ పరిరక్షణ. ప్లాస్టిక్ వినియోగం మనుషులకే కాదు.. జంతువులకూ ప్రమాదంగా మారింది. మనం తినే తిండి, పండించే పంటలు ప్లాస్టిక్ మయం అవుతున్నాయి. కొందరు చికెన్ వ్యర్థాలను చేపల పెంపకంలో వాడుతున్నారు. చేపలకు చికెన్ వ్యర్థాలు వేస్తే... అనారోగ్య సమస్యలు వస్తాయి. స్వార్థంతో కాకుండా అందరం భావితరాల కోసం బతకాలి. రాయలసీమలో హార్టికల్చర్ బాగా అభివృద్ధి చెందుతోంది. చెత్త నుంచి కూడా సంపద సృష్టించే మార్గాలు ఉన్నాయి. వరి వ్యర్థాల నుంచి కూడా బయో ఫ్యూయల్ తయారు చేసే అవకాశం ఉంది. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రయత్నాలను గతంలోనే ప్రారంభించాం. తెదేపా ప్రారంభించిన ప్రయత్నాలను గత వైకాపా ప్రభుత్వం మధ్యలోనే నిలిపివేసింది. " అని చంద్రబాబు అన్నారు.

### చెట్టు లేని జీవితాన్ని ఊహించలేం: పవన్ కల్యాణ్

పర్యావరణ పరిరక్షణ కోసం తన వంతుగా ఏదైనా సాధించి మాట్లాడతానని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. చెట్టు లేని జీవితాన్ని ఊహించలేమని చెప్పారు. ఒకప్పుడు ఇంటి చిరునామాకు చెట్లే ఆనవాళ్లుగా ఉండేవని తెలిపారు. ప్రకృతిని ప్రేమించే వ్యక్తి మనకు సీఎంగా ఉన్నారని పేర్కొన్నారు. 50 శాతం పచ్చదనం లక్ష్యం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తామని వివరించారు.

## కాళేశ్వరంపై 10న సీఎం సమీక్ష!

హైదరాబాద్, : కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికతోపాటు బ్యారేజీల వైఫల్యానికి కారకులైన వారిపై విజిలెన్స్ చేసిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 10న సమీక్షించే అవకాశాలు ఉన్నాయి. గురువారం నాటి క్యాబినెట్ సమావేశంలోనే ఈ సమీక్ష ఉంటుందని భావించినా.. ఉద్యోగులకు సంబంధించిన అంశాలపైనే సుదీర్ఘంగా చర్చ జరగడంతో వాయిదా పడింది. వాస్తవానికి రెండున్నర నెలల కిందటే కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చింది. దాని ప్రకారం బ్యారేజీలపై కార్యాచరణ ప్రణాళికలు అందించాలని ప్రభుత్వం నిర్మాణ సంస్థలను కోరింది. కానీ మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ధిక్కారస్వరం వినిపించడంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సీఎం సమీక్ష కీలకంగా మారింది. ఇక కీలకమైన గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు అంశంపై కూడా సీఎం 10వ తేదీన సమీక్షించనున్నారు.

## ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి: సురేఖ

హైదరాబాద్, : ప్రపంచానికి సవాలుగా మారిన ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రభుత్వం, ప్రజలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా అంతం చేయడం' అనే థీమ్‌తో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు.

## బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 6 (శుభోదయం న్యూస్) : పట్టణ బిజెపి కమిటీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ సూచన మేరకు కసాపురం రోడ్డు దుర్గమ్మ గుడి వెనుక భాగంలో శివాలయం దేవాలయం దగ్గర మొక్కలు జూన్ 5 అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గౌరవనీయులైన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ పిలుపుమేరకు జూన్ 5 నుండి ఆగస్టు 15 వరకు ప్రతి ఒక్కరు తమ మాతృ మూర్తి అమ్మ పేరుతోఒక మొక్క నాటి దాన్ని పరిరక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడుకుందాం ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు వాతావరణం లో మార్పు అధికంగా ఎండలు తీవ్ర ప్రభావం వాతావరణం లో వాయు కాలుష్యం వాతావరణం మార్పులు సంభవించడం వలన ప్రజలు అనారోగ్యానికి అనేక వ్యాధులు సంభవించే పరిస్థితి ఏర్పడుతుంది ప్రకృతిలో మార్పు ప్రకృతి మన ఇంటి లాంటిది కంటికి రెప్పలా కాపాడుతున్న అలాంటి ప్రకృతిని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా రాబోయే తరాలకి ప్రకృతిని ఆశీర్వదిస్తూ పచ్చగా ఆహ్లాదకంగా భారతదేశాన్ని ఆరోగ్యంగా ఉండేలాగా ప్రతి ఒక్కరు తమ బాధ్యతగా వారి అమ్మ పేరుతో ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షిస్తూ కుందాం పర్యావరణ పరిరక్షణ మన ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు వడ్డే రమేష్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిమి రామాంజనేయులు మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వనగుంది విజయలక్ష్మి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సూర్యనారాయణ పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాసులు. వెంకట రాఘవ. పట్టణ ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి. శివశంకర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని
## ముప్పుకు కారణం అవుతున్న ప్లాస్టిక్ పై సమరం చేద్దాం
### మున్సిపల్ కమిషనర్ నయిూ అహ్మద్



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 6 (శుభోదయం న్యూస్): పర్యావరణానికి తీవ్ర ముప్పుగా ఉన్న ప్లాస్టిక్ పై సమరం చేద్దామని పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ నయుం అహ్మద్ పిలుపునిచ్చారు గురువారం అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ సందర్భంగా సరోజినీ నాయుడు బాలికల ఉన్నత పాఠశాల వద్ద నుండి వాల్మీకి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## కోర్ట్ ఆవరణలో మొక్కలు నాటిన జూనియర్ జడ్జి జి.మంజుల



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూనారు (శుభోదయం న్యూస్): అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జూనియర్ జడ్జి



జి.మంజుల కోర్టు ఆవరణలో మొక్కలను నాటారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది బిఎస్ కృష్ణారెడ్డి బార్ అసోసియేషన్ యూనస్ అహ్మద్, వెంకట్ నాయుడు, బడే సాబ్, గోపాలకృష్ణ రజాబ్ వలి, కోర్టుసూపర్డెంట్ కిరణ్ ,బార్ అసోసియేషన్ తిమ్మప్ప, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు ,వి నాగరాజు న్యాయవాదులు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## హైకోర్టు జడ్జి హరి హరినాథ్ శర్మన్ మర్యాదపూర్వకంగా కలిసిన.....
## మైత్రి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ రామ్మోహన్



గుంతకల్లు ప్రతినిధి - పల్లె రామాంజనేయులు జూన్ 6 (శుభోదయం న్యూస్) : హైకోర్టు జడ్జి హరినాథ్ శర్మను గురువారం కేపిఆర్ మైత్రి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ బిజెపి జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రామ్మోహన్ మందగిరి శివాలయం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు.

## పచ్చదనం పరిరక్షణలో భాగస్వామ్యమవ్వండి
## మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు







ఉమ్మడి అనంతపురం జిల్లా బ్యూరో "నరేంద్ర" (శుభోదయం న్యూస్) : ధర్మవరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా భారత దేశ గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి మరియు ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ పిలుపుమేరకు, ధర్మవరం పట్టణంలో మొక్కల నాటింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మంత్రి నియోజకవర్గ ఇంచార్జ్ హరీష్ బాబు పాల్గొన్నారు. వారు కలిసి పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ %-%గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపుమేరకు అమ్మ పేరుతో ఓ మొక్క అనే కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించబడుతోంది. దీనిలో భాగంగా జూన్ 5 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించాలి. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదు %-% ఇది ప్రతి పౌరుడి బాధ్యత. భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన జీవన వాతావరణం అందించాలంటే, ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక్క మొక్కను నాటి, దానిని పెంచడం ద్వారా ధర్మవరం పట్టణాన్ని పచ్చదనంతో నింపాలనే సంకల్పంతో ముందడుగు వేసినట్టు నాయకులు తెలిపారు. అదేవిధంగా మొక్కలు నాటే ఈ ఉద్యమం ద్వారా ప్రజల్లో పచ్చదనంపై అవగాహన పెంచుతూ, పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యత గల సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, శాంసన్, కేశవ, వీరేష్, మున్సిపల్ మహిళా అధికారులు, జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్, ధర్మవరం పట్టణ అధ్యక్షులు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబులేష్, బిజెపి మహిళా నాయకురాలు రాధమ్మ, మహాలక్ష్మి, మైనార్టీ నాయకులు నబి రసూల్, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరా నిలిపివేత

పిడుగురాళ్ల, టౌన్ రిపోర్టర్ - శీనివాసరావు (శుభోదయం నూస్): పిడుగురాళ్ల పట్టణ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు ముఖ్య గమనిక నేటి ఉదయం ఎరపతినేని నగర్ చెరువు కట్ట బజార్ రజక కాలనీ రిక్షా కాలనీ అడితి సెంటర్ బ్రహ్మంగారి టెంపుల్ ఏరియా కనకదుర్గమ్మ టెంపుల్ ఏరియా ఫేమస్ ఫంక్షన్ హాల్ ఏరియా న్యూ రవితేజ టెక్స్టైల్స్ ఏరియా బస్టాండ్ ఏరియా సుజనా సహస్ర సూపర్ మార్కెట్ ఏరియా నేటి ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సప్లై ఉండదు. దయచేసి విద్యుత్ వినోగదారులు గమనించి విద్యుత్ శాఖకు సహకరించగలరని పిడుగురాళ్ల టౌన్ ఏఈ కోరారు.

## ప్రకృతి పరిరక్షణ అందరి ఆశయం కావాలి



రెంటచింతల, మండల రిపోర్టర్ - శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): ప్రకృతికి మానవుడికి అవినాభావ సంబంధం ఉందన్న వాస్తవాన్ని గ్రహించి ప్రకృతి పరిరక్షణే అందరి ఆశయంగా కార్యోన్ముఖులు కావాలని విద్యావేత్త నారాయణపురం శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రకృతి సహజ సిద్ధంగా ప్రసాదించిన విలువైన సంపదలు భూమి, గాలి, నీరు, వృక్షాలన్నారు. వీటి మీద ఆధారపడి జీవనం సాగించే మానవులకు తరగతి సంపద లభ్యత పర్యావరణాన్ని మొక్కలు నాటడం ద్వారా కాపాడి రాబోయే తరాలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందిద్దామన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ లో సిబ్బంది మొక్కలు నాటారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారి మాట్లాడుతూ ప్రకృతిలో పుట్టి ఎదిగిన మానవుడు తన స్వార్థం కోసం ప్రకృతిని నాశనం చేయడానికి సిద్ధపడటం వల్లే పర్యావరణానికి ముప్పు వాటిల్లి మానవ వినాశనానికి దారి తీయడం జరుగుతోందన్నారు. సకల జీవరాసులకు ప్రాణాధారమైన పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వాడకం తగ్గించి, చెట్లను పెంచి మన భవిష్యత్ తరాల సంపూర్ణ ఆరోగ్యానికి పునాదులు వేద్దామని సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీసీపీడీసీఎల్ సిబ్బంది వేణు, రాజు,ప్రభు తదితరులు పాల్గొన్నారు.

## ఆకుపచ్చని గన్నవరం లక్ష్యం : యార్లగడ్డ
## అక్రమ కేసులు అనేవాళ్ళు అప్పట్లో ఏపార్టీలో ఉన్నారు



గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ - సురేష్ (శుభోదయం న్యూస్) : నియోజకవర్గంలో పచ్చదనం పెంపొందించేదుకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. గన్నవరం గాంధీ బొమ్మ సెంటర్లో గురువారం ఉదయం మొక్కలు నాటి వనమహోత్సవ కార్యక్రమాన్ని యార్లగడ్డ ప్రారంభించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారిపై గన్నవరం నియోజవర్గంలోని గ్రామాలతోపాటు నియోజకవర్గం ప్రారంభ గ్రామమైన రామవరపాడు నుంచి చివరి గ్రామమైన బొమ్మలూరు వరకు పచ్చదనాన్ని పెంపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే బాపులపాడులో మొక్కలు నాటామని, గన్నవరంలోనూ మొక్కలు నాటుతున్నామని, మరో 10 రోజుల్లోనూ రామవరపాడులోనూ మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని వివరించారు. గతంలో గన్నవరం విమానాశ్రయం నుంచి రామవరప్పాడు వరకు 45వేల చదరపు మీటర్లు ఉన్న పచ్చదనాన్ని మరో 45వేల చదరపు అడుగులకు పెంచుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గన్నవరం నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. మల్లవల్లి పారిశ్రామిక వాడలో 427 పరిశ్రమలకు భూములు కేటాయించామని భూమి కేటాయించిన తర్వాత 18 నెలల్లో పరిశ్రమ ప్రారంభించకపోతే భూ కేటాయింపులను రద్దు చేస్తామని హెచ్చరించారు. మల్లవల్లి లో ప్రస్తుతం ఉన్న పారిశ్రామికవాడకు అదనంగా మరో 450 ఎకరాల భూమిని పరిశ్రమలకు కేటాయించనున్నట్లు యార్లగడ్డ తెలిపారు. వీరపనేని గూడెంలో పరిశ్రమల ఏర్పాటుకు 50 ఎకరాల భూమి అందుబాటులోకి వచ్చిందన్నారు. ఆసక్తి గల పారిశ్రామికవేత్తలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. గన్నవరంలో అక్రమ కేసులు పెడుతున్నారన్న వైసీపీ నాయకుల ఆరోపణలను యార్లగడ్డ వద్ద మీడియా ప్రస్తావించగా ప్రస్తుతం వైసిపి నాయకులు చెబుతున్న కేసులన్నీ వైసీపీ ప్రభుత్వంలో పెట్టినవేనని గుర్తు చేశారు. టిడిపి కార్యాలయం దాడి, నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ ఈ రెండు కేసులు వైసీపీ ప్రభుత్వంలోనే నమోదు చేసారని చెప్పారు. మినప చేను తొక్కించారంటు జగన్మోహన్ రెడ్డి పై కేసులు పెట్టింది ఎవరని ప్రశ్నించారు. అక్రమ కేసులు అంటున్న వారంతా అప్పట్లో ఏ పార్టీలో ఉన్నారని సూటిగా ప్రశ్నించారు. తాను అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క అక్రమ కేసు కూడా పెట్టలేదని తన స్థాయికి తగ్గ వాళ్ళు వస్తే దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని యార్లగడ్డ సవాల్ చేశారు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసిపి పాలకులు సాగునీటి రంగాన్ని గాలికి వదిలేయడంతో బుడమేరుతోపాటు, పంట కాలవలకు గండ్లు పడి సాగునీటి ఇబ్బందులు తప్పటం లేదన్నారు. పంట కాలువలకు గత ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో కాలువలు గండ్లు పడి సాగునీటి ప్రవాహానికి ఇబ్బందిగా ఉందన్నారు. యుద్ధ ప్రాతిపదికన కాలువల మరమ్మతులు పూర్తి చేసిన అనంతరం సాగునీటి విడుదల చేయనున్నట్లు యార్లగడ్డ వివరించారు. రోగుల సౌకర్యార్థం కానూరు శేష మాధవి ఏర్పాటు చేసిన అంబులెన్స్ ను యార్లగడ్డ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, బిజెపి నాయకులు చిగురుపాటి కుమారస్వామి, నాదెండ్ల మోహన్, టిడిపి నాయకులు దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, మద్దినేని వెంకటేశ్వరరావు, కొమ్మరాజు సుధీర్, మేడేపల్లి రమ, మొవ్వ వెంకటేశ్వరావు, కొమ్మారెడ్డి రాజేష్, ఆరుమళ్ళ కృష్ణారెడ్డి, గొడ్డళ్ళ చిన్న రామారావు, మూల్పూరి సాయి కళ్యాణి, పడమట రంగారావు,పాలడుగు మల్లికార్జునరావు, యానమదల సతీష్ తదితర టిడిపి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు పాలనతోనే పేదలకు న్యాయం జరుగుతుంది
## సీపీఐ జిల్లా, రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి
## సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య





యర్రగొండపాలెం, నియోజకవర్గ ఇంచార్జి - కాకర్ల కోటయ్య (శుభోదయం న్యూస్) : భారత కమ్యూనిస్ట్ పార్టీ పాలనతోనే పేదలకు న్యాయం జరుగుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య అన్నారు. గురువారం యర్రగొండపాలెంలోని షాదీఖానాలో సీపీఐ నియోజకవర్గ 4వ మహాసభ నిర్వహించారు. ఈ సభకు పూర్ణకంటి తిరుమలయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకులు నిర్వహించే ఈ కార్యక్రమాలు జనంలోకి వెళ్తాయి తద్వారా పాలకవర్గాలకు బుద్ధి చెప్పడానికి అవకాశం వస్తుందన్నారు. బూర్జువా పార్టీల నాయకులు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలు సచ్చిపోయాయని చెబుతారో వారికి ఒంగోలులో జరిగే రాష్ట్ర మహాసభలో ఎర్రదండు కవాతు తొక్కి పాలకవర్గాలకు చూపించాలని అన్నారు. రాబోయే 2029 ఎన్నికల నాటికి దోపిడీ పాలకవర్గాలను బద్దలు కొట్టి, రాజకీయ ప్రత్యామ్నాయాన్ని రాష్ట్రంలో నిర్మాణం చేపడతాం అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, పంటకు గిట్టుబాటు ధర, పొలాలకు సాగునీరు, బీడు భూములు పండాలి, కూలీలకు కూలి పెరగాలి, మహిళలకు రక్షణ కల్పించాలన్న లక్ష్యంతో మనం ముందుకు సాగాలన్నారు. అధికారంలోకి వచ్చిన ప్రజా నాయకులు వారి వ్యాపారాలు కాపాడుకోవడానికి తప్పా ప్రజల సమస్యల మీద పనిచేసే నాయకుడే లేడని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కి హామీలు ఇచ్చేటప్పుడు తెలియదా బడ్జెట్ ఎంత ఉంది, 14 లక్షల కోట్లు అప్పు ఉన్న సంగతి ముందు తెలియదా అని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు పరచాలని ఆయన అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ పేద ప్రజల పక్షాన పోరాడేది సిపిఐ అని,పేదలకు అండగా ఎర్రజెండా ఎల్లవేళలా ఉంటుందని అన్నారు.ఈ నెల 21నుంచి 23 తేది వరకు దర్శిలో పార్టీ జిల్లా మహా సభలు జరుగుతాయని, ఆగస్టు నెలలో రాష్ట్ర మహా సభలు ఒంగోలు లో జరుగుతాయని, అధిక సంఖ్య లో తరలి రావాలని పిలుపు నిచ్చారు. దళితులు అట్టడుగు వర్గాల వారికి భూములు ఇళ్ల స్థలాలు పంపిణి చేయించడం లో పార్టీ ఎన్నో ఉద్యమాలు చేపట్టిందన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తుందని, రైతులను ఆదుకోవడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం కూడా ఎన్నికల హామీలను నెరవేర్చలేకపోయిందని ఆయన అన్నారు. తోలుత పార్టీ జెండాను సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గ సమితి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు దేవండ్ల శ్రీనివాస్, జి.గురునాథం, కె.వి.కృష్ణ గౌడ్, ఎం సాంబశివరావు, దాసరి మల్లికార్జున, బాణాల రామయ్య, నక్కా తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలు కూడా
## పచ్చదనంతో నిండాలి : ఎరిక్షన్ బాబు





ఎర్రగొండపాలెం, మండల రిపోర్టర్ - నారాయణ (శుభోదయం న్యూస్): యర్రగొండపాలెం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వనం - మనం కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో చెట్లను నాటాలని, ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బొట్ల వారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న దారపనేని



పామూరు, మండల రిపోర్టర్ - బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి నియోజకవర్గం పామూరు మండలం తిరగండ్లదిన్నె గ్రామ వాస్తవ్యులు బొట్ల కోటయ్య (తెల్లయ్య) శ్రీమతి వెంకటనారాయణమ్మ దంపతుల ద్వితీయ కుమారుడు చిరంజీవి పవన్ కళ్యాణ్ యాదవ్, సీఎస్ పురం మండలం కొవిలంపాడు (మిట్టపాలెం) వాస్తవ్యులు ఎలిక వెంకటనారాయణ శ్రీమతి బాలమ్మ దంపతుల కనిష్ట పుత్రిక లక్ష్మీ సౌభాగ్యవతి నాగ పద్మ ల వివాహ వేడుకలు గురువారం ఉదయం 4 గంటలకు తిరగండ్లదిన్నె గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ మహోత్సవ వేడుకల్లో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొని ముత్యాల పందిరిలో వేదమంత్రాల మధ్య కొత్త జీవితంలో అడుగుపెడుతున్న వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ బొట్ల నాగార్జున, మాజీ సర్పంచ్ మల్లెబోయిన గురుబ్రహ్మం, గోపి, మల్లె బోయిన బాల బ్రహ్మయ్య, రాజు, శివరామయ్య, బ్రహ్మయ్య, శివశంకర్ ,మేకల బాల గంగయ్య, బొట్ల కోటేశ్వరరావు, నాగేశ్వరరావు, మట్లె రాహుల్ యాదవ్, యరశింగు రాయుడు,నుచ్చుపొద ఫిషర్ మెన్ కమిటీ మాజీ అధ్యక్షులు కౌలూరి ఖాజా రహమతుల్లా, గోసుల సురేంద్రబాబు (చంటి) నిజాముద్దీన్, బొట్ల వారి కుటుంబ సభ్యులు, మల్లె బోయిన వారి కుటుంబ సభ్యులు ఎలికా వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో పాల్గొని వధూవరులను అక్షింతలతో ఆశీర్వదించారు.

## పైడాల వారి గృహప్రవేశం కార్యక్రమంలో
## పాల్గొన్న పామూరు మండలం వైసీపీ నాయకులు



పామూరు మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): కనిగిరి టౌన్ పవిత్ర ఫంక్షన్ హాల్ దగ్గర పైడాల శ్రీనివాస రెడ్డి (టీచర్) వెంకట నారాయణమ్మ గార్ల నూతన గృహప్రవేశం కార్యక్రమానికి హాజరై సత్యనారాయణ స్వామి వ్రతములో పాల్గొని మీరు నూతన గృహములో సుఖ,సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ శుభాకాంక్షలు తెలియజేసిన వైసీపీ పామూరు మండల పార్టీ అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, సీనియర్ నాయకులు కల్లూరి రామిరెడ్డి,వైసీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ సెక్రటరీ గట్ల విజయభాస్కర్ రెడ్డి,రావిగుంటపల్లి సర్పంచ్ పైడాల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మన్నెపల్లి చిన్ని మృతి బాధాకరం : కదిరి బ్రదర్స్



పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): సిఎస్ పురం గ్రామానికి చెందిన మన్నెపల్లి చిన్ని మృతి బాధాకరమని కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు సోదరులు కదిరి ప్రకాశ్ రావు, కదిరి పార్థసారథి అన్నారు. చిన్ని హైదరాబాద్ లో ప్రైవేట్ హాస్పిటల్ లో అనారోగ్యంతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. విషయ తెలుసుకున్న కదిరి ప్రకాశ్ రావు, కదిరి పార్థసారథి గురువారం సిఎస్ పురంలోని చిన్ని నివాస గృహానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చిన్ని తమ కుటుంబంతో గత నలభై సంవత్సరాలుగా తమ కుటుంబ సభ్యునిగా ఉండేవారని అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని అన్నారు. చిన్ని కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.



# కోటి మొక్కలు నాటుదాం కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కార్యదర్శి కోటపాటి

పామూరు, మండల రిపోర్టర్ – బండి రమేష్ (శుభోదయం న్యూస్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలో పచ్చదనం పెంచడం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న కోటి మొక్కలు నాటుదాం కార్యక్రమంలో భాగంగా పామూరు మండలం బొట్లగూడూరు గ్రామం లో మొక్కలు నాటుతున్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీ కోటపాటి జనార్దనరావు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్, సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు



పామూరు, మండల రిపోర్టర్ బండి రమేష్ (శుభోదయం న్యూస్): పామూరు మండలం చిలకపాడు గ్రామంలో ఎన్ హెచ్ 565 ప్రమాదవశాత్తు టాక్టర్ బోల్తాపడటంలో ప్రమాదానికి గురైన డ్రైవర్ ను పామూరు వస్తున్న డి.ఎస్.పి సాయి ఈశ్వర్ యశ్వంత్ మరియు సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమా నాయక్ సబ్ ఇన్స్పెక్టర్ కిషోర్ బాబు గమనించి పోలీసు వాహనంలో వైద్య నిమిత్తం పామూరు వైద్యశాలకు తరలించారు.

# మొక్కలను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి.. మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు... టిడిపి మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు...




తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): గ్రామీణ పట్టణ ప్రాంతాలలోనే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు అన్నారు. గురువారం చెన్నంపల్లి గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం? వన మహోత్సవ కార్యక్రమం సందర్భంగా మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.



అలాగే రాంపల్లి గ్రామంలో టిడిపి మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు, ఉప్పర్లపల్లి గ్రామంలో టిడిపి నాయకుడు అప్పా వేణు గోపాల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం? వన మహోత్సవం కార్యక్రమాల సందర్భంగా రాష్ట్రంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించడం జరిగిందన్నారు. ఏపీవో హేమ సుందర్ మాట్లాడుతూ మండలంలో 8 వేలు మొక్కలను నీటి యాజమాన్య సంస్థ ,మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు మా భాష, బత్తిన దేవేంద్ర, అక్బర్ బాషా, కొటేష్ గౌడు, రామయ్య , ఉప్పర్లపల్లి విశ్వనాథ్, రాంపల్లి శ్రీనివాసులు, ఏమాద్రి నాయుడు, రాంపల్లి పంచాయతీ కార్యదర్శి పులి రాజు, జూనియర్ ఇంజనీరు రాజశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్లు రామకృష్ణ, అంజి, జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ కేంద్రమంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ను కలిసి ఏపీ ఎంఆర్పిఎస్ నాయకులు.. ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కా పకీరప్ప...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మాజీ కేంద్రమంత్రి ,డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి ను గురువారం ఏపీ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కా పకీరప్ప, పలువురు ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏపీ ఎమ్మార్పీఎస్ కర్నూలు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చెక్కా పక్కిరప్ప మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చట్టబద్ధత తీసుకొచ్చారని అన్నారు. తక్షణమే విద్యా, ఉద్యోగ, సంక్షేమ, రాజకీయ రంగంలో ఎస్సీల వర్గీకరణను అమలు చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి ను కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎంఆర్పిఎస్ నాయకులు ఆవుల రాము, రాజశేఖర్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జరిగిన ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఠాగూర్ నాయక్, సిహెచ్ఓ విజయ్ కుమారి ల వివాహ వేడుకలు..

## వివాహ వేడుకలకు హాజరైన ప్రముఖులు, అధికారులు...



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్ ): మండల పరిధిలోని బాట తండాలో సచివాలయ ఇంజనీర్ అసిస్టెంట్ ఠాగూర్ నాయక్, కమ్యూనిటీ హెల్త్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్ ల వివాహ వేడుకలు గురువారము ఘనంగా జరిగాయి. ఈ వివాహ వేడుకలకు మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు, బోడబండ ఆలయ కమిటీ చైర్మన్ అప్పా వేణుగోపాల్, మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్ ,మాజీ సర్పంచులు బీసీ వెంకటస్వామి, శ్రీనివాస్ గౌడ్, ఎర్రగుడి రామచంద్రారెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు



జిట్టా నగేష్ యాదవ్, జడ్పిటిసి పులికొండ నాయక్, మాజీ జెడ్పిటిసి నారాయణ నాయక్, వైస్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, సర్పంచ్ సలహాదారుడు రాము నాయక్, లక్ష్మీ తండ వెంకటేష్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ రాము నాయక్, పంచాయతీ కార్యదర్శుల ఉద్యోగుల సంఘం నేత రాజు నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్ విజయ్ పలువురు ప్రభుత్వ అధికారులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకలకు హాజరైన వారికి సర్పంచ్ సలహాదారుడు రాము నాయక్ ఆహ్వానించి స్వాగతం పలికారు.

# శాంతియుతంగా పండుగలను జరుపుకుందాం : డీఎస్పీ శ్రీనివాసులు



గుంతకల్లు ప్రతినిధి – పల్లె రామాంజనేయులు జూన్ 6 (శుభోదయం న్యూస్): హిందూ ముస్లిం సోదరులు తమ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇది సమైక్యతకు పునాది వంటిదని డిఎస్పి శ్రీనివాసులు పేర్కొన్నారు గురువారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో హిందూ, ముస్లిం మత పెద్దల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా డిఎస్పి శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలో హిందూ ముస్లిం పండుగలను ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు బక్రీద్ పండుగను కూడా ముస్లిం సోదరులు జరుపుకోవాలని కోరారు ఈ సమాజంలో వన్టౌన్ సిఐ మనోహర్, టూ టౌన్ సీఐ ఏపీ మస్తాన్, రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, కసాపురం ఎస్ఐ వెంకటస్వామి లు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం- వన మహోత్సవం కార్యక్రమం.




నంద్యాల రిపోర్టర్/ మోహన్ (శుభోదయం న్యూస్ ): ప్రపంచవ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం' అనే ఇతివృత్తంతో ప్రభుత్వ చౌరవ కార్యక్రమంలో భాగంగా నంద్యాలలోని నూనేపల్లి మున్సిపల్ హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నంద్యాల జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గనియా ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు న్యాయ మరియు న్యాయ శాఖ మంత్రి శ్రీ..%చీ%.ఎండీ. ఫరూక్ పాల్గొన్నారు. జిల్లా కమిషనర్ స్కౌట్స్ మరియు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ.పి.జనార్ధన్ రెడ్డి మార్గదర్శకత్వంలో, ఎపి మోడల్ స్కూల్ పాణ్యం యూనిట్ స్కౌట్స్ మరియు గైడ్స్ జూన్ 05న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఇక్కడ జరిగిన వేదిక వద్ద ముఖ్య అతిథులు క్యాబినెట్ మంత్రి మరియు జిల్లా కలెక్టర్ కు గౌరవ మర్యాదలు మరియు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు గాను పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. చెట్ల పెంపకం యొక్క ప్రాముఖ్యత, పర్యావరణాన్ని కాపాడటం, ప్లాస్టిక్ నిషేధం వంటి అంశాలను అతిథులు ప్రేక్షకులకు వివరించారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత : మంత్రి సత్య కుమార్ యాదవ్



రెంటచింతల, మండల రిపోర్టర్ -శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన జీవన వాతావరణం అందించాలంటే ప్రతి ఇంటిలో కనీసం ఒక మొక్కను నాటి పెంచడం ద్వారా గ్రామాన్ని పచ్చదనంతో నింపాలనే సంకల్పంతో ముందుకెళ్లాలని, ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమమే కాదు ప్రతి పౌరుడి బాధ్యత అని రాష్ట్ర వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అన్నారు. గురువారం రెంటచింతలలో జరిగే ఓ వివాహ వేడుకలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన స్థానిక బిజెపి యువ నాయకుడు రాజశేఖర్ రెడ్డి ఇంట జరిగిన సమావేశంలో మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ పట్ల బాధ్యత గల సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు అమ్మ పేరుతో ఒక మొక్క అనే కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహించబడుతోందన్నారు. దీనిలో భాగంగా జూన్ 5 నుంచి ఆగస్టు 15 వరకు ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల పేరుతో ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు బిజెపి నాయకులు శాలువా కప్పి సత్కరించారు. సమావేశంలో పాశం మట్టారెడ్డి, పుల్లారెడ్డి పలువురు మహిళా నేతలు ఉన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి సామాజిక బాధ్యత






గన్నవరం, నియోజకవర్గ ఇన్చార్జ్ – సురేష్ (శుభోదయం న్యూస్) :నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావురంగన్న గూడెం లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలురాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు దశ దిశ నిర్దేశంతో గన్నవరం శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు సూచనలతో "ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని" పురస్కరించుకొని కృష్ణా జిల్లా బాపులపాడు మండలం రంగన్న గూడెం గ్రామంలో ఈరోజు ఉదయం "ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయటం" అనే నినాదంతో ప్లేకార్డు ప్రదర్శించి ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2025 ప్రాముఖ్యతను వివరిస్తూ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నాగర్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, గ్రామ సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపిటిసి సభ్యులు పుసులూరు లక్ష్మీ నారాయణ, పంచాయతీ కార్యదర్శి ఎస్.పద్మ, ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. ఫీల్డ్ అసిస్టెంట్ ధర్మవరపు వెంకట రమణ తదితరులు గ్రామ సచివాలయము, వీరవల్లి రంగన్న గూడెం ఆర్.అండ్.బి. రహదారి గ్రామం లోని ప్రధాన రహదారుల ప్రక్కన 100 మొక్కలను నాటారు. ఇదే విషయమై ఈరోజు ఉదయం ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు రంగన్న గూడెం నుండి మాట్లాడుతూ మానవ తప్పిదాల వలన పర్యావరణ సమతుల్యం దెబ్బతిని ప్రకృతి విధ్వంసాల కారణంగానే ఇటీవల కాలంలో జంతు సంక్రమిత వ్యాధులైన నిఫా, ఎబోలా, ఏవిఎన్ ఇన్ఫ్లుఎంజా, జికా, కరోనా వైరస్ లు ప్రబలుతున్నాయి అని ప్రఖ్యాత శాస్త్రవేత్తలు ఏకాభిప్రాయం వ్యక్తపరిచారు అని అన్నారు. ప్రకృతి పర్యావరణం, వాతావరణ సమతుల్యత ,వ్యక్తిగత పరిశుభ్రత, మంచి ఆహారపు అలవాట్లు మానవ మనుగడకు ఎంతో ముఖ్యమో ప్రస్తుత కరోనా మహమ్మారి మానవులకు నొక్కి చెప్పిందన్నారు. ప్రస్తుత తరుణంలో శుభ్రమైన నీరు, స్వచ్ఛమైన గాలి, వాతావరణ పరిశుభ్రత యొక్క ఆవశ్యకతను ప్రజలందరూ తక్షణ కర్తవ్యంగా భావించి పర్యావరణ పరిరక్షణకు పూనుకోవాలని సూచించారు. 2025 నుంచి ప్రపంచ పర్యావరణ దినోత్సవం స్ఫూర్తితో సాగునీటి సంఘాల సమాఖ్య తరపున ఆంధ్రప్రదేశ్ లోని 13 జిల్లాల్లో ఉన్న ఆరువేల సాగునీటి సంఘాల పరిధిలో వంద మొక్కలు ప్రతి సంఘంలోనూ నాటమని, అట్లాగే ప్రతి నీటి సంఘం పరిధిలోనూ వంద ఎకరాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నామని, రాబోయే నాలుగు సంవత్సరాలలో ఆ గ్రామాలలో భూతాపం తగ్గి సకాలంలో వర్షాలు పడి భూగర్భజలాలు పెరగడం ఖాయమని చెప్పారు. సమాజంలోని ప్రజలందరూ ప్రకృతికి లోబడి వ్యవహరిస్తూ ప్రకృతిలో అంతరించిపోతున్న వృక్ష జంతు జాతులను పరిరక్షిస్తూ, భూతాపాన్ని తగ్గించే సౌర శక్తి వినియోగాన్ని పెంచి పర్యావరణ పరిరక్షణకు నడుం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం సభ్యులు మందపాటి రాంబాబు, మొవ్వ సత్యనారాయణ, కొలుసు శివయ్య, మెరుగుమాల వెంకట రత్నం, కొలుసు సాంబ శివరావు, పుసలూరు స్వామి తదితరులు పాల్గొన్నారు.

# లింగసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో యోగా కార్యక్రమం



లింగసముద్రం, మండలం రిపోర్టర్ – కే సురేష్ (శుభోదయం న్యూస్):యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈరోజు అనగా తేదీ: 05.05.2025 న ఉదయం 11.00 గం.లకు లింగసముద్రం మండల ప్రజా పరిషత్ కార్యాలయం, లింగసముద్రం నందు యోగ కాంపిటీషన్స్ శ్రీయుత మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారైన శ్రీ కట్టా శ్రీనివాసులు వారి సమక్షమున నిర్వహించడం జరిగినది. యోగ చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యల నుండి బయట పడతారని ఎంపీడీవో కట్ట శ్రీనివాసరావు తెలిపారు. ఈ కాంపిటీషన్స్ నందు లింగసముద్రం 1, మొగిలిచర్ల మరియు పెంట్రాల గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# అంకాలమ్మ తల్లి తిరునాళ్ళ కోలాటానికి... ఆర్థిక సహాయం అందించిన కుప్పాల వెంకటసుబ్బయ్య



సిద్ధవటం, మండల విలేకరి – జాకీర్ హుస్సేన్(శుభోదయం న్యూస్): సిద్దవటం మండలం మాధవరం–1 గ్రామపంచాయతీ యస్.కె.ఆర్ నగర్ హరిజనవాడలో వెలసిన శ్రీ అంకాలమ్మ తల్లి తిరునాల సందర్భంగా మహిళలు కోలాటం భజన కార్యక్రమం ఏర్పాటు చెయ్యగా ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర పంచాయతీ రాజ్ ఆర్గనేజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య 15000 ఆర్థికసహాయం పంపించగా ఈ మొత్తాన్ని దేరంగుల శ్రీకాంత్ అవ్వారు రవిశంకర్ చేతుల మీదుగా కాలనీలోని మహిళలకు అందచేశారు. ఈ సందర్భంగా కోలాటం వేసే మహిళలు మాట్లాడుతూ కుప్పాల వెంకటసుబ్బయ్య అన్న పేదలకు సహాయం చేయటంలో ఎప్పుడూ ముందంజలో ఉంటారని సాంస్కృతిక కార్యక్రమానికి సహకరించాలని అడగగానే నేనున్నానంటూ 15000 వేలు పంపించారని ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# యోగాంధ్రతో ఆరోగ్యాంధ్ర సాధించాలి : ఆర్డిఓ జాన్ ఇర్విన్



సిద్ధవటం, మండల విలేకరి – జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్): యోగాంధ్ర, 2025 లో భాగంగా ఒకే భూమి, ఒకే ఆరోగ్యం అనే నినాదంతో కడప జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలలో యోగ, బ్యాసం నిర్వహించారు. మండల కేంద్రమైన సిద్ధవటం లో పురావస్తు శాఖ కోట, పార్క్ ప్రదేశంలో గురువారం యోగేంద్ర కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా కడప ఆర్డిఓ జాన్ ఇర్విన్, మాట్లాడుతూ ప్రజలలో ఆరోగ్యం పట్ల అవగాహన పెంచుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యోగాంధ్రలో భాగంగా సిద్ధవటం కోట పార్కు ప్రదేశంలో యోగ శిబిరం ఏర్పాటు చేశామని రోజుకు కేవలం 30, నిమిషాలు యోగా చేస్తే శారీరిక దృఢ త్వం మానసిక శాంతి సిద్ధిస్తాయని ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి ఒక ఉత్తమమైన మార్గం యోగా అని తెలిపారు. యోగేంద్ర ద్వారా ఆరోగ్య జీవనశైలి ప్రతి ఒక్కరికి చేరే విధంగా యోగాంధ్రతో ఆరోగ్యాంధ్ర సాధించాలని అన్నారు, జిల్లా యోగా స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు మాట్లాడుతూ ఇలాంటి యోగా కార్యక్రమాలు ప్రతి పాఠశాల స్థాయిలో నిర్వహిస్తే యువతలో ఆరోగ్య చైతన్యం, పెరుగుతుందని ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి యోగ నిర్వహించడం ఒక ఉత్తమమైన మార్గమని తెలిపారు యోగ కార్యక్రమానికి అన్ని విధాలుగా మౌలిక వసతులు సమకూర్చిన రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతి కారి కృష్ణకు అధికారులు కృతజ్ఞతలుతెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పిడి, కిరణ్ కుమార్ రెడ్డి మండల స్పెషల్ ఆఫీసర్ జయసింహ, తాసిల్దార్ ఆకుల, తిరుమల బాబు, మండల అభివృద్ధి అధికారి ఫణి రాజకుమారి డిప్యూటీ తాసిల్దార్, మాధవి లత, ఆయుష్ వైద్యులు, మురళి బాబు, ఎస్ ఎం డి, హమీద్, అల్లోపతి వైద్యులు, డాక్టర్ ప్రకాష్, రంగలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, మండల ఎస్సై మహమ్మద్ రఫీ, మండల విస్తరణ అధికారి మెహతాబ్ యాస్మిన్, ఉపాధి హామీ ఏపీవో నరసింహులు, పంచాయతీ సెక్రటరీలు రెవిన్యూ సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

శుభోదయం
ప్రతి అక్షరం..ప్రజా సమరం......!
WWW.SUBHODAYAMDAILY.COM
శుక్రవారం -06-జూన్-2025



## తెలుగుదేశం పార్టీ లేపాక్షి మండల కన్వీనర్ గా అభి.

లేపాక్షి మండలం రిపోర్టర్ అమరేష్ (శుభోదయం న్యూస్) హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ హిందూపురం పట్టణ,మండలాల కన్వీనర్ల పేర్లు ప్రకటించిన పొలిటికల్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు లేపాక్షి మండలం చెందిన అభి మండల కన్వీనర్ గా ప్రకటించడం జరిగింది.

## పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిది అదనపు కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ




రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన భాద్యత ప్రతి ఒక్కరిదని అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , కమిషనర్ ( ఎఫ్ ఎ సి ) జె. అరుణ శ్రీ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని గురువారం కాలుష్య నియంత్రణ మండలి నేతృత్వంలో రామగుండం నగర పాలక సంస్థ , సింగరేణి కాలరీస్ కంపనీ లిమిటెడ్ , ఎన్ టి పి సి , అల్ట్రా




టెక్ సిమెంట్ కంపనీ , జి పి పి పి పి జి స్వచ్ఛంద సంస్థ లతో కలసి సంయుక్తంగా నిర్వహించిన ర్యాలీ లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ వాడకూడదని అన్నారు.చెట్లను పెంచాలని అన్నారు. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా కాలుష్యాన్ని నివారించే చర్యలు చేపట్టాలని అన్నారు. కాగా గోదావరిఖని ప్రదాన చౌరస్తా నుండి కోదండ రామాలయం వరకు భారీ గా ర్యాలీ నిర్వహించి అనంతరం మానవ హారం గా ఏర్పడ్డారు. ఈ సంధర్భంగా ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా బట్ట తో చేసిన పర్యావరణ హిత సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బిక్షపతి , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , సింగరేణి అధికారి డెనిల్ కుమార్ , ఆర్ ఎఫ్ సి ఎల్ అధికారి వి . శుక్లా , ఎన్ టి పి సి అధికారి కె వి రావు , అల్ట్రా టెక్ సిమెంట్ జి ఎం ఎస్ రెడ్డి , కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వీరేష్ , కనక జ్యోతి , రామగుండం నగర పాలక సంస్థ అధికారులు కుమార స్వామి ,శంకర్ రావు , మెప్మా టి ఎం సి రజనీ , సి ఓ లు , ఆర్ పి లు , మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా ర్యాంకరుకు 20వేల రూపాయల ఆర్థిక సహాయం!! జేఈఈ అడ్వాన్స్డ్ విద్యారత్నకు కృష్ణవేణి వికాస్ చేయూత

**కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల చైర్మన్ అండ్ డైరెక్టర్ డాక్టర్ జమున రవికుమార్ నాగండ్ల**




గోదావరిఖని టౌన్, రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్): ఆల్ ఇండియా ర్యాంకరుకు ఆర్థిక సహాయం అందజేసి మానవతా హృదయాన్ని చాటుకున్నారు కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల చైర్మన్ డాక్టర్ రవికుమార్ నాగండ్ల. ఇటీవల విడుదల అయిన జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాల్లో కళాశాల విద్యార్థి రాచపల్లి మోక్షిత్ 2835వ ర్యాంకు సాధించిన నేపథ్యంలో పైచదువుల నిమిత్తం పేదరికం అడ్డు కాకూడదు అనే ఆలోచనతో 20వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చైర్మన్, ప్రిన్సిపల్ అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ రవికుమార్ మాట్లాడుతూ. జేఈఈ అడ్వాన్స్డ్ విద్యారత్నకు కృష్ణవేణి వికాస్ చేయూత అందించడం అదృష్టంగా, బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. టాపర్లు పేదరికం అనే ఇబ్బందితో పైచదువులకు ఎలాంటి ఆటంకం ఏర్పడకూడదు అనే ఉద్దేశ్యంతో ఆర్థిక సహాయం చేశామని తెలిపారు. చివరి శ్వాస వరకు కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాల రూపంలో ఎడ్యుకేషన్ సర్వీస్ అందిస్తా అని అన్నారు.ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్. ఎం.వెంకన్న మరియు లెక్చరర్లు, జేఈఈ అడ్వాన్స్డ్ 2025 ఆల్ ఇండియా ర్యాంకర్ మోక్షిత్ మాతృమూర్తి పాల్గొన్నారు.

## ఘనంగా తెలంగాణ రాష్ట్ర మాజీ పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ కోలేటి దామోదర్ జన్మదిన వేడుకలు బిఆర్ఎస్ యూత్ లీడర్ పల్లె రమేష్ ఆధ్వర్యంలో




గోదావరిఖని టౌన్ రిపోర్టర్ – సురేష్,(శుభోదయం న్యూస్) ఈ మేరకు గోదావరిఖని గాంధీ నగర్ లోని ఎం డి హెచ్ డబ్ల్యూ ఎస్ ఆశ్రమంలో కోలేటి సేవాదళ్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ యూత్ లీడర్ పల్లె రమేష్ కోలేటి దామోదర్ జన్మదినం సందర్భంగా పిల్లలతో కలిసి కేక్ కట్ చేయించారు. అనంతరం పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా పల్లె రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పది సంవత్సరాల పాటు పోలీస్ హౌసింగ్ బోర్డు చైర్మన్ గా రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్ లను ఆధునికరించడం జరిగిందని అన్నారు. కోలేటి దామోదర్ ఇంకా ఉన్నత పదవులను చేపట్టి ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని, నిండునూరేళ్ళు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో కోలేటి సేవాదళ్ సభ్యులు పాణి, శ్రీమాన్,చందర్, నిఖిల్, సుమన్,చోటు, కార్తీక్, చరణ్, సిద్దు, రాంబాబు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భానుక మల్లికార్జున్




తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివ కుమార్ (శుభోదయం న్యూస్) జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని 6వ వార్డులోని ట్రాన్స్పోర్ట్ రోడ్డు ఆసియన్ పెయింట్స్ కాలనీ సమీపంలో చెత్త కుండి వద్ద నిర్వీర్యంగా ఉన్న చెత్తను మొత్తం తొలగించి సుమారు 100 చెట్లను కంటోన్మెంట్ బోర్డ్ శానిటేషన్ ఇన్స్పెక్టర్ పుష్పేంధర్ గుప్తా,దాఫెదర్ ఏం ఆర్ రాజు కాలనీలో వాకింగ్ చేసే సభ్యులతో కలసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బానుక మల్లికార్జున్ హాజరయ్యారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు.ఈ కార్యక్రమములో గౌతం జైన్, అజయ్ గౌడ్, కోటేశ్వర్ రావు, రవీందర్ రెడ్డి,అక్షయ్ జైన్ గార్లు మరియు కంటోన్మెంట్ బోర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్.ఎ.ల్ లో ఘనంగా హెచ్.ఎ.డబ్ల్యూ యూనియన్ జాయింట్ సెక్రటరీ వడ్డే నాగార్జున జన్మదిన వేడుకలు



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్, ( శుభోదయం న్యూస్), జూన్ 5 : హెచ్.ఏ.ల్ హెచ్.ఏ.డబ్ల్యూ గుర్తింపు యూనియన్ జాయింట్ సెక్రటరీ వడ్డే నాగార్జున జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు సి అధ్యక్షులు, హిందూస్తాన్ ఏరోనాటిక్స్ వర్కర్స్ యూనియన్



వర్కింగ్ ప్రెసిడెంట్ కర్క నాగరాజు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు యూనియన్ ఆఫీస్ లో ఘనంగా జరిగాయి. వారికి శాలువాతో సత్కరించి పూల మాలతో జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు.ఈ కార్యక్రమంలో యూనియన్ హానరబుల్ ప్రెసిడెంట్ విజయ్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు కుతాడి కృష్ణా,శ్రీనివాస్ బాబు,ప్రవీణ్,జాయింట్ సెక్రటరీ వెంకటేష్, నవీన్ అజయ్,సీనియర్ ఆర్గనైసింగ్ సెక్రటరీ డి.కృష్ణా బాబు,అబ్దుస్ షకూర్,రాములు,పరమేష్,భాస్కర్, బిక్షం,తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మడిదల మున్సిపాలిటీలో వార్డ్ విభజనపై అభ్యంతరం అఖిలపక్ష సమావేశం నిర్వహణకు డిమాండ్



గుమ్మడిదల : (శుభోదయం న్యూస్)గుమ్మడిదల, బొంతపల్లి, వీరన్నగూడెం, దోమడుగు, అన్నారం గ్రామాలను కలిపి ఇటీవల ప్రభుత్వం మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిన నేపథ్యంలో, వార్డ్ విభజన సక్రమంగా జరగలేదని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు.మాజీ జడ్పిటిసి సభ్యుడు కుమార్ గౌడ్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్ రఘుకు వారు వినతిపత్రం అందజేశారు. గ్రామాల పరంగా సరైన వార్డ్ విభజన జరగకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రతి గ్రామానికి సంబంధిత వార్డులను, గ్రామాలను వరుస పద్ధతిలో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.వార్డ్ విభజనపై చర్చించేందుకు అన్ని రాజకీయ పార్టీలను పిలిచి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కమిషనర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, దేవేందర్ రెడ్డి, సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆంజనేయులు, యాదవ్ కుంటి మల్లేష్, రఘు గౌడ్, కుంటి పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించిన:

**ఉమ్మడి వీపనగండ్ల మండలం మాజీ జెడ్పిటిసి కృష్ణ ప్రసాద్ యాదవ్**

:చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన రాజు యాదవ్,శ్రీ కళ్యాణి తో జరిగిన వివాహము వారి మేనమామ ఇంటి దగ్గర వీపనగండ్ల మండలం సంగినేని పల్లి గ్రామం లో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధువు వరులకు అక్షతలు వేసి ఆశీర్వదించారు. లక్ష్మిపల్లి గ్రామంలో జరిగిన గుర్రంపల్లి పెద్ద దర్గయ్య, లక్ష్మి ఆహ్వానం మేరకు వారి నివాసం దగ్గర జరిగిన మొదటి కుమారుడు వివాహము నాగరాజు పల్లవితో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు జూపల్లి కృష్ణారావు అభిమానులు, బంధుమిత్రులు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులకు అక్షింతలు వేసి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## సర్వేంద్రియనం నయనం ప్రధానం ముడుమాల్ గ్రామం లో వాకిటి శ్రీహరన్న సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు

నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలోని ముడుమల్ గ్రామంలో రైతు వేదిక ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ మండల అధ్యక్షుడు రాజప్ప గౌడ, కృష్ణ మండలం కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, శ్రీహరి అన్న సేవా సమితి వ్యవస్థాపకులు ఏ. రవికుమార్ ,వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి ఆధ్వర్యంలో కంటి పరీక్షలుమక్తల్ నియోజకవర్గం కృష్ణ మండలం ముడుమాల్ గ్రామంలో మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు గౌరవ శ్రీ డాక్టర్ వాకిటి శ్రీహరి గారి సహకారంతో రామ్ రెడ్డి లయన్స్ హాస్పిటల్ వారి సౌజన్యంతో వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి ఆధ్వర్యంలో కృష్ణ మండలం ముడుమల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమన్వయంతో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం అయింది, గౌరవ శాసనసభ్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం లో గ్రామ పరిసర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా150 మందికి పైగా కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా80 మందికి పైగా కంటి పొరల సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారిని ఆపరేషన్ నిమిత్తం మహబూబ్ నగర్ రామ్ రెడ్డి లయన్స్ హాస్పిటల్ కు ప్రత్యేక వాహనంలో తరలించడం జరిగింది, ముడుమాలతో పాటు చుట్టుపక్కల గ్రామాలైన మురారి దొడ్డి, గుడెబల్లూరు ఇతర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వందల సంఖ్యలో ప్రజలు తరలివచ్చి ఉచిత కంటి వైద్య శిబిరంలో భాగంగా కంటి పరీక్షలు చేయించుకున్నారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్న రీతిలో ప్రతి ఒక్కరికి నాణ్యమైన కంటి చూపు ఉండాలనే ఉద్దేశంతో గౌరవ శ్రీ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి గారి సూచన మేరకు వాకిటి శ్రీహరి అన్న సేవాసమితి ఆధ్వర్యంలో ఇప్పటికే కృష్ణ %ఓ% మాగనూర్ మండలాల్లోని వివిధ గ్రామాల వ్యాప్తంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వేలాది సంఖ్యలో ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి దాదాపు కొన్ని వందల మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించడంతోపాటు కళ్ల అద్దాలు%ఓ% మందులు అందజేయడం జరిగిందని వాకిటి శ్రీహరి అన్న సేవాసమితి సభ్యులు తెలిపారు. కంటి చూపు సమస్యలతో చాలా ఇబ్బందులకు గురయ్యే వారమని, కనీసం తమ అవసరాలు సైతం చేసుకోలేక ఇతరులపై ఆధారపడే స్థితిలో ఉన్న తమకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి కంటి శస్త్ర చికిత్సలు చేయించి తిరిగి తమకు కంటి చూపు పూర్వపు స్థితిలో తీసుకువచ్చి తమ కంటి సమస్యలను దూరం చేసిన ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి గారికి మరియు శ్రీహరన్న సేవాసమితి సభ్యులకు ప్రజలు ధన్యవాదాలు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో వాకిటి శ్రీహరి అన్న సేవాసమితి ఆధ్వర్యంలో మరింత విస్తృతంగా ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి నియోజక వర్గంలో ఎక్కడ కూడా కంటి సమస్యలు ఉన్నవారు లేకుండా ప్రతి ఒక్కరికి నాణ్యమైన కంటిచూపు అందించాలన్నదే తమ ధ్యేయమని వాకిటి శ్రీహరి అన్న సేవాసమితి సభ్యులు చెబుతున్నారు. కార్యక్రమంలో వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి సభ్యులు మహమ్మద్ నూరుద్దీన్, మహమ్మద్ హుస్సాముద్దీన్ , మహమ్మద్ షారుక్ కృష్ణ మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ,బోయ నరసింహ, వీరితోపాటు కృష్ణా మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు%ఓ% ముడుమాల్ గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గడుగు వెంకటేష్, తమ్మప్ప, రాకేష్, దేవేందర్, అరవింద్ , సత్యం , నర్సింలు , భీమా శంకర్ , ఆంజనేయులు సామాన్య ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణ పై ర్యాలీ నిర్వహించారు

ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కుటుంబ సంక్షేమ మిషన్ డైరెక్టర్ ఎన్ హెచ్ ఎం కమిషనర్ ఆదేశాలతో ప్రపంచ పర్యావరణ దినోత్సవ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్. గోపాలరావు ప్రారంభించిన అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, ప్లాస్టిక్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణకు సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిస్తూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని ఉద్దేశంతో పనిచేయాలని ఉత్సవాలు పెండ్లిలు జరిగినప్పుడు ప్లాస్టిక్ గ్లాసులను ప్లాస్టిక్ ప్లేట్లను వాడకూడదని వివరించారు. వాహనాలలో రెండు గుడ్డ సంచులను నిల్వ పంచుకోవాలని మార్కెట్కు వెళ్ళినప్పుడు కూరగాయలను తీసుకువచ్చేటప్పుడు ఇంటి వద్ద నుండే తీసుకెళ్లిన సంచులను ఉపయోగించాలని తెలిపారు. ఇంటిలోని చెత్తను ప్లాస్టిక్ కవర్లో వేసి చెత్తతో పాటు కుండిలో వేయకూడదని అలా వేస్తే ఆ చిత్తతోపాటు ప్లాస్టిక్ సంచులను కూడా ఆవులు గేదెలు తిని ప్రాణాలను కోల్పోయే అవకాశాలు ఉన్నాయని వివరించారు . ర్యాలీ తర్వాత డిఎంహెచ్ఓ కార్యాలయం ముందు పర్యావరణ దినోత్సవ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు మొక్కను నాటారు ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్. శ్రీకాంత్, రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.నాగన్వేష్, డి పి హెచ్ ఎన్ శకుంతల, కోఆర్డినేటర్ భూపాల్ రెడ్డి, ప్రోగ్రాం మానిటరింగ్ సూపర్వైజర్ సురేష్ బాబు, పిహెచ్ఎన్ శోభ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సూపర్వైజర్స్ ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు డిఎంహెచ్ఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్నిపురస్కరించుకుని జనసేనపార్టీఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం జనసేన పార్టీ అధ్యక్షుడు డాక్టర్ మణికంఠ గౌడ్

నియోజకవర్గం ప్రతినిధి: నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని, నారాయణపేట మక్తల్ నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు డాక్టర్ మణికంఠ గౌడ్ గారి ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణ పట్ల తమ సంకల్పాన్ని వ్యక్తపరిచారుఈ సందర్భంగా డాక్టర్ మణికంఠ గౌడ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మన ప్రతిస్పందన, ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటితే రేపటి తరం కోసం పచ్చదనం కాపాడగలము జనసేన పార్టీ మానవ సేవలో భాగంగా ప్రకృతిని సంరక్షించడానికీ ముందుండుతుంది అన్నారు ఈ మొక్కల నాటుడు కార్యక్రమం ద్వారా స్థానిక ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన పెంచడమే కాకుండా, వాతావరణ మార్పులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేశారుజనసేన కార్యకర్తలు, యువత మరియు గ్రామస్థుల చొరవతో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగిందని, ఈ తరహా కార్యక్రమాలు రాబోయే రోజుల్లో మరింత పటిష్టంగా నిర్వహించబడతాయని నాయకులు తెలిపారు

## సాక్షి స్టాఫ్ రిపోర్టర్ భూక్య సునీల్. పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన సిపిఐ నాయకులు.

: ములుగు మండలం కోడిశలకుంట గ్రామం జూన్ 5. రోజున సాక్షి ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ భూక్య సునీల్. పార్థివ దేహానికి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ములుగు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి అంజాద్ పాషా సీనియర్ నాయకులు ఇంజన్ కొమురయ్య. ములుగు పట్టణ కార్యదర్శి బోడ రమేష్. తదితరులు పూలమాలవేసి నివాళులు అర్పించారు సునీల్ కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసినారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## సాక్షి రిపోర్టర్ భూక్య సునీల్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకుడు కుంజా సూర్య.

ములుగు మండలం పత్తిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కోడిశాల కుంట గ్రామానికి చెందిన సాక్షి రిపోర్టర్ భూక్య సునీల్ అనారోగ్య కారణంగా మరణించగా ఈ రోజు వారి నివాసంలో సునీల్ పార్థివదేహానికి పూలమాల నివాళులు అర్పించిన రాష్ట్ర మంత్రి సీతక్క తనయుడు రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుంజా సూర్య గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ జిల్లా నాయకులు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి పలికారు వారి కుటుంబానికి మంత్రి సీతక్క కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పి 25000 రూపాయలు ఆర్థిక సాయం చేసి ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్ ములుగు మండల పార్టీ అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా యూత్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు మారం సుమన్ రెడ్డి ములుగు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్ కుమార్ బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి గండ్రత్ జయాకర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అహ్మద్ పాషా మహమ్మద్ మైనారిటీ సెల్ జిల్లా నాయకులు రియాజ్ మీర్జా ఎస్టి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పోరిక భద్రూ ,ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు బోడ రఘు మండల బీసీ సెల్ అధ్యక్షుడు ఓంప్రకష్ ములుగు మండల యూత్ ఉపాధ్యక్షుడు కాసర్ల రాజు,నాయకులు కుమార్ యాదవ్ యూత్ నాయకులు గూడెపు రాకేష్ గ్రామ కమిటీ అధ్యక్షుడు ధరావత్ సారయ్య గ్రామ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కారం రాజేందర్ జిల్లా నాయకులు గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు

## రానున్న వర్షాకాలంలో వరదల సంసిద్ధతపై ములుగు జిల్లా విద్యుత్ అధికారులు కాంట్రాక్టర్లతో సమీక్ష

ములుగు జిల్లా కేంద్రంలో డివిజనల్ ఇంజనీర్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలోములుగు డివిజన్ ఆఫీసులో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వరద ముంపు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఏర్పాటు తదితర అంశాలపై విద్యుత్ అధికారులకు తగు సూచనలు జాగ్రత్తలపై సూచనలు చేస్తూ తగినంత మెటీరియల్ అందుబాటులో ఉంచుకోవాలని విద్యుత్ లైన్లు విరిగిపడితే తొందరగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ల కు తెలియజేస్తూ .మండల స్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ పునరావస కేంద్రాలకు విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉంచాలని ఆదేశాలు జారీచేశారు.

## 9వ తరగతి పాస్‌కాని వ్యక్తి రాజకీయాలు చేస్తున్నాడు.. తేజస్వీ యాదవ్‌పై విసుర్లు



**న్యూఢిల్లీ,:** బీహార్‌లో ఎన్నికల వాతావరణం హీటెక్కుతోంది. త్వరలోనే రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అన్ని పార్టీలు సన్నద్ధమవుతున్నాయి. ఈ తరుణంలో లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబం లక్ష్యంగా ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ విమర్శలు గుప్పించారు. పిల్లల గురించి ఎలా చింతించాలో లాలూ ప్రసాద్ యాదవ్ నుంచి నేర్చుకోవాలని.. 9వ తరగతి పాస్ కాని కొడుకు కోసం ఆందోళన చెందుతున్నారని ఎద్దేవా చేశారు. తేజస్వి యాదవ్.. బీహార్‌కు రాజు కావాలని కోరుకుంటున్నారని విమర్శించారు. బుధవారం బీహార్‌లోని సరన్‌లో జరిగిన సభలో ప్రశాంత్ కిషోర్ ప్రసంగించారు. "ప్రజలంతా తమ పిల్లలను ఎలా చూసుకోవాలో లాలూప్రసాద్ యాదవ్ నుంచి నేర్చుకోవాలి. ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్ 9వ తరగతి కూడా పాస్ కాలేదు. కానీ కుమారుడి భవిష్యత్తు గురించి ఆందోళన చెందుతున్నారు. తేజస్వీని బీహార్‌కు రాజును చేయాలని ఉబలాటపడుతున్నారు. మేము ఇలా మాట్లాడుతుంటే.. ఆయన్ను విమర్శిస్తున్నామని ప్రజలు అంటున్నారు. కాదు.. మేము ఆయన్ను ప్రశంసిస్తున్నాం. సామాన్య ప్రజల పిల్లలు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసినా.. వారికి ఉద్యోగాలు రావడం లేదు" అని ప్రశాంత్ కిషోర్ వ్యాఖ్యానించారు. బీహార్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. నిరుద్యోగ యువత కోపంగా ఉందని తెలిపారు. ర్యాలీలకు వస్తున్న స్పందన చూస్తుంటే.. బీహార్‌ను పీడిస్తున్న అవినీతి పట్ల ప్రజలు నిరాశతో ఉన్నారని.. అందుకే ఈసారి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. పెరుగుతున్నది తన వ్యక్తిగత గ్రాఫ్ కాదని.. బీహార్‌లో నిజమైన మార్పును చూడాలనుకునే ప్రజల ఆకాంక్ష అని తెలిపారు. ర్యాలీకి వచ్చిన వారు తన బంధువులు కాదని.. తన కులానికి చెందిన వారు కూడా కాదని.. సమాజంలోని విభిన్న వర్గాల నుంచి వ్యక్తమైన నిరాశకు ఇది ప్రధాన కారణం అన్నారు.

## పర్యావరణాన్ని ప్రేమిద్దాం.. భవిష్యత్ తరాల భద్రతకై కృషి చేద్దాం..



**అమరావతి,:** వచ్చే ఏడాది ఇదే రోజు కోటి మొక్కలు నాటాలని సంకల్పం పెట్టుకున్నాం అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. అమరావతి రాజధాని ప్రాంతం అనంతవరంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ని-వనమహోత్సవం కార్యక్రమం ప్రారంభం అయింది. సభ ప్రాంగణంలో ఏర్పాటైన స్టాళ్లను పరిశీలించారు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కొంతమంది మంత్రులు అధికారులు కూడా స్టాళ్లు పరిశీలించారు.. స్టాల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పర్యావరణ దినోత్సవానికి గుర్తుగా మొక్కలు నాటారు.. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పవన్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది ఇదే రోజు కోటి మొక్కలు నాటాలని సంకల్పం పెట్టుకున్నాం అన్నారు.. అడవుల్లో కార్చిచ్చు ఆపే ప్రయత్నాలు చేయాలన్న ఆయన.. అటవీ పరిరక్షణ సమితి ఉద్యమకారులు అంకారవు అడవుల పరిరక్షణకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు.. గతంలో ఇంటి అడ్రెస్ కావాలంటే అదిగో.. ఆ మర్రిచెట్టు పక్కవీధిలో అనేవారు.. ఇప్పుడు అసలు అలాంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.. పర్యావరణ పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ తలమానికంగా ఉండాలని ఆకాక్షించారు.. ఇక, అందరికి మనస్ఫూర్తిగా పర్యావరణ దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. మరోవైపు, పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎక్స్ (ట్విట్టర్)లో పోస్టుపెట్టిన పవన్ కల్యాణ్.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.. భవిష్యత్ తరాలకి అందించాల్సిన గొప్ప బహుమతి శుభ్రమైన పర్యావరణం.. చెట్లు నాటి పచ్చదనాన్ని పెంచుదాం.. నీటి కాలుష్యాన్ని నివారిద్దాం నీటి వనరులను కాపాడుకుందాం.. వన్యప్రాణులను రక్షించుకుందాం.. జీవవైవిధ్యాన్ని పరిరక్షిద్దాం.. పర్యావరణాన్ని ప్రేమిద్దాం.. భవిష్యత్ తరాల భద్రతకై కృషి చేద్దాం అని పిలుపునిచ్చారు.. ఇక, సుసంపన్నమైన ప్రకృతిని మన పిల్లలకు బహుమతిగా ఇద్దాం.. ఇది మన భూమి.. ఇది మన బాధ్యత అని తన ట్వీట్‌లో పేర్కొన్నారు డిప్యూటీ సీఎం పవన్

## మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు నమోదు..




**అమరావతి,:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు పెట్టారు పోలీసులు.. అంబటిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని.. ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించిన వైసీపీ 'వెన్నుపోటు దినం' పేరుతో నిరసన కార్యక్రమాలు నిర్వహించింది.. అయితే, ర్యాలీగా వస్తున్న అంబటిని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు అడ్డుకున్నారు. దీంతో, సీఐపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు అంబటి రాంబాబు.. ఈ సందర్భంగా ఇద్దరు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం జరిగింది. అయితే, పోలీసు విధులకు ఆటంకం కలిగించడం, బెదిరించడమే కాకుండా దూషించడంపై ఆయా సెక్షన్ల కింద అంబటి రాంబాబు కేసు నమోదు చేశారు. అంబటితోపాటు ఆయన అనుచరుడు వినోద్ మరి కొంత మంది వైసీపీ కార్యకర్తలపై కేసులు పెట్టారు పట్టాభిపురం పోలీసులు.. కాగా, వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా అంబటి రాంబాబు, సీఐ గంగా వెంకటేశ్వర్లు మధ్య జరిగిన వాగ్వాదం.. పరస్పరం వార్నింగ్‌లు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిపోయిన విషయం విదితమే..

## సెక్రటేరియట్‌లోని కళ్ళు తిరిగి పడిపోయిన మంత్రి కొండా సురేఖ..

**హైదరాబాద్, :** తెలంగాణ సచివాలయంలోని కేబినెట్ హాల్ వద్ద గురువారం ఉదయం కీలక సంఘటన చోటుచేసుకుంది. మంత్రి కొండా సురేఖ కళ్ళు తిరిగి పడిపోవడంతో అక్కడ ఉన్నవారంతా కాసేపు ఆందోళనకు లోనయ్యారు. అప్పటికే మంత్రివర్గ సమావేశం ప్రారంభమవుతున్న సమయంలో ఈ ఘటన జరగడం గమనార్హం. వెంటనే అక్కడే హుటాహుటిన అక్కడకు చేరిన వైద్య బృందం ఆమెకు ప్రాథమిక వైద్యం అందించింది. మెడికల్ పరీక్షల అనంతరం వైద్యులు మంత్రి ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ప్రకటించారు.



లో బీపీ కారణంగానే ఈ సమస్య తలెత్తినట్లు డాక్టర్లు తెలిపారు. తక్షణమే ఇంజెక్షన్ ఇచ్చి, కొంత సమయం విశ్రాంతి తీసుకోవాలని ఆమెకు సూచించారు. కేబినెట్ సమావేశానికి హాజరై ఉన్న సమయంలో ఈ తాత్కాలిక అస్వస్థత కలిగినప్పటికీ, ప్రస్తుతం ఆమె ఆరోగ్యం మెరుగ్గా ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. మంత్రి సురేఖకు తిరిగి పూర్తిస్థాయి విశ్రాంతి కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

# అమెరికాపై చైనా.. 'ఆగ్రో టెర్రరిజం'

### మిచిగాన్ యూనివర్సిటీలో ఇద్దరు చైనీయుల అరెస్ట్
### ధాన్యం దిగుబడిని చావుదెబ్బ తీసే శిలీంధ్రం అక్రమ రవాణా
### మిచిగాన్ యూనివర్సిటీలోపరిశోధనల కోసమేనన్ననిందితురాలు
### ఇది జాతి భద్రతకే ప్రత్యక్ష ముప్పు:ఎఫ్‌బీఐ డైరెక్టర్



ఆగ్రో టెర్రరిజానికి పాల్పడిన ఇద్దరు చైనీయులను అమెరికా పోలీసులు అక్కడి కాలమానం ప్రకారం మంగళవారం అరెస్ట్ చేయటంతో ప్రపంచ దేశాలు ఒక్కసారి ఉలిక్కిపడ్డాయి. పంటలకు తీవ్రనష్టం కలిగించటం ద్వారా వ్యవసాయ, ఆహార భద్రతకు విఘాతం కలిగించే ఉగ్రవాద చర్యలను ఆగ్రో టెర్రరిజంగా చెబుతారు. అదే దురుద్దేశంతో 'ఫ్యూసేరియం గ్రామినిరమ్'అనే ప్రమాదకరమైన శిలీంధ్రాన్ని అక్రమంగా, కుట్రపూరితంగా అమెరికాలోకి తెచ్చారన్న ఆరోపణపై చైనా పౌరులైన యుంకింగ్ జియాన్, ఆమె సన్నిహితుడు జున్‌యాంగ్ లియులను అమెరికా పోలీసులు అరెస్ట్ చేసి, విచారణ జరుపుతున్నారు. ఐదేళ్ల క్రితం ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా కూడా చైనా నుంచే వ్యాప్తిలోకి వచ్చిందన్న అనుమానాలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. ఇటీవల అమెరికా.. చైనా నుంచి వస్తువుల దిగుమతిపై సుంకాలు అతి భారీగా పెంచిన నేపథ్యంలో తాజా ఆగ్రో టెర్రరిజం చర్య చర్చనీయాంశమైంది.

### చైనా కమ్యూనిస్టు పార్టీ కుతంత్రమే

యుంకింగ్ జియాన్ చైనా కమ్యూనిస్టు పార్టీ విధేయురాలని, ఈ ప్రమాదకర శిలీంధ్రంపై చైనాలో పరిశోధన చేసిన ఆమెకు చైనా ప్రభుత్వం నిధులు ఇచ్చినట్లు కూడా ఆధారాలున్నాయని కాష్ పటేల్ తెలిపారు. 'సహ నిందితుడైన ఆమె సన్నిహితుడు జున్‌యాంగ్ లియు కూడా చైనా యూనివర్సిటీలో ఇదే శిలీంధ్రంపైనే పరిశోధనలు చేస్తుండేవాడు. ఈ శిలీంధ్రంపై మిచిగాన్ యూనివర్సిటీలో పరిశోధనల కోసమే డెట్రాయిట్ మెట్రోపాలిటన్ ఎయిర్‌పోర్ట్ ద్వారా గత ఏడాది అక్రమంగా రవాణా చేసినట్లు లియు తొలుత బుకాయించినా, తర్వాత తప్పు అంగీకరించారని తెలిపారు. వీరిద్దరిపైనా కుట్ర, అమెరికాలోకి వస్తువుల స్మగ్లింగ్, తప్పుడు స్టేట్‌మెంట్లు,వీసా అక్రమాలకు సంబంధించిన అభియోగాలు నమోదు చేశా'మని కాష్ పటేల్‌తెలిపారు. అమెరికా ఆహార వ్యవస్థను దెబ్బతీయటం ద్వారా తీవ్ర పరిణామాలు కల్పించి అమెరికా ప్రజల జీవితాలను, ఆర్థిక వ్యవస్థను పెనుప్రమాదంలోకి నెట్టాలన్న కుతంత్రంతో చైనా కమ్యూనిస్టు పార్టీ అనుక్షణం పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ దుర్బిద్ధితోనే పరిశోధకులను, ఇతరులను అమెరికా సంస్థల్లోకి పనిగట్టుకొని చొప్పిస్తోందని చెప్పటానికి ఇదొక ప్రబల నిదర్శనం అని కాష్ పటేల్ అన్నారు. ఈ కుతంత్రాలను సమర్థవంతంగా తిప్పికొట్టేందుకు ఎఫ్‌బిఐ అవిశ్రాంతంగా కృషి చేస్తూనే ఉంటుందన్నారు. నష్టం జరగకముందే ఈ ముప్పును పసిగట్టడంలో డెట్రాయిట్ ఎఫ్‌బిఐ బృందం, కస్టమ్స్%-%సరిహద్దు భద్రతా దళాలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేశారని ప్రశంసించారు.

### ఆగ్రో టెర్రరిజం మూలాలు..

మధ్య ప్రాచ్యానికి చెందిన అస్సిరియన్ అనే జాతి వారు క్రీ.పూ. 660లోనే వ్యవసాయసంబంధమైన ఉగ్రవాదచర్యకు తొలిసారి పాల్పడ్డారని చరిత్ర చెబుతోంది. ధాన్యపు పంటలను నాశనం చేసే ఎర్గోట్ అనే శిలీంధ్రాన్ని ప్రయోగించి శత్రువుల నీటి వనరులను అస్సిరియన్లు కలుషితం చేశారు. ఆధునిక కాలంలో తొలి ప్రపంచ యుద్ధంలో జర్మనీ గ్లాండర్స్, ఆంథ్రాక్స్ క్రిములను శత్రువుల గుర్రాలపై ప్రయోగించింది. యూరప్‌లో శత్రు సేనలకు సరఫరా అయ్యే ధాన్యాగారాలపై ఈ ఫంగస్‌లను ప్రయోగించినట్టు చెబుతారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో.. బ్రిటన్‌లోని బంగాళా దుంపల పొలాలను 'కొలరాడో పొటాటో బీటిల్స్'సాయంతో నాశనం బ్రిటన్ చేయాలని ప్రయత్నించింది. విమానం సాయంతో వీటిని పొలాల్లోకి విడిచిపెట్టింది.

### ప్రమాదకరమైన ఫంగస్

'ప్రమాదకరమైన జీవాయుధాన్ని అక్రమంగా దేశంలోకి తీసుకురావటం వ్యవసాయ సంబంధమైన ఉగ్రవాద చర్య. యావత్ జాతి భద్రతకే ఇది ప్రత్యక్ష ముప్పు'వంటిదని ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ)డైరెక్టర్ కాష్ పటేల్ ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. "యుంకింగ్ జియాన్ అనే యువతి మిచిగాన్ యూనివర్సిటీలో పరిశోధనల కోసం ఫ్యూసేరియం గ్రామినిరమ్ అనే ప్రమాదకరమైన శిలీంధ్రాన్ని దేశంలోకి అక్రమంగా తీసుకువచ్చినట్లు భావిస్తున్నాం. గోధుమ, వరి, మొక్కజొన్న, బార్లీ తదితర పంటల్లో 'కంకి ఎండు తెగులు'ను కలిగించటం ద్వారా దిగుబడిని తీవ్రంగా నష్టపరిచే అత్యంత ప్రమాదకరమైన ఫంగస్ ఇది. ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల డాలర్ల మేర ఆర్థిక నష్టానికి కారణమవుతున్న ఈ శిలీంధ్రం.. పంటలను దెబ్బతీయటంతో పాటు మనుషులు, పశువుల తీవ్రమైన అనారోగ్య సమస్యలను సృష్టించగలదు'అని ఆయన పేర్కొన్నారు.

### పాక్ ద్వారా మన దేశంలోకీ..

చైనా, పాకిస్థాన్ సరిహద్దుల ద్వారా భారత్‌కు కూడా ఆగ్రో టెర్రరిజం ముప్పు పొంచి ఉందన్న చర్చ జరుగుతోంది. రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఓ) పత్రాల ప్రకారం.. బంగ్లాదేశ్‌లో కనిపించిన ఒక ప్రమాదకర ఫంగస్ 2016లో పశ్చిమ బెంగాల్‌లోని 2 జిల్లాల్లోకి ప్రవేశించింది. గోధుమ పంటను నాశనం చేసే ఆ ఫంగస్‌ను ప్రభుత్వం సమర్థంగా నాశనం చేసింది. మూడేళ్ల పాటు గోధుమ పంట వేయకుండా ఆదేశాలు జారీచేసి, ఆ ఫంగస్ విస్తరించకుండా చేయగలిగింది. అంతకుముందు 2015లో పత్తి పంటను నాశనం చేసే ప్రమాదకర వైరస్ పాకిస్థాన్ నుంచి దక్షిణ పంజాబ్ ప్రాంతంలోకి ప్రవేశించింది. దాదాపు మూడింట రెండొంతుల పత్తి పంట నాశనమైపోయింది. సుమారు 670 మిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. పంట నష్టాన్ని భరించలేక సుమారు 15 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు.

# స్వచ్ఛంగా భారత ఇం'ధనం'!

### జోరు మీదున్న పునరుత్పాదక ఇంధన రంగం
### మొత్తం సామర్థ్యం 232 గిగావాట్లకు చేరిక
### ప్రపంచంలో నాలుగో అతిపెద్ద దేశంగా స్థానం
### పదేళ్లలో మూడింతల పెరుగుదల

పర్యావరణ కాలుష్యం రోజురోజుకీ పెరుగుతున్న వేళ స్వచ్ఛ ఇంధనం ప్రాధాన్యత పెరుగుతోంది. అందుకే మనదేశం కూడా గ్రీన్ ఎనర్జీపై దృష్టి పెట్టింది. అంతేకాదు, ప్రపంచానికి మార్గదర్శకంగానూ నిలుస్తోంది. మన పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 232 గిగావాట్లకు చేరుకుంది. తద్వారా ఈ రంగంలో ప్రపంచంలో నాలుగో అతిపెద్ద దేశంగా నిలిచింది. 2014లో పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 75.52 గిగావాట్లు మాత్రమే. అంటే పదేళ్లలో సామర్థ్యం మూడింతలు పెరిగిందన్న మాట. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్వచ్ఛ ఇంధన రంగంలో మనదేశం సాధించిన పురోగతిపై ప్రత్యేక కథనం. 2030 నాటికి 500 గిగావాట్ల సామర్థ్యాన్ని అందుకోవాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఏటా 50 గిగావాట్లకుపైగా గ్రీన్ ఎనర్జీ సామర్థ్యాన్ని జోడించాల్సి ఉంటుంది. భారత పునరుత్పాదక ఇంధన రంగం 2020 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ మధ్య సుమారు 20 బిలియన్‌డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అందుకుంది. 2047 నాటికి మొత్తం పునరుత్పాదక ఇంధన సామర్థ్యం 1,800 గిగావాట్ల మైలురాయికి చేరాలన్నది భారత ప్రభుత్వ దీర్ఘకాలిక లక్ష్యం. అందుకు అనుగుణంగా ముందుకు సాగుతున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. అందుకు నిదర్శనం.. ఈ రంగంలో ప్రభుత్వం చేస్తున్న వ్యయం పెరగడమే. 2019-20 నుంచి 2023-24 నాటికి... పునరుత్పాదక ఇంధనానికి సంబంధించిన పథకాలు, కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం చేసిన ఖర్చు రూ.3,193 కోట్ల నుంచి రూ.6,119 కోట్లకు పెరిగింది.

### టాప్‌లో సోలార్ పవర్..

సౌర విద్యుత్ ఉత్పత్తిలో భారత్ ప్రపంచంలో మూడవ, పవన విద్యుత్ రంగంలో నాల్గవ అతిపెద్ద దేశంగా అవతరించడం విశేషం.



2023లో మొత్తం పునరుత్పాదక విద్యుత్ 18.5 గిగావాట్లు, 2024లో 25 గిగావాట్లు అదనంగా వచ్చి చేరింది. 2014లో దేశంలో సౌర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కేవలం 2.63 కోట్లే. కానీ, ప్రభుత్వ చర్యల ఫలితంగా 2025 నాటికి ఏకంగా 108 గిగావాట్లకు ఎగసింది. అంటే 41 రెట్ల పెరుగుదల అన్నమాట. దీంతో పునరుత్పాదక ఇంధన రంగంలో భారత్ తన స్థానాన్ని బలోపేతం చేసుకుంది. పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 51 గిగావాట్లకు పెరిగింది. 2014లో ఇది 21 గిగావాట్లు.

### మాడ్యూల్స్ తయారీలో..

సౌర విద్యుదుత్పత్తి విషయానికి వస్తే సోలార్ మాడ్యూల్స్ తయారీ సామర్థ్యం దేశంలో 2014లో 2.3 గిగావాట్లు మాత్రమే. 2024 నాటికి ఇది 90 గిగావాట్లను తాకింది. 2030 నాటికి 150 గిగావాట్లకు చేరుకోవాలని భారత్ ఆకాంక్షిస్తోంది. దశాబ్దం క్రితం దేశీయంగా సోలార్ సెల్స్, వేఫర్‌ల ఉత్పత్తి పరిమితంగా ఉండేది. నేడు సోలార్ సెల్స్ ఉత్పత్తిలో 25 గిగావాట్లు, వేఫర్ ఉత్పత్తిలో 2 గిగావాట్లతో భారత్ తన స్థానాన్ని పదిలపర్చుకుంది. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి స్వయం సమృద్ధి గల దేశంగా మారే ప్రయత్నంలో మన దేశం 2030 నాటికి సోలార్ సెల్స్ ఉత్పత్తిలో 100 గిగావాట్స్, వేఫర్ ఉత్పత్తిలో 40 గిగావాట్ల సామర్థ్యాన్ని అందుకోవాలని కృత నిశ్చయంతో ఉంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూ.24,000 కోట్లతో చేపట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల పథకం సౌర విద్యుత్ రంగానికి ఊపునిచ్చింది.

### దూకుడుగా ప్రభుత్వం..

2025 ఫిబ్రవరి నాటికి దాదాపు 176 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయి. 70.21 గిగావాట్ల సామర్థ్యం గల ప్రాజెక్టులకు టెండర్లు దాఖలయ్యాయి. సముద్రం లేదా సరస్సులో ఏర్పాటు చేసే ఆఫ్‌షోర్ పవన విద్యుత్ ప్రాజెక్టుల విభాగంలో 2030 నాటికి 37 గిగావాట్ల మేర టెండర్లను ఆహ్వానించాలని భారత్ నిర్ణయించింది. గుజరాత్, తమిళనాడులో పైలట్ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఆర్‌ఈ-ఇన్వెస్ట్ 2024 వేదికగా భారత స్వచ్ఛ ఇంధన రంగంలో 2030 నాటికి రూ.32.45 లక్షల కోట్ల పెట్టుబడులకు వివిధ దేశాలకు చెందిన కంపెనీలు ముందుకు వచ్చాయి. ఇక దేశంలోని మొత్తం విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంలో శిలాజేతర విద్యుత్ సామర్థ్యం వాటా 2014తో పోలిస్తే 32.5% నుండి గత ఏడాది 47.37%కి పెరిగింది. ప్రధానమంత్రి సూర్య ఘర్ ప్రాజెక్టును 2024 ఫిబ్రవరిలో కేబినెట్ ఆమోదించింది. 2026-27 నాటికి దేశంలో ఒక కోటి గృహాలకు రూఫ్‌టాప్ సోలార్‌ను ఏర్పాటు చేయడానికి మొత్తం రూ.75,021 కోట్ల వ్యయం చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా అదనంగా 30 గిగావాట్ల సౌర సామర్థ్యం లభిస్తుందని అంచనా. రూ.19,744 కోట్లతో జాతీయ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌ను మంత్రివర్గం ఆమోదించింది. 2030 నాటికి ఈ మిషన్ కింద 125 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యం అదనంగా చేరనుంది.

# యుద్ధాలతో మరింత సంక్లిష్టంగా మారుతున్న వాతావరణ సంక్షోభం



యుద్ధం కొనసాగినన్ని రోజులూ రణ క్షేత్రాల్లో ఎక్కడ చూసినా రక్తతర్పణమే. సైనికుల రుధిరంతో తడిసి ముద్దయిన భూములు మాత్రమే కాదు పరోక్షంగా కోట్లాది ఎకరాల్లో సాగుభూమి, జనావాస ప్రాంతాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం (యూఎన్‌ఈపీ), 2024 నివేదిక స్పష్టంచేసింది. హౌతీల తిరుగుబాటు, హమాస్-ఇజ్రాయెల్ యుద్ధం, ఉక్రెయిన్-రష్యా యుద్ధంతోపాటు ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో జరుగుతున్న అంతర్యుద్ధాలు, ఘర్షణలు చివరకు పర్యావరణ సంక్షోభాగ్నుల్ని మరింత ఎగసిపడేలా చేస్తున్నాయని యూఎన్‌ఈపీ నివేదిక వెల్లడించింది. సరిహద్దు వివాదాలు మొదలు అంతర్జాతీయ విధానాలదాకా పొరుగు దేశాలు, శత్రుదేశాల మధ్య వైరం తుదకు పర్యావరణాన్ని మరింతగా నాశనంచేస్తోందని నివేదిక హెచ్చరిస్తోంది. దశాబ్దాల క్రితమే జీవాయుధాలు ప్రయోగించి కిలోమీటర్ల కొద్దీ జనావాసాలను విషవాయువులతో గరళమయం చేసిన దేశాల దుష్టాంతాలనూ నివేదిక గుర్తుచేసింది. యుద్ధాల వేళ శత్రు దేశాల జలాశయాలను, ఆనకట్టలపై బాంబులేసి నేలమట్టంచేయడంతో వందల కోట్ల లీటర్ల తాగు,సాగునీరు దిగువ ప్రాంతాలను ముంచేసి లక్షల ఎకరాల సాగుభూములు నీటమునుగుతున్నాయి. ఆనకట్టల నీరు సమీప ప్రాంతాల్లో గనుల తవ్వకాన్ని స్తంభింపజేస్తోంది. ఆయా నదీ ప్రవాహాల వెంట జీవవైవిధ్యం సైతం ధ్వంసమవుతోంది. మైదాన ప్రాంతాలు, పీఠభూములు సైతం నామరూపాల్లేకుండా నాశనమవుతున్నాయి. ఇలా ఆయా దేశాల్లో పర్యావరణం పతనమవుతోంది.

### జీవవైవిధ్యానికి గొడ్డలిపెట్టు

1990 దశకం నుంచి చూస్తే ఇప్పటిదాకా ఎన్నో యుద్ధాలు మరెన్నో రకాలుగా పర్యావరణ విధ్వంసానికి ప్రధాన కారణమయ్యాయి. 1990 దశకంలో యుద్ధంలో భాగంగా కువైట్‌లోని 700కుపైగా చమురు బావులకు ఇరాక్ సేనలు నిప్పు పెట్టాయి. దీంతో రోజుకు 50 లక్షల బ్యారెళ్ల చమురు అగ్నికి ఆహుతై నల్లటి మేఘాలు యావత్ ప్రాంతంలో కమ్మేశాయి. దీంతో అంతులేని పర్యావరణ విధ్వంసం జరిగింది. చమురుబావులు ఏకధాటిగా ఏడు నెలలపాటు తగలబడి చరిత్రలో ఎన్నడూ లేనంతటి పొగను సహజావరణలోకి వెదజల్లాయి. సమీప సముద్ర ఉపరితలజలాలు సైతం విస్తృతంగా పరుచుకున్న చమురు తెట్టతో పాడైపోయాయి. దీంతో పర్యావరణ సమతుల్యత బాగా దెబ్బతింది. కువైట్ లోని 99 శాతం మంచినీటి సరస్సులు కాలుష్యకాసారాలుగా మిగిలిపోయాయి. వాయుకాలుష్యానికితోడు ఆ రీజియన్‌లో మెజారిటీ ప్రజలకు శ్వాససంబంధ వ్యాధులు ప్రబలాయి. ఈ ఘటనతో ప్రపంచం ఆర్థికగాయాలను చవిచూడాల్సి వచ్చింది. ఆతర్వాతి నుంచే ముడి చమురు ధరలు వడివడిగా పెరగడం మొదలైంది.

### ఆనకట్టల పేల్చివేతతో అంతులేని విధ్వంసం

ఉక్రెయిన్‌పైకి దురాక్రమణ జెండాతో దూసుకొస్తున్న రష్యా వైమానిక దళాలు 2023లో కఖోవ్కా ఆనకట్టను రాత్రికిరాత్రే పేల్చేశారు. దీంతో డ్యామ్‌లోని అపార జలరాశి దిగువ ప్రాంతాల్లోకి వృథాగా పోయింది. దిగువ ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. 5 లక్షల ఎకరాల్లో పంటభూములు పూర్తిగా నాశనమయ్యాయి. గనులు, చమురు బావులు, పారిశ్రామిక వ్యర్థాలు మొత్తం డినిప్రో నది, నల్లసముద్ర పరీవాహక ప్రాంతాల్లోకి కొట్టుకొచ్చి పర్యావరణ విధ్వంసాన్ని మరింత పెంచాయి. ఇలా ఒక్క కఖోవ్కా డ్యామ్ పేల్చివేతతో దాదాపు వేయికిపైగా ప్రాంతాల్లో పర్యావరణం కోలుకోనంతగా పాడైపోయిందని నివేదిక పేర్కొంది. జీవవైవిధ్యం ధ్వంసమవడంతోపాటు వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలు రోడ్డునపడ్డాయి.

### తాజాగా గాజాలో..

గాజాలో ఇజ్రాయెల్ విధ్వంసం ఇంకా కొనసాగుతోంది. భవనాలు, రోడ్లను పేల్చేయడంతో గాజా అంతటా ఎక్కడ చూసినా కాంక్రీట్ శిథిలాల కుప్పలే కనిపిస్తున్నాయి. 2023-24 కాలంలో గాజాలో దాదాపు 4 కోట్ల టన్నుల చెత్త పెరిగింది. అంటే ప్రతి చదరపు మీటర్‌కు 107 కేజీల చెత్త అదనంగా వచ్చి చేరింది. గాజాలో పచ్చదనం దాదాపు పూర్తిగా కనుమరుగైంది. గాజా సమీప ప్రాంతాల్లో 80% చెట్లు కూలిపోయాయి. మూడింట రెండొంతుల సాగుభూమి బాంబులు, ఫిరంగి గుళ్లు, క్షిపణి శకలాలతో నిండిపోయి సాగుకు పనికిరాకుండా పోయాయి. తూర్పు మధ్య దరా ప్రాంతంలో భూమాత ఊపిరితిత్తులుగా ఖ్యాతిగాంచిన 'వాడీ గాజా' చిత్తడి నేలలు చాలా వరకు ధ్వంసమయ్యాయి. ఇక్కడి 150 రకాల సకశేరుక జీవులు, 70 రకాల ప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

### దళాలు.. పర్యావరణ దోషులు

రోజూ ప్రపంచవ్యాప్తంగా వందల పౌరవిమానాలు కోట్ల లీటర్ల ఇంధనాన్ని మార్గమధ్యంలో ఆకాశంలో మండిస్తూ పొగను వెదజల్లుతూ పర్యావరణానికి చేటుచేస్తున్నాయి. సముద్రమార్గాల్లో ప్రయాణిస్తూ సరుకు రవాణా నౌకలు సైతం ఇదే పనిచేస్తున్నాయి. వీటిని మించి యుద్ధాల ద్వారా దేశాల సాయుధబలగాలు అత్యధికస్థాయిలో కర్బన ఉద్గారాలను వాతావరణంలోకి విడుదల చేస్తున్నాయని నివేదిక కుండబద్దలు కొట్టింది. గ్రీన్‌హౌస్ గ్యాస్‌ల విడుదలలో యుద్ధాల్లో పాల్గొన్న దేశాల మిలటరీల వాటా 5.5 శాతానికి పెరిగింది. ఇందులో ఒక్క అమెరికా వాటానే ఒక శాతం ఉండటం గమనార్హం. యుద్ధ ట్యాంక్‌లు, శతఘ్నులు, జెట్ విమానాలు, సైనిక రవాణా వాహనాలు కోట్ల లీటర్ల ఇంధనాన్ని తాగేస్తూ పొగ, అత్యధిక స్థాయిలో కర్బన ఉద్గారాలను వెలువరిస్తున్నాయి. గాజాలో పేలుళ్లతో పేరుకుపోయిన 1.5 కోట్ల టన్నుల కాంక్రీట్ శిథిలాలు సైతం పర్యావరణానికి పెనుముప్పుగా పరిణమించనున్నాయి. సహజ వనరులు నాశనం కావడానికి కొత్తగా పొడచూపుతున్న యుద్ధాలు 40 శాతం కారణమని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇకనైనా పర్యావరణ విధ్వంసాలకు ఆయా దేశాలను బాధ్యులను చేస్తూ నష్టపరిహార, సహాయక చర్యలు తీసుకోవాలని యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్ కొన్ని సూచనలు చేసింది. అవేంటంటే..

శుభోదయం

## సంపాదకీయం

మన భద్రతా

### వ్యూహంలో.. కొత్త అధ్యాయం

ఉగ్రవాదంపై తన విధానాన్ని మరోసారి చాటి చెప్పి భారత్, ఇటీవల నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' ద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. ఈ ఆపరేషన్ కేవలం ఒక సైనిక చర్య మాత్రమే కాక, కోట్లాది భారతీయుల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచింది.'ఉగ్రవాదం, చర్చలు కలిసి ఉండలేవు. రక్తం, నీరు కలిసి పారవు, ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక సైనిక చర్య కాదు. ఇది భారత సైనిక పరా క్రమానికి ఒక కొత్త అధ్యాయం. ఉగ్రవాదంపై పోరాటంలో మైలురాయి చర్య' అని మోదీ స్పష్టంగా తెలిపారు. ఇది తాత్కాలిక చర్య కాదు.. దీని వెనుక ఉన్న విధాన మార్పే ప్రపంచం గమనించాల్సిన అంశం.ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహెల్గాంలో జరిగిన దారుణ ఉగ్రదాడిలో అమాయక పౌరులు, తమ కుటుంబాల ఎదుటే హత్య చేయబడిన సంఘటన దేశాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దాడిని కేవలం క్రూర నేరంగా కాకుండా, భారతీయ గౌరవం, సామరస్యం మీద జరిగిన కుట్రగా ప్రధాని మోడీ అభివర్ణించారు.

**ఆపరేషన్ సిందూర్ గట్టి గుణపాఠం**

ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా మే 6 – 7 తేదీలలో భారత సాయుధ దళాలు పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర శిక్షణా శిబిరాలపై ఖచ్చితమైన క్షిపణి, డ్రోన్ దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో దశాబ్దాలుగా భారత్‌కు ముప్పుగా ఉన్న 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ చర్య ఉగ్రవాద నిర్మూలనలో కీలక మలుపుగా నిలిచింది. భారత దాడులు పాకిస్తాన్‌ను కుదిపేశాయి. పాకిస్తాన్ సైనిక స్థావరాలు, వాయుసేన స్థావరాలు, నౌకాదళ ప్రధాన కేంద్రంపై నేరుగా దాడి చేయడం వారి మౌలిక సదుపాయాలను మాత్రమే కాక, మనో ధైర్యాన్ని కూడా ఛిన్నాభిన్నం చేసింది. బహవల్‌పూర్, మురిద్కే వంటి ప్రదేశాలు, గతంలో 911, లండన్ ట్యూబ్ దాడులు, ముంబయి ఉగ్రదాడులతో అనుసంధానించబడిన కేంద్రాలుగా ఉండగా, ఇప్పుడు భారత్‌కి సునాయాస లక్ష్యాలుగా మారాయి.

**'మేడ్ ఇన్ ఇండియా' డిఫెన్స్ సుపర్బ్!**

ఈ ఆపరేషన్ విజయానికి 'మేడ్ ఇన్ ఇండియా' రక్షణ పరికరాలు కీలకంగా నిలిచాయి. ఇది స్వదేశీ రక్షణ సామర్థ్యాలపై ప్రభుత్వ నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఆధునిక డ్రోన్లు, ఖచ్చితమైన క్షిపణులు... ఇవన్నీ భారత్ త్రివిధ దళాల పోరాట పటిమకి ఆధునిక సాంకేతిక వినియోగానికి పరిపక్వతకు సంకేతాలు.. మన భద్రతా సిద్ధాంతంలో మూడు ప్రధాన మార్పులు చోటు చేసుకున్నాయి. అవి కఠినమైన ప్రతీకారం ఉగ్రవాదంపై భారతదేశం ఇక నిర్దయగా, నిర్దిష్టంగా ప్రతీకారం తీసుకుంటుంది. భారత్ అణు బెదిరింపులను లెక్కచేయదు.. దానికంటే ప్రాధాన్యం దేశ గౌరవం అని ఈ ఆపరేషన్ సిందూర్ నిరూపించింది.

**స్కాల్ఫ్–ఇజి క్రూయిజ్ క్షిపణులు**

భారత రాఫెల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగించిన %ాజూూ్రా–జు+ (్రశీతీఎ ాష్ట్రుఃశీష%) క్రూయిజ్ క్షిపణులు ఫ్రాన్స్, యూకే సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ ఖచ్చితత్వ దాడి ఆయుధం కొన్ని అత్యాధునిక లక్షణాలతో రూపొందించ బడింది. ఈ ఆయుధం రాడార్‌లకు చిక్కకుండా లక్ష్యాన్ని చేరు తుంది. భారీ కాంక్రీటు బంకర్లను ధ్వంసం చేయగల సత్తా కలిగి వుంది. శక్తివంతమైన వార్‌హెడ్ ఉండటంతో పాటు లక్ష్యాలను స్వయంగా గుర్తించగలదు. 250 కి.మీ పైగా ప్రయాణించగలదు, అంత దూరం ఉన్న లక్ష్యాలను ఇక్కడి నుండే దాడి చేయగలదు. ఈ క్షిపణులను ఉపయోగించి బహావల్పూర్, మురీద్కే వంటి ఉగ్ర స్థావరాలను అత్యంత ఖచ్చితంగా ధ్వంసం చేశాయి. అదే సమయంలో, భారత్, రష్యా కలిసి అభివృద్ధి చేసిన బ్రహ్మోస్ సూపర్ సోనిక్ క్షిపణులు కూడా ఉపయోగించబడ్డాయి. ఇవి ప్రపంచంలోనే అత్యంత వేగంగా ప్రయాణించే క్రూయిజ్ క్షిపణులలో ఒకటి. వీటిని కీలకమైన పాకిస్తాన్ మౌలిక సదుపాయాలను వేగంగా ధ్వంసం చేయడానికి వినియోగించారు.

**గేమ్ చేంజర్ ఎస్– 400**

ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఎస్–400 విస్తృతమైన రేంజ్‌ను కలిగి ఉంది. 600 కి.మీల దూరంలోని లక్ష్యాలను సైతం ఇది గుర్తించగలదు. 400 కిలోమీటర్ల వరకూ మిసైళ్లను ప్రయో గించి శత్రు దేశాలకు చెందిన యుద్ధ విమానాలు (%ఖీ–16, ఖీ%–35, సుఖోయ్–30), క్రూయిజ్ క్షిపణులు, బాలిస్టిక్ మిసైళ్లు, డ్రోన్లు, ఇతర హానికర వాయుసేన వస్తువులను నాశనం చేయగలిగింది. దీని రియాక్షన్ టైమ్ కూడా చాలా తక్కువగా ఉండటం వల్ల 5–10 సెకన్లలో కదులుతున్న టార్గెట్‌ను లాక్ చేసి నేల కూల్చగలిగింది. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌లో ఉన్న కీలకమైన సాంకేతిక అంశాలు ఏకకాలంలో 100 కంటే ఎక్కువ లక్ష్యాలను ట్రాక్ చేయగలదు. 4 రకాల మిసైళ్లతో విభిన్న రేంజ్‌లలో రక్షణ. లక్ష్యాన్ని 5–10 సెకన్లలో గుర్తించి తిప్పికొట్టే సామర్థ్యం. వాహనాలపై కదిలే విధంగా రూపొందించబడిన ఈ వ్యవస్థ ఎక్కడికైనా తేలికగా మోహరిం చగలదు. ఫలించిన పారికర్ దృఢ నిర్ణయం 2016లో రక్షణ మంత్రి మనోహర్ పారికర్ తీసుకున్న దృఢమైన నిర్ణయం ఫలితంగా, %ూ%–400 కొనుగోలు చేయవద్దని అమెరికా, భారత్‌పై ఎంతో ఒత్తిడి తీసుకువచ్చింది. మన దేశంలోని నేతలు వ్యతిరేకించినప్పటికీ.. భారత్‌కి చైనా, పాకిస్తాన్ నుంచి పొంచి ఉన్న ముప్పు కారణంగా వీటిని రష్యా నుంచి కొనుగోలు చేశారు. అదే ఇప్పుడు మనల్ని కాపాడింది. అదే కాకుండా ప్రపంచంలోనే అత్యుత్తమ డిఫెన్స్ టెక్నాలజీ ఆయన హయాంలోనే భారత్‌కు లభ్యమైంది. ఇప్పుడు ఆ విజ్ఞానం వాస్తవంగా ఫలాలు ఇస్తోంది. సాంకేతిక సమన్వయం, విజయం వెనుక ఉన్న శాస్త్రీయ శక్తి ఈ ఆపరేషన్ విజయవంతంగా సాగడానికి ప్రధాన కారణం.. భారత సైన్యం అత్యంత ఆధునిక వ్యవస్థలను ఖచ్చితంగా సమన్వయం చేయడమే. రియల్ టైం శాటిలైట్ ఇమేజింగ్, ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ జామింగ్ టెక్నాలజీలు Network-centric warfare ఆధారిత సమాచార బదిలీ మొత్తంగా, ఆపరేషన్ సిందూర్ ఒక సాంకేతిక విజ్ఞాన ఆధారిత దేశభక్తి.. శాస్త్ర, వ్యూహ, సామర్థ్యాల సమన్వయ రూపకల్పనగా నిలిచింది. ఇది భవిష్యత్తులో భారతదేశం సాధించబోయే వ్యూహాత్మక ఆధిక్యం వైపు తీసుకెళ్లే మరొక అడుగు.

# 'శాంతిదూత' ట్రంప్!



కాయిదాతో, ఐఎస్‌తో సంబంధాలుండేవి. ఈ భేటీకి ముందే గల్ఫ్ సహకార మండలి(జీసీసీ) సదస్సులో సిరియాపై ఆంక్షలు ఎత్తేస్తున్నట్టు తెలియజేశారు. ఈ నిర్ణయాలపై ఇజ్రాయెల్ అలిగినా, మరొకరు అభ్యంతర పెట్టినా ఆయన ఖాతరు చేయదల్చుకున్నట్టు లేరు. గత నెలలో ట్రంప్‌ను కలిసి సిరియాపై ఆంక్షలు కొనసాగించాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ వేడుకున్నారు. ఇరాన్ విషయంలో అయితే చాలా చెప్పివుంటారు. సిరియాపై ఆంక్షలు ఎత్తేయటం, ఇరాన్‌తో చెలిమికి సిద్ధపడటం నెతన్యాహూకు ససేమిరా ఇష్టం లేదు. కానీ లీకుల ద్వారా తప్ప నేరుగా తన అసమ్మతిని ఇంతవరకూ

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అంత సులభంగా అర్థం కారని ఆయన గల్ఫ్ దేశాల పర్యటన తీరుతెన్నులు చూస్తే తెలుస్తుంది. తాను అధికారంలోకొస్తే పశ్చిమాసియాలో సాగుతున్న 'అంతూ దరీ లేని యుద్ధాలకు' ముగింపు పలుకుతానని అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో ఆయన తరచు అనే వారు. ప్రస్తుతం కొనసాగుతున్న నాలుగు రోజుల గల్ఫ్ పర్యటనలో ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు గమనిస్తే ఆ వాగ్దానాన్ని ఆయన నెరవేర్చదల్చుకున్నట్టు కనబడుతోంది. తన రెండో దశ పాలనలో ట్రంప్ మొదలెట్టిన తొలి విస్తృత విదేశీ పర్యటన ఇది. ఈ ప్రాంతంలోనే ఉన్న ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్లకపోవటం ఆయన తాజా వైఖరికి సంకేతం. ఇది ఎన్నాళ్లుంటుందన్నది తెలియక పోయినా చేస్తున్న ప్రకటనలైతే భిన్నంగా ఉన్నాయి. ఇరాన్‌తో అమెరికా 46 ఏళ్లుగా సాగిస్తున్న 'అప్రకటిత యుద్ధం' ఇక కొనసాగనీయరాదన్న అభిప్రాయం ఉందని మంగళవారం సౌదీ అరే బియాలోని రియాద్‌లో ఆయన ప్రకటించారు. బుధవారం సిరియా అధ్యక్షుడు అహ్మద్ అల్–షారాతో భేటీ అయ్యారు. ఇజ్రాయెల్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకొనాలని సలహా ఇచ్చారు. అల్–షారాకు గతంలో అల్

తెలియజేయలేదు. ఆ మధ్య ట్రంప్ ఇందుకు భిన్నంగా మాట్లాడారు. అణు ఒప్పందాన్ని అంగీకరించి, శాంతికి సిద్ధపడకపోతే ఇరాన్ భారీ స్థాయి ఒత్తిడులు ఎదుర్కొనక తప్పదని హెచ్చరించారు. కానీ ట్రంప్ తాజా ధోరణి అందుకు భిన్నంగా ఉంది. ఇరాన్‌తో చెలిమి గురించి ఆయన ఏదో మాటవరసకు అనలేదు. 'ప్రస్తుతం అమెరికాకు అత్యంత సన్నిహిత దేశాలు కొన్ని తరాల కిందట మాపై శత్రుత్వంతో చెలరేగినవే' అని గుర్తుచేశారు. సిరియా, ఇరాన్‌ల విషయంలో తన వైఖరి మారటానికి సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ కారణమని ఆయన జీసీసీ వేదికపైనే ప్రకటించారు కూడా. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదార్లు ఇజ్రాయెల్‌పై విరుచుకుపడుతూనే ఉన్నా ఈనెల 5న వారితో అవగాహనకొచ్చారు. స్నేహంలోనైనా, శత్రుత్వంలోనైనా ట్రంప్ తీరే వేరని ఆయన నిర్ణయాలు తెలియజేస్తున్నాయి. మూడేళ్లనాడు అప్పటి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సౌదీ వచ్చినప్పుడు దేశంలో మానవహక్కులు అడుగంటుతున్న వైనంపై సౌదీ యువరాజును నేరుగా ప్రశ్నించారు. 2018లో జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి ప్రాణం తీయించడాన్ని ప్రస్తావించారు. ఈ మాదిరి హత్యలు తమకు సమ్మతంకావని చెప్పారు. అందుకే కావొచ్చు... ఇప్పుడు ట్రంప్‌కు ఎదురైన స్వాగతసత్కారాల వంటివి బైడెన్‌కు లభించలేదు. సౌదీ గడ్డపై గతకాలపు అమెరికా అధ్యక్షుల్ని నిశితంగా విమర్శించటానికి ట్రంప్ వెన కాడలేదు. అమెరికన్ సమాజం గురించి కాస్తయినా తెలియనివారు ఎంతో జటిలమైన గల్ఫ్ సమా జాల్లో జోక్యం చేసుకోవటానికి ఎగబడ్డారని వ్యాఖ్యానించటం చిన్న విషయం కాదు. పశ్చిమాసియా దేశాలతో ఎన్ని వేల కోట్ల డాలర్ల ఒప్పందాలు కుదుర్చుకోగలమన్నదే ఆయన ఆరాటంగా కనబడు తోంది. దానికి తగ్గట్టే మంగళవారం సౌదీతో 14,200 కోట్ల డాలర్ల మేర ఆయుధ ఒప్పందంపై సంతకాలయ్యాయి. ఇదిగాక అమెరికాలో 60,000 కోట్ల డాలర్ల పెట్టుబడులు పెట్టబోతున్నట్టు యువరాజు ప్రకటించారు. ట్రంప్ దీంతో సంతృప్తిపడలేదు. దీన్ని లక్ష కోట్ల డాలర్లకు పెంచాలని ఆ వేదికపైనుంచే కోరారు. సౌదీతో అమెరికాకు ఎప్పుడూ మంచి స్నేహసంబంధాలేవున్నా ఈ స్థాయి ఒప్పందాలెప్పుడూ లేవు. ఒక పరిశోధక సంస్థ నివేదిక ప్రకారం 2010–20 మధ్య అమెరికాకు సౌదీతో 10,000 కోట్ల డాలర్ల విలువైన ఆయుధ ఒప్పందాలు మాత్రమే కుదిరాయి. స్నేహం పేరుతో అమెరికాను దోచుకుంటున్నారని నాటో భాగస్వామ్య దేశాలైన పాశ్చాత్య మిత్రులపై తరచూ విరుచుకుపడే ట్రంప్...పశ్చిమాసియా దేశాలకు ఏ కష్టమొచ్చినా అమెరికా దృఢంగా నిలబడుతుందని హామీ ఇవ్వటం గమనార్హం. ఇంధన అవసరాల్లోనూ, రక్షణరంగంలోనూ పనికొచ్చే అత్యంత విలువైన లిథియం, కోబాల్ట్‌లతోపాటు థోరియం వంటి రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ అన్వేషించి అమెరికా చేర్చటానికి సౌదీ%–%అమెరికా ఖనిజ సంస్థల మధ్య ఈ పర్యటనలో 900 కోట్ల డాలర్ల ఒప్పందం కుదరటంతో ట్రంప్ సంతోషానికి పట్టపగ్గాల్లేవు. అందువల్లే పశ్చిమాసియాకు శక్తి మంతమైన సెమీ కండక్టర్ చిప్స్, ఏఐ డేటా సెంటర్లకు పనికొచ్చే కీలక విడిభాగాల ఎగుమతులకు ఆయన పచ్చజెండా ఊపారు. ఇది సంప్రదాయ అమెరికా విదేశాంగ విధానానికి భిన్నం. ఈ పర్యటనలో ట్రంప్ స్వకార్యమూ నెరవేర్చుకుంటున్నారన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. దేశ ప్రయోజనాలకూ, అధ్యక్షుడిగా ఆయన నిర్ణయాలకూ చుక్కెదురన్నది విమర్శకుల వాదన. ట్రంప్ సొంత సంస్థకు సారథ్యం వహిస్తున్న ఆయన కుమారులు గత కొన్నివారాలుగా గల్ఫ్‌లో తిష్ఠ వేసి తమ సంస్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారనీ, కుదిరిన ఒప్పందాలన్నీ వారికి మేలు కలిగించేవేననీ అంటున్నారు. ఏది ఏమైనా ట్రంప్ వైఖరి మళ్లీ మారేలోగా పశ్చిమాసియా చక్కబడితే ప్రపంచానికి అంతకన్నా కావాల్సిందేమీ లేదు.

# కాల్పుల విరమణ వ్యూహమా? ఒత్తిడినా?




పహల్గాం ఉగ్రదాడి భారతదేశ ప్రజల హృదయాలను తీవ్రంగా గాయపరిచింది. అమాయకులైన పర్యాటకులను మతం పేరు అడిగి మరీ చంపిన విధానాన్ని దేశం జీర్ణించుకోలేకపోయింది. దేశవ్యాప్తంగా ఆందోళనలు, ఆవేదనలు వెల్లువెత్తాయి. ఈ దాడికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' ఉగ్రవాద స్థావరాలపై సంచలనాత్మక ప్రతీకార చర్యగా నిలిచింది. శత్రు శిబిరాల్లోని వందకు పైగా ఉగ్రవాదులను మట్టుబెట్టడం ద్వారా భారత సైన్యం తమ నిపుణతను, ధైర్యాన్ని మరోసారి నిరూపించింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే క్రమంలో కుల, మత, ప్రాంతాలకు అతీతంగా దేశ ప్రజలు ఒక్కటైన తీరు, రాజకీయాలను వీడి ఏకమైన నాయకుల ప్రవర్తన, ప్రతి భారతీయుడి గుండె చప్పుడులో ఉగ్రవాదాన్ని అణచివేయాలనే ఆకాంక్ష, అన్ని కలిసి దేశంలో జాతీయ చైతన్యాన్ని రగిలించాయి. కానీ, పరిస్థితి ఇక్కడితో ఆగలేదు. సరిహద్దుల్లో పాకిస్తాన్ కాల్పులకు తెరలేపింది. పాకిస్తాన్ ప్రతీ ఒక్క దాడికి భారత సైన్యం అనూహ్య ధైర్యంతో, సమర్థవంతంగా బదులిచ్చింది. ఈ పరిణామాల వల్ల రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉధృత స్థాయికి చేరాయి. ఈ పరిణామాలు ఇలాగే కొనసాగితే, రెండు అణ్వాయుధ దేశాల మధ్య యుద్ధం తప్పదేమోననే భావన అంతర్జాతీయంగా ఆందోళన వెల్లువెత్తాయి. ప్రపంచంలోని దేశాలన్నీ భారత్ –పాకిస్తాన్ మధ్య నెలకొన్న ఈ ఉద్రిక్తతలు ఎంతవరకు వెళతాయేమోనని ఆందోళన చెందాయి. ఇటువంటి ఉద్విగ్న వాతావరణంలో 'కాల్పుల విరమణ' అనే ప్రకటన ఒక్కసారిగా వినిపించడం దేశప్రజలకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇది భారత్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయమా? లేక అంతర్జాతీయ ఒత్తిడికి స్పందనగా వచ్చిన ఫలితమా? అనే సందేహాలు, అనుమానాలు దేశ మొత్తం విస్తరించాయి. దేశ ప్రజలలో నెలకొన్న ఈ సందేహాలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్వీట్ మరింత బలపరిచింది. ఆయన ట్వీట్ కాల్పుల విరమణలో అమెరికా పాత్ర ఉందన్న ఊహాగానాలకు ఊపునిచ్చింది. అమెరికా అధినేత ఈ పరిణామాల్లో భాగం కావడం అనుమానాలకు తావిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో 2025 మే 12న, భారత్ పాకిస్తాన్ మధ్య డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒ) స్థాయిలో హాట్‌లైన్ ద్వారా కీలక చర్చలు జరిగాయి. ఈ చర్చలలో ప్రధానంగా చర్చించబడిన అంశాలు, పూర్తి కాల్పుల విరమణ: లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద రెండు దేశాలు కాల్పులు జరగకుండా పరస్పర అంగీకారానికి వచ్చాయి. సైనికుల తగ్గింపు: సరిహద్దు, ముందస్తు ప్రాంతాలలో సైనికుల సంఖ్యను తగ్గించే చర్యలను వెంటనే అంగీకరించారు. శాంతి, స్థిరత్వం: పరస్పర శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు, ఎటువంటి శత్రుత్వ చర్యలు లేకుండా ముందుకు సాగాలని నిర్ణయించారు. ఈ చర్చలు, 2025 మే 10న ప్రారంభమైన కాల్పుల విరమణ ఒప్పందాన్ని కొనసాగించేందుకు, సరిహద్దు ప్రాంతాలలో శాంతిని పునరుద్ధరించేందుకు కీలకంగా ఉన్నాయి. అయితే, ఈ డిజిఎంఒల చర్చల తర్వాత కొన్ని గంటల్లోనే, లైన్ ఆఫ్ కంట్రోల్ వద్ద కాల్పులు జరిగాయనే వార్తలు కొన్ని వచ్చాయి. భారత్, పాకిస్తాన్ కాల్పుల విరమణ ఉల్లంఘించిందని ఆరోపించింది. అయితే, ఈ ఆరోపణలను పాకిస్తాన్ ఖండించింది. ప్రస్తుతం పరిస్థితి సున్నితంగా ఉంది, రెండు దేశాలుపరస్పరం శాంతిని కాపాడేందుకు చర్చలు కొనసాగిస్తున్నాయి. ఈ చర్చలు మొదటి దశ మాత్రమే. భారత్– పాకిస్తాన్ మధ్య జరిగిన చర్చలు, రెండు దేశాల మధ్య మారుతున్న దృక్పథానికి సంకేతంగా భావించవచ్చు. ఈ చర్చలు ఒక సానుకూల సంకేతంగా కనిపిస్తున్నా వీటి వెనక దాగిన మౌలిక ఉద్దేశం ఏమిటో స్పష్టంగా తెలియడం లేదు. యుద్ధ వాతావరణం నుండి చర్చల దశకు జరిగిన ఈ మార్పు ఒక ఊరట నిచ్చే అంశమే. అయితే, ఈ మార్పు తాత్కాలిక శాంతికి సంకేతమా? లేక దీర్ఘకాలిక సుస్థిరతకు మార్గనిర్దేశమా? అనే ప్రశ్నలకు స్పష్టత రావాల్సి ఉంది. ఇక్కడే మన భారత ప్రధాని నరేంద్ర మోడీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ప్రాధాన్యతను సంతరించుకుంది. 2025 మే 12న జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై తీవ్రంగా స్పందించారు. ఆ దాడిలో అమాయక ప్రజల ప్రాణాలు పోవడం దేశాన్ని కలిచివేసిందని పేర్కొన్నారు. దానికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని, భారతదేశ సైనికుల వీరత్వానికి నిదర్శనమని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని, భవిష్యత్తులో కూడా దేశ భద్రతకు భంగం కలిగించే శక్తులపై భారత్ తగిన తీరులో స్పందిస్తుందని హెచ్చరించారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పాకిస్తాన్ కఠిన పరిణామాలకు సిద్ధంగా ఉండాలని మోడీ స్పష్టంగా హెచ్చరించారు. శాంతి కోసం మన ప్రయత్నం కొనసాగుతుంది, కానీ దేశ భద్రతకు భంగం కలిగించే ఎవ్వరినీ విడిచిపెట్టం అనే ప్రధాని మోడీ సందేశం ఒక వైపు శాంతికి మద్దతు ఇస్తూనే, మరోవైపు దేశరక్షణ విషయంలో ఏ మాత్రం వెనక్కి తగ్గబోమనే సంకేతాన్ని ప్రపంచానికి చాటి చెప్పింది. శాంతికి మద్దతు, భద్రత విషయంలో రాజీ లేదు అనే ప్రధాని సందేశం మలిదశ చర్చలకు గట్టి పునాది వేసిందని చెప్పవచ్చు. ఈ మొత్తం పరిణామాలను సమగ్రంగా విశ్లేషిస్తే, కాల్పుల విరమణ వెనక వ్యూహాత్మక స్పష్టత ఉందా? లేక అంతర్జాతీయ ఒత్తిడికి లోబడి తీసుకున్న తాత్కాలిక నిర్ణయమా? అనే సందేహం ప్రజల మనసుల్లో ఇంకా మిగిలే ఉంది. శాంతి అత్యవసరం అయినా, అది స్థిరంగా నిలవాలంటే స్పష్టమైన దిశానిర్దేశం, బలమైన కార్యాచరణ అవసరం. శాంతి పేరుతో మౌనంగా తలవంచడం భవిష్యత్‌కి ప్రమాదకరంగా మారవచ్చు. శాశ్వత శాంతికి ధైర్యవంతమైన నిర్ణయాలు, ప్రజల రక్షణను కేంద్రీకరించిన వ్యూహం అవసరం. ప్రపంచ ఒత్తిడుల కంటే దేశ భద్రతే ప్రథమ లక్ష్యం కావాలి. యుద్ధం ఉపశమనం ఇవ్వదు, కానీ శాంతి నిలబడాలంటే దానిని భంగం చేసే శక్తులకు భయం కలిగించే సామర్థ్యం మనకు ఉండాలి. బలహీన దేశాల శాంతి ఎప్పుడూ దాడుల అంచులపై నడిచిందని, శాంతి కోసం మూల్యం చెల్లించాల్సి వచ్చిందని చరిత్ర చెబుతుంది. అందుకే, శాంతిని మాటలతో కాదు, శక్తితో రక్షించాలి. శత్రువు మనపై దాడికి ముందు పది మేరలు ఆలోచించాలంటే, మన దగ్గర అగ్ని పేటిక ఉందనే భయం ఉండాలి. %–% అది అణ్వాయుధం కావచ్చు, అధునాతన సైనికశక్తి కావచ్చు, అంతర్జాతీయ మద్దతు కావచ్చు. కనికరం లేకుండా ఉగ్రవాద దేశాలకు ఇవ్వవలసిన సందేశం ఒకటే: 'మన దేశాన్ని తాకడమంటే చితిమంటకు ఆహ్వానం' పలకడమని. జై భరత మాత.

# పిఓకె మనకు దక్కుతుందా?




సరిహద్దు ప్రావిన్స్‌కు చెందిన వేలాది మంది పష్టున్ గిరిజనులు మహారాజా పాలన నుంచి జమ్మూకశ్మీర్‌కు విముక్తి కల్పించాలన్న లక్ష్యంతో పాకిస్తాన్ సైన్యం మద్దతుతో పోరాటం సాగించారు. పరిస్థితిని అదుపు చేయడంలో మహారాజా హరిసింగ్ సైన్యం విఫలమైంది.ఫలితంగా తిరుగుబాటుదారులు పూంచ్ జిల్లాలో ఎక్కువ భాగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకున్నారు. ముజఫరాబాద్, బారాముల్లాలను స్వాధీనం చేసుకోవడంలో విజయం సాధించారు. ఇక చేసేదిలేక భారత ప్రభుత్వ సహాయాన్ని మహారాజా కోరారు. దానికి భారత ప్రభుత్వం ఒక షరతు విధించింది. భారతదేశంలో జమ్మూకశ్మీర్

పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి సాధించుకోవాలన్న పట్టుదలతో భారత ప్రభుత్వం ఉంటోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను అప్పగించడం మినహా మరో విషయం లేదని, అంతకు మించి మాట్లాడేది లేదని స్పష్టం చేసింది. కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చొరవ చూపించినా దానికి భారత్ ఒప్పుకోవడం లేదు. ఇందులో ఎవరి మధ్యవర్తిత్వాన్ని కోరుకోవడం లేదని కరాఖండీగా చెప్పింది. చారిత్రాత్మకంగా ఒకప్పుడు కశ్మీర్ రాచరిక రాష్ట్రంలో భాగమైన పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఓకె)ను 1947లో పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. 1947లో భారతదేశం స్వాతంత్ర్యం పొందినప్పుడు భారతదేశంలో లేదా పాకిస్థాన్‌లో చేరడం లేదా స్వతంత్రంగా ఉండటం అనే ఎంపికకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు (%ఝింప్ర్రఎఅతీ ర్శీతీఎ% ) బ్రిటిష్ వారు అవకాశం కల్పించారు. ఆ సమయంలో జమ్మూకశ్మీర్ పాలకుడు మహారాజు హరిసింగ్ స్వతంత్ర రాజ్యంగా ఉండాలనే హోదాను ఎంచుకున్నారు. అయితే 1947లో పూంచ్‌లో హరిసింగ్ ఆ ప్రాంత రైతులపై విధించిన శిక్షాత్మక పన్నుల కారణంగా తిరుగుబాటు తలెత్తింది. అదే సంవత్సరం అక్టోబర్‌లో వాయువ్య

విలీనం ఒప్పందానికి అంగీకరిస్తూ సంతకం చేయాలని సూచించింది. దాంతో మహారాజు హరిసింగ్ అంగీకరించారు. జమ్మూకశ్మీర్ రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, కమ్యూనికేషన్ నియంత్రణను భారత ప్రభుత్వానికి అప్పగించారు. దీంతో భారత్, పాకిస్తాన్ మధ్య యుద్ధం సంభవించింది. ఫలితంగా రెండు ప్రాంతాలపై స్థిరనియంత్రణ లభించింది. పాకిస్తాన్ మద్దతుగల తిరుగుబాటుదారుల ప్రభావంలో ఉన్న ప్రాంతం పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌గా ఇప్పుడు పిలవబడుతున్నది. పేరుకే స్వయం పరిపాలనా ప్రాంతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని పాకిస్తాన్ పరిపాలిస్తోంది. పాకిస్తాన్ ఈ ప్రాంతాన్ని ఆజాద్ కశ్మీర్‌గా వ్యవహరిస్తోంది. దీనికి సరిహద్దులుగా ఉత్తరాన గిల్గిట్ బల్టిస్థాన్ (గిల్గిట్ బల్టిస్థాన్ ఆజాద్ కశ్మీర్‌లో భాగం కాదు). దక్షిణాన పాకిస్తాన్ పంజాబ్, పశ్చిమాన ఖైబర్ పఖ్తూన్క్వాలు ఉన్నాయి. తూర్పు వైపున జమ్మూకశ్మీర్ ఉంది. ఈ రెండింటి మధ్య నియంత్రణ రేఖ (ఎల్ఒసి) ఉంది. ఇది భారత, పాకిస్తాన్ మధ్య వాస్తవ సరిహద్దుగా పనిచేస్తుంది. భౌగోళికంగా ఈ భూభాగం మొత్తం వైశాల్యం 13,297 కి.మీ (5134 చదరపు మైళ్లు). ముజఫరాబాద్ నగరం దీని రాజధాని. 2017 జాతీయ జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభా 40,45,366. దాదాపు జనాభా అంతా ముస్లింలే. పిఓకెలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ఉంది. అధ్యక్షుడు రాజ్యాంగబద్ధమైన దేశాధినేత కాగా, ప్రధాన మంత్రి, మంత్రుల మండలి మద్దతుతో కార్యానిర్వాహకత్వం వహిస్తారు. ఏకసభ లెజిస్లేటివ్ అసెంబ్లీ ప్రధాన మంత్రి, రాష్ట్రపతి ఇద్దరినీ ఎన్నుకుంటుంది. స్వంత సుప్రీం కోర్టు, హైకోర్టు ఉన్నాయి. అయితే పాకిస్తాన్ ప్రభుత్వ కశ్మీర్ గిల్గిత్ బాల్టిస్థాన్ వ్యవహారాల మంత్రిత్వశాఖ, పాకిస్థాన్ ప్రభుత్వానికి, పిఓకె ప్రభుత్వానికి మధ్య అనుసంధానంగా పనిచేస్తుంది. అయితే దీనికి పాకిస్తాన్ పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం లేదు. పిఓకెలోని ఉత్తరభూభాగం తరచుగా తీవ్ర భూప్రకంపనాలకు గురవుతుంది. 2005లో సంభవించిన భారీ భూకంపం వల్ల లక్షమంది మృతి చెందగా, మరో 30 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. దీనివల్ల ఈ ప్రాంతం మౌలిక సదుపాయాలు, ఆర్థిక వ్యవస్థ విధ్వంసమయ్యాయి. వ్యవసాయం, పర్యాటకం, సేవలు పైనే ఈ ప్రాంతం ఆర్థిక వ్యవస్థ ఆధారపడి ఉంది. ఒకవంక పాకిస్తాన్, మరోవంక విదేశీ సాయాలతోనే పిఓకె మనుగడ సాగిస్తోంది. దాదాపు 87% పిఓకె కుటుంబాలకు వ్యవసాయ భూములు ఉన్నాయి. పిఓకెలో ద్రవ్యోల్బణ ఒత్తిడి ఎక్కువగానే ఉంది. దీనికి వ్యతిరేకంగా ఆందోళనలు తలెత్తుతున్నాయి. పాకిస్తాన్ ప్రభుత్వ ఉదారవాద విధానాలు, నిరుద్యోగం, అధిక వలసలు ఇవన్నీ తీవ్ర సమస్యలుగా వెంటాడుతున్నాయి. నిరుద్యోగ రేటు 33% వరకు ఉంది. ఉపాధి కోసం యువత గల్ఫ్‌దేశాలకు వలసపోతున్నారు.గత కొన్ని రోజులుగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అక్కడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది.అసలే ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉండటం, పిఓకెలో ఉన్న వనరులను స్థానిక ప్రజలకు కాకుండా పాక్‌లోని ఇతర ప్రాంతాలకు ప్రభుత్వం తరలించుకుపోతుండడంతో స్థానికుల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోంది. ఇక్కడి జలవిద్యుత్‌ను పాకిస్థాన్‌లోని ఇతర ప్రాంతాలు, నగరాలకు సరఫరా కోసం తరలిస్తున్నారని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు. హక్కుల కోసం ప్రజలు వీధికెక్కుతున్నారు. ఈ పరిణామాలన్నీ పిఓకెపై పాకిస్థాన్ ప్రభుత్వ పట్టుకోల్పోడానికి దోహదం చేస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇవన్నీ గమనించి పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తమ పాలన లోకి తెచ్చుకోవాలని భారత ప్రధాని మోడీ ఆకాంక్షిస్తున్నారు. అంతేకాదు చర్చల్లో ఇదే ప్రధాన అజెండాగా నిలుస్తోంది.

## ఆరావళి గ్రీన్‌వాల్ ప్రాజెక్టును ప్రారంభించిన ప్రధాని మోడీ



న్యూఢిల్లీ : ప్రపంచ పర్యావరణ దినోత్సవం. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ గురువారం ఢిల్లీలో భగవాన్ మహవీర్ వనస్థలి పార్కులో ఒక మొక్కను నాటారు. ఢిల్లీ నుంచి గుజరాత్ వరకు విస్తరించి ఉన్న 700 కి.మీ ఆరావళి పర్వత శ్రేణిలో అడవులకు తిరిగి పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిందని మోడీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం మొక్కలు నాటేందుకు ఓ కార్యక్రమాన్ని రూపొందించింది. దీనికి 'ఏక్ పెడ్ మా కే నామ్' (ఒక చెట్టుకు నా పేరు) పేరుతో ప్రచారాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగానే ప్రచారాన్ని విస్తరించినట్లు ప్రధాని తెలిపారు. కాగా, పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. 'అత్యంత పురాతన పర్వత శ్రేణుల్లో ఆరావళి పర్వత శ్రేణి ఒకటి. ఇది గుజరాత్, రాజస్థాన్, హర్యానా, ఢిల్లీలను కవర్ చేస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ పర్వత శ్రేణి అనేక పర్యావరణ సవాళ్లను ముందుకు తెచ్చింది. ఈ సవాళ్లను తగ్గించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని' మోడీ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. ఈ పర్వత శ్రేణిని కాపాడుకునేందుకు తమ ప్రభుత్వం దృష్టిసారించినట్లు ప్రధాని పేర్కొన్నారు. ఈ శ్రేణితో అనుసంధానమైన ప్రాంతాలను పునరుజ్జీవింపజేయడంపై మేము దృష్టి పెట్టాము. దీనికి స్థానిక పరిపాలనతో కలసి పని చేయబోతున్నాము. ఇలా జరగాలంటే నీరు సమృద్ధిగా ఉండాలి. అందుకు తగినవిధంగా నీటి వ్యవస్థలను కూడా మెరుగుపరచేందుకు కృషి చేస్తున్నాం. అలాగే పర్యావరణ మార్పుల్లో భాగంగా తలెత్తే వాయు తుఫానులను అరికట్టడం, ఈ శ్రేణి థార్ ఎడారి తూర్పువైపు విస్తరణను ఆపడం వంటి చర్యలను చేపట్టినట్లు మోడీ పేర్కొన్నారు.ం

## భారత్‌తో సంప్రదింపులకు అమెరికా సహాయం కోరుకుంటున్న అమెరికా



వాషింగ్టన్ డిసి (అమెరికా) : పెహల్గామ్ దాడి తర్వాత పాకిస్తాన్ ఉగ్రవాద దాడికి వ్యతిరేకంగా భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత ఆర్మీ పాకిస్తాన్ ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసింది. ఆ తర్వాత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం ఏడు అఖిలపక్ష బృందాలను ఏర్పాటు చేసి ప్రపంచ దేశాలకు తన గళాన్ని వినిపిస్తోంది. ఇప్పటికే పలు దేశాలు ఈ బృందాలు వెళ్లి ఉగ్రవాదంపై భారత వైఖరిని స్పష్టం చేశాయి. ఈ సందర్భంగా పలు దేశాలు భారత్‌కి మద్దతుగా నిలుస్తున్నాయి. ఈ తరుణంలో ఉగ్రవాదానికి కేంద్ర బిందువైన పాకిస్తాన్‌కి ఆందోళన మొదలైంది. ప్రపంచ దేశాలు ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నిలవడంతో.. పాకిస్తాన్ ప్రధాని భారత్‌తో సంప్రదింపులు జరిపేందుకు సిద్ధమయ్యారు. శాంతి చర్చల కోసం భారత్‌తో సంప్రదింపులు జరిపేందుకు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అమెరికా సహాయాన్ని కోరుతున్నారు. ప్రస్తుతం పొరుగున్న భారత్‌తో తలెత్తిన ప్రస్తుత పరిస్థితులను చక్కదిద్దేందుకు ట్రంప్ సహాయాన్ని కోరినట్లు, ఇరు దేశాల మధ్య సంప్రదింపులను సులభతరం చేయాలని అమెరికాను కోరినట్లు ఇస్లామాబాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో షెహబాజ్ అన్నారని మీడియా పేర్కొంది.

## ప్రకృతిని మనం కాపాడితే.. అదే మనల్ని కాపాడుతుంది



**హైదరాబాద్,** :ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకురావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన సీఎం కార్యాలయం తరఫున ఒక ప్రత్యేక సందేశాన్ని విడుదల చేశారు. "ప్రకృతిని మనం కాపాడితే, అదే మనల్ని కాపాడుతుంది" అని సీఎం స్పష్టంగా తెలిపారు. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం థీమ్ "ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ"గా ఉన్న నేపథ్యంలో, ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించే దిశగా కృషి చేయాలని, దానికి సంబంధించి ప్రతిజ్ఞ చేయాలని సీఎం కోరారు. సహజ వనరుల సంరక్షణకు ప్రతిసారీ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని, రాబోయే తరాల కోసం ఈ వనరులను నిలుపుదల చేయాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. ఈ సందర్భంగా అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కూడా ఓ ప్రకటనను విడుదల చేశారు. "చెట్లను పెంచాలి, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి. మన ఆరోగ్యం కోసం కాదు, మన భవిష్యత్ తరాల భద్రత కోసమూ పర్యావరణాన్ని కాపాడాలి," అంటూ ఆమె పిలుపునిచ్చారు. వర్షాకాలం ప్రారంభమవుతున్న వేళ,రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా వన మహోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. గత ఏడాది అనుభవాల నేపథ్యంలో, ఈసారి మరింత విస్తృతంగా చెట్ల నాటే కార్యక్రమాలను చేపట్టేందుకు మంత్రి సురేఖ అధికారులకు స్పష్టమైన మార్గనిర్దేశం చేశారు.

## 250 కోట్ల మొక్కలు నాటి, రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌ది..



**హైదరాబాద్,** : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో అమలైన హరిత హారం కార్యక్రమం రాష్ట్రంలో హరిత విప్లవాన్ని సృష్టించిందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో గ్రీన్ కవర్ 24% నుంచి 31%కి పెరిగిందని.. అంటే 7.7% వృద్ధిని సాధించి దేశానికి ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. మొత్తం 250 కోట్ల మొక్కలు నాటి, రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్ దని కొనియాడారు. తాము మేం కేవలం ఆకుపచ్చని తెలంగాణ గురించి మాట్లాడలేదని.. కలను సాకారం చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పర్యావరణ పరిరక్షణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మొక్కల నాటే హరిత నిధిని 53% తగ్గించిందని మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో చెట్లను నరికివేసి, పర్యావరణానికి, అక్కడి వన్యప్రాణులకు తీవ్ర నష్టం కలిగించింది రేవంత్ రెడ్డి ప్రభుత్వమని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పర్యావరణ విధ్వంసంతో పాటు పాలనలో కూడా నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నదని మండిపడ్డారు. హెచ్‌సీయూలో చెట్లు రేవంత్ రెడ్డి అనాలోచిత చర్యలకు బలైపోయాయని.. హెచ్‌సీయూ అటవీ ప్రాంతాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణ కేవలం నినాదం కాదు.. అది మన బాధ్యత అని.. తెలంగాణ ప్రజల కోసం తాము ఈ పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు.

# కొరియా నేతకు పెను సవాళ్లు



ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికై నియంతృత్వం ప్రతిష్ఠించటానికి ప్రయత్నించిన మితవాద పక్ష నాయకుడు, మాజీ అధ్యక్షుడు యూన్ సెక్-యోల్‌కు దక్షిణ కొరియా ప్రజానీకం తగిన బుద్ధి చెప్పారు. భవిష్యత్తులో ఏ నాయకుడూ నియంత పోకడలకు పోకుండా మంగళవారం జరిగిన ఎన్నికల్లో గట్టి గుణపాఠం నేర్పారు. ఇటీవలి దశాబ్దాల్లో కనీవినీ ఎరుగని భారీ మెజారిటీ కట్టబెట్టి మధ్యేవాద వామపక్షమైన డెమాక్రటిక్ పార్టీని అందలం ఎక్కించారు. ఆ పార్టీ అభ్యర్థి లీ జే మ్యూంగ్ బుధవారం అధ్యక్షుడిగా ప్రమాణం చేశాక చెప్పినట్టు దక్షిణ కొరియా ఆర్థికంగా గడ్డుస్థితిలో వుంది. ఇందుకు యోల్ అస్తవ్యస్త పాలన కారణం. దీన్ని కప్పిపుచ్చుకోవటానికే ఆయన నిరుడు డిసెంబర్‌లో ఒక చీకటిరాత్రిలో ఆత్యయిక స్థితిని ప్రకటించి, సైనిక పాలన విధించారు. తనకెదురులేకుండా చేసుకోవటానికి మ్యూంగ్‌పై ముందే దేశద్రోహంతోసహా రకరకాల ఆరోపణ లతో కేసులు రూపొందించారు. కానీ ఆ నిశిరాత్రి వేళే దేశమంతా రోడ్లపైకి రావటంతో ఆ ప్రయత్నం బెడిసికొట్టింది. రాత్రికి రాత్రి విధించిన సైనిక పాలనను తెల్లారుజామునకే తొలగించక తప్పలేదు. ఆ ప్రహసనానికి తెగించకపోతే యోల్ 2027 వరకూ అధికారం చలాయించేవారు. యోల్ తన చేష్టలకు చెప్పిన కారణాలు చిత్రమైనవి. పొరుగునున్న శత్రుదేశం ఉత్తరకొరియాకు చెందిన కమ్యూనిస్టు పాలకులతో విపక్షాలు కుమ్మక్కయి, దేశాన్ని అస్థిరపరచాలని చూస్తున్నాయన్నది ఆయన ఆరోపణ. అయితే ఆయన్ను, ఆ పార్టీనీ మెజారిటీ జనం నమ్మలేదు. కొత్త అధ్యక్షుడు మ్యూంగ్ ముందున్న సవాళ్లు తక్కువేమీ కాదు. అంతర్గతంగా దేశం కుడి, ఎడమలుగా చీలిపోవటం, ఆర్థికవ్యవస్థ కుంగుబాటులో ఉండటం, జనాభాలో యువత శాతమే తక్కువనుకుంటే వారికి కూడా ఉపాధి కల్పించే స్థితి లేకపోవటం వంటివి ఆయన దక్షతను పరీక్షించబోతున్నాయి. మరోపక్క అంతర్జాతీయంగా పరిస్థితులు తారుమారయ్యాయి. దక్షిణ కొరియాకు ఆది నుంచీ అన్నివిధాలా బాసటగా వున్న ఏకైక దేశం అమెరికా. కానీ మ్యూంగ్ ఆ మధ్య చెప్పినట్టు అక్కడ మొన్న జనవరిలో డోనాల్డ్ ట్రంప్ పీఠం ఎక్కాక అంతర్జాతీయంగా 'ఆటవిక పాలన' నడుస్తోంది. స్వపర భేదం లేకుండా అందరిపైనా సుంకాల భారం మోపేందుకు ఆయన తహతహ లాడుతున్నారు. తమ సైన్యం రక్షణ కోరుకునే దేశాలు అందుకు భారీయెత్తున డబ్బు చెల్లించాలంటున్నారు. దక్షిణ కొరియాలో అమెరికా సైన్యం గణనీయంగానే ఉంది. అంతమాత్రాన మ్యూంగ్ ఆ దేశానికి దాసోహం అనే స్థితి ఉండకపోవచ్చు. అలాగే గతాన్ని మరిచి జపాన్‌తో సాన్నిహిత్యం పాటించాలన్న అమెరికా సలహాను యోల్ శిరసా వహించిన మాదిరిగా మ్యూంగ్ అంగీకరించక పోవచ్చు. డెమాక్రటిక్ పార్టీ మొదటి నుంచీ జపాన్ తన తప్పులు అంగీకరించి వలసపాలనలో కొరియా వాసులపై సాగించిన దుష్కృత్యాలకు క్షమాపణ చెప్పాలని, అందుకు మూల్యం చెల్లించా లని డిమాండు చేస్తోంది. ఆర్థికవ్యవస్థ బాగుకు చైనా సహాయం స్వీకరించాలని మ్యూంగ్ అనుకుంటున్నా అమెరికాతో స్నేహానికి అది అవరోధం అవుతుంది. మితవాదులు మొదటి నుంచీ దీన్నే ప్రచారం చేస్తూ వచ్చారు. ప్రాంతీయ భద్రతలో భాగంగా అమెరికా, జపాన్‌లతో సాన్నిహిత్యం కొనసాగుతుందని డెమాక్రటిక్ పార్టీ ఆ మధ్య ప్రకటించింది. చైనా, ఉత్తర కొరియాలతో వచ్చిన విభేదాల పరిష్కారానికి కృషి చేస్తానని మ్యూంగ్ తాజాగా తెలిపారు. కానీ ఆచరణలో అదెంత వరకూ సాధ్యమన్నది చూడాల్సి ఉంది. మొత్తానికి గత అధ్యక్షులెవరికీ లేనంత బలం ఆయనకు సమకూడింది. చట్టసభలో సైతం ఆయన పార్టీదే పైచేయి. దీన్ని ఆయన ఎలా ఉపయోగిస్తారన్నదే అందరిలోనూ ఉన్న సంశయం. ఎందుకంటే ఇంతవరకూ కొత్త అధ్యక్షుడు రాగానే గత అధ్యక్షుడిపై రకరకాల ఆరోపణలతో కేసులు పెట్టడం రివాజుగా మారింది. అయితే దేశాన్ని నియంతృత్వంలోకి నెట్టాలని చూసి యోల్ తన గొయ్యి తానే తవ్వుకున్నారు. ఆయనకు గుదిబండగా మారటానికి ఆ కేసు ఒక్కటీ చాలు. 'యుద్ధంలో విజయం సాధించటం చాలా ముఖ్యమే. కానీ అసలు యుద్ధం లేకుండానే విజయం సాధించటం అంతకన్నా ఎన్నో రెట్లు కీలకమైనది' అని మ్యూంగ్ ఇటీవల ప్రకటించారు. చైనా, ఉత్తర కొరియాల విషయంలో దీన్ని ప్రయోగించే అవకాశం ఎటూ ఉంది. కానీ అంతర్గత వ్యవ హారాల్లో కూడా ఈ నీతి పాటిస్తారా? దేశంలో అందరూ ఆసక్తిగా ఎదురుచూసేది దాని గురించే! ఎందుకంటే గతంలో జాతీయవాదం పేరిట యోల్ విద్వేషాలు రెచ్చగొట్టారు. ఉత్తర కొరియాతో ఏదో ప్రమాదం ముంచుకొస్తున్నదన్న అభిప్రాయం కలగజేశారు. దానికితోడు ఫెమినిస్టులపై ఆయన ద్వేషం అవధులు దాటింది. దేశ ఆర్థికవ్యవస్థ పతనానికి కూడా వారే కారకులన్న స్థాయిలో యోల్ ప్రచారం చేశారు. అదెంతగా పనిచేసిందంటే ఆ విషయంలో ఏం మాట్లాడితే ఏమవుతుందోనన్న భయంతో డెమాక్రటిక్ పార్టీ మౌనం వహించింది. కానీ దేశంలో హింసాత్మక ఘటనల్లో అత్యధిక బాధితులు మహిళలు. లైంగిక వేధింపులు, అత్యాచారాలు, హత్యలు, వివక్ష ఏమేరకు తగ్గినా వారు సంతోషిస్తారు. యువతకు ఉపాధి, పడిపోయిన జననాల రేటును పట్టా లెక్కించటం కూడా పరిష్కరించాల్సిన సమస్యలే. ఇక పింఛన్లు తీసుకునేవారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది. 80,000 కోట్ల డాలర్ల పింఛన్ నిధి క్రమేపీ ఆవిరవుతున్న దశలో ఉత్పాదకత పెంచి ఖజానా కళకళ లాడేలా చేయటం ఎలా అన్నది అంతుబట్టడం లేదు. ముందు సుస్థిరత సాధించి, ఈ సమస్యలపై దృష్టి సారిస్తే తప్ప మ్యూంగ్ తనకొచ్చిన జనాదరణను నిలబెట్టుకోవటం అంత సులభమేమీ కాదు!

# గొప్పలేకాదు.. తప్పులూ చెప్పాల్సిందే!



సింగపూర్‌లో జరిగిన 'షాంగ్రిలా డైలాగ్' సమావేశంలో పాల్గొన్న భారత రక్షణ సిబ్బంది ప్రధానాధికారి (సిడిఎస్) అనిల్ చౌహాన్ చేసిన వ్యాఖ్యలు పెద్ద చర్చకు దారితీశాయి. 'ఎన్ని యుద్ధ విమానాలు నేలకూలాయి అన్నది ముఖ్యమైనది కాదు. అవి, ఎలా కూలాయి అనేదే ముఖ్యమైంది' అని ఆయన చెప్పడం.. 'మనం మొదటి రోజున చేసిన వ్యూహపరమైన తప్పిదాలను 48 గంటల్లో సరిదిద్దుకుని పాకిస్తాన్‌పై దాడులకు సిద్ధమైనామని' వెల్లడించారు. అలాగే 'మన యుద్ధ విమానాలను పాకిస్తాన్ నేలకూల్చి భారత్‌కు నష్టం చేశాయని నిజాలను కొత్తగా చెప్పినట్లైంది. అయితే అనిల్ చౌహాన్ చెప్పినట్లు కొన్ని రాఫెల్స్ యుద్ధవిమానాలను కోల్పోయాం (ఎన్ని విమానాలు అనేది నిర్ధారణగా చెప్పలేదు). కానీ, పాకిస్తాన్ ప్రధాని చెప్పినట్లు 6 విమానాలు కాదు అని మాత్రమే అని చెప్పారు. అయితే, ఇప్పటివరకు అధికారికంగా రాఫెల్స్ యుద్ధ విమానాలు ఏవీ కూలలేదని ప్రచారం చేసిన అధికార పార్టీ మద్దతుదారుల వాదనలను అసత్యం అని నిర్ధారణ చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో పాకిస్తాన్ ప్రధాని చెప్పిన ఆరు విమానాలు కూల్చాం అన్న వాదనను కూడా ఆయన తప్పు అని కొట్టిపారేశారు. ఏదిఏమైనా సిడిఎస్ చెబుతున్నట్లు మనకు కొంత నష్టం జరిగిందన్నది స్పష్టం. (యుద్ధం అన్నాక ఇరుపక్షాలకు కొంత మేరకు నష్టం జరగడం సర్వసాధారణ విషయమే. ఇందులో వింత ఏమీలేదు.) కాకపోతే అధికారికంగా నష్టం జరగలేదని చెప్పటమే ఇప్పుడు ఇబ్బంది. మరోవైపు, చైనాతో పాకిస్తాన్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నప్పటికీ, ఈ ఘర్షణలో చైనానుంచి ప్రత్యక్షంగా సహాయం అందలేదని సిడిఎస్ చెప్పడం గమనార్హం. అయితే పాకిస్తాన్ చైనానుంచి కొనుగోలు చేసిన రాడార్లు మన దేశ భూభాగంలోనే మన విమానాలను కూల్చాయని అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. 2019 బాలాకోట్ దాడి తరహాలో మన వైమానిక నష్టం జరిగి ఉండవచ్చున్న సూచనలు కూడా బయటపడ్డాయి. ఇదే సమయంలో, సిడిఎస్ మాట్లాడుతూ 'చైనా ఆయుధాలు పని చేయలేదు' అన్న ఆయన వ్యాఖ్యలు చైనా తయారీ ఆయుధాల నాణ్యతా లోపాలు వెల్లడించాయి. అయితే ఈ రాద్ధాంతం అంతా విదేశీ వేదికపై జరగడం పట్ల మన దేశంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రక్షణ వ్యూహకర్త బ్రహ్మ చెలానే మాట్లాడుతూ 'ఇలాంటి కీలక విషయాలు మన దేశ వేదికపైనే వెల్లడించాలి కానీ శత్రు దేశ ప్రతినిధి ఉన్న షాంగ్రిలా సమావేశంలో చెప్పడం ద్వారా పాకిస్తాన్‌కు అవకాశం ఇచ్చినట్లు అవుతుంది అని మండిపడ్డారు. అంతేకాక, మోడీ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న వర్గాలు, ఇలా విదేశీ వేదికలపై మాట్లాడటం భారత స్వాభిమానానికి తక్కువ చేసేదిగా అభిప్రాయం కూడా బలంగా వినిపిస్తోంది. మరోవైపు, కాంగ్రెస్ నేత జైరాం రమేష్ మాట్లాడుతూ 1999 లో కార్గిల్ యుద్ధం అనంతరం వాజపేయి ప్రభుత్వం కె. సుబ్రహ్మణ్యం నేతృత్వంలో సమీక్ష కమిటీ ఏర్పాటు చేసి పార్లమెంట్‌లో నివేదిక సమర్పించింది. ఇప్పుడు కూడా అలాగే చేసే అవసరం ఉంది అని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ప్రధాని మోడీ ఇంత కీలక సంఘటనపై పార్లమెంట్ సమావేశంకూడా ఏర్పాటు చేయకపోవడం, ప్రజాస్వామ్య వ్యవస్థపై ఆయనకున్న చిన్నచూపును తెలుపుతున్నది. మణిపూర్ సమస్యపై రెండు సంవత్సరాలుగా ప్రజల అనిశ్చితిని చూసి స్పందించని మోడీ, ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో మాత్రం రోడ్ షోలు చేస్తూ సైనిక విజయాల్ని తన పార్టీ విజయాల కోసం ప్రచారంగా వాడుకుంటున్నారని విమర్శలు పెద్ద ఎత్తున విపక్షాలనుండి వస్తున్నాయి. అంతర్జాతీయంగా చూస్తే, బ్లూమ్‌బర్గ్, రాయిటర్స్, గ్లోబల్ టైమ్స్ వంటి పత్రికలు కూడా సిడిఎస్ వ్యాఖ్యల్ని ప్రముఖంగా ప్రచురించాయి. గ్లోబల్ టైమ్స్ యుద్ధ విమానాల కూలిపోవటం గురించి అప్పటికే వార్తలు రాసినప్పుడు ఆ వార్తలను మన విదేశాంగ శాఖ దురదృష్టకరమైన, నిర్ధారణలు చేసుకోకుండా రాస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చెసింది. ఇప్పుడు సిడిఎస్ స్వయంగా అదే విషయాలు చెప్పినందువల్ల గతంలో భారత ప్రభుత్వం అధికారికంగా చెప్పిన అభ్యంతరానికి విలువ లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో విమానాలు మన దేశంలో కూలాయా లేక పాకిస్తాన్ భూభాగంలోనా అనే ప్రశ్నలు మళ్లీ తెరపైకి వస్తున్నాయి. మన పైలట్లు సురక్షితంగా తిరిగి వచ్చారు అంటే, విమానాలు మన నేలపైనే కూలిపోయినవని అర్థమవుతుంది. ఇది పాకిస్తాన్‌కు కీలక విజయం కావచ్చు. ఇక అమెరికా తయారీ ఆయుధాల గురించి సిడిఎస్ వ్యాఖ్యలు చూస్తే పాకిస్తాన్‌కు అమెరికా ఇచ్చిన ఆయుధాలతో దాడులు చేసివుండవచ్చని, ట్రంప్ పరిపాలనలో వాటి వినియోగంపై నియంత్రణలు సడలించబడ్డాయన్న వాదనలు కూడా బలపడుతున్నాయి. ఇలా చూస్తే శత్రు దేశంపై విజయం అంటూ బిజెపి ప్రచారం చేస్తున్నా, ఆ యుద్ధ విజయాన్ని పూర్తిగా ప్రజల్లోకి తీసుకురాకుండా, పార్లమెంట్‌కు దూరంగా ఉంచాలన్న మోడీ ప్రభుత్వ వ్యూహం వెనుక చీకటి వాస్తవాలు దాగి ఉన్నాయని అనిపిస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థను గౌరవించాలంటే పార్లమెంట్‌లో చర్చ జరిపి సైనికుల ధైర్యాన్ని మెచ్చుకోవడమే కాదు, ప్రజల ముందు నిజాలను ఉంచడమూ అవసరం. ఈ నేపథ్యంతో ఒక ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించడం వాంఛనీయం. కానీ ప్రధాని మోడీకి పార్లమెంటులో విపక్షాలను, బయట మీడియాను ఎదుర్కొనే ధైర్యం చేయరు. ఇప్పటికే అనేక సందర్భాల్లో ఈ విషయం నిర్ధారణ అయింది.

# మినీ కేబినెట్‌లో ఐక్యతారాగం



రాష్ట్రంలో సగం కేబినెట్ కలిగిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఇటీవల కాలంలో ఐక్యతారాగాన్ని ఆలపిస్తుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం తొణికిసలాడుతున్నది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తోపాటు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు ఖమ్మం జిల్లానుంచే ప్రాతినిధ్యం వహిస్తుండటం, అంతేగాక వీరు నిర్వర్తించే శాఖలు కీలకమైనవి కావడంతో హైదరాబాద్ సచివాలయం సర్కిల్‌లో ఖమ్మం జిల్లా అంటే 'మినీ కేబినెట్'గా పిలుచుకుంటున్న విషయం తెలిసిందే. ఈ ముగ్గురు కలిసిమెలిసి ఐక్యంగా ఉన్నట్లు పైకి కనిపిస్తున్నప్పటికీ అంతర్గతంగా వారి మధ్య సమన్వయం లేదని పొలిటికల్ సర్కిల్‌లో గత కొంత కాలంగా విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. అయితే దానిని చెక్ పెట్టేందుకు ఈ ముగ్గురు మంత్రులు ఇటీవల కాలంలో ప్రయత్నించడం పార్టీ శ్రేణులు శుభపరిణామంగా పేర్కొంటున్నారు. దాదాపు ఏడాది తరువాత ముగ్గురు కలిసి తరచుగా ఒక వేదికను పంచుకున్న దృశ్యాలు కాంగ్రెస్ కార్యకర్తలకు నయనానందకరంగా మారాయి. ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ రెండు రోజుల క్రితం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు, ఎంఎల్ఎలతో ఆమె విడివిడిగా, వ్యక్తిగతంగా మాట్లాడారు. ఆమెకు ఉన్న ఫీడ్ బ్యాక్‌తో ఎవరికి ఏమి చెప్పాలో అది చెప్పి పంపించినట్లు సమాచారం. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ తిరిగి అధికారంలోకి రావాలన్నా అందరూ కలిసికట్టుగా పని చేయాలని ఆమె తనను కలిసిన వారందరికీ ఒకే మాటగా చెబుతున్నారు. ఇది జరిగిన రెండు రోజులకు మంగళవారం డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గం మధిర నియోజకవర్గం ఎర్రుపాలేం మండలం ములుగుమాడు గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులో జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఒక వేదికపై దర్శనం ఇచ్చిన దృశ్యం కాంగ్రెస్ శ్రేణులకు మిక్కిలి సంతోషాన్ని కలిగించింది. 'ముగ్గురు ఉంటే ముడిపడదు, నలుగురు ఉన్న చోట కర్ర విరగదు పాము చావదు' అనే పాత సామెత ఎలా ఉన్నా గడిచిన ఏడాదిన్నర కాలంలో ముగ్గురు ఎవ్వరికివారే యమునా తీరు చందంగానే వ్యవహరిస్తున్నప్పటికీ అడపాదడపా ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో కలిసి పాల్గొంటున్నారు. మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ముగ్గురు కలిసి జిల్లాకు వచ్చి ఆనాడు ఐక్యత చాటారు. ఆ తరువాత ఎవ్వరికి వారే అన్నచందంగా వ్యవహరించారు. గతంలో పొంగులేటి, తుమ్మల కాంగ్రెస్ ప్రత్యర్థి పార్టీలో కొనసాగారు. కాంగ్రెస్‌లో చేరిక కొత్తలో భట్టితో సమన్వయం కొంత ఆలస్యం అయింది. గతంలో జిల్లాకు చెందిన మంత్రులు ఎవరికి వారే తమ నియోజకవర్గాల్లో పర్యటించినప్పటికీ, ఇతర నియోజకవర్గాలకు వెళ్లినా ఎవరో ఒక్కరే వెళ్ళేవారు. అంతేగాక ఒకే అంశంపై ముగ్గురు మంత్రులు వేర్వేరుగా సమీక్షలు చేసిన దాఖలాలు అనేకం ఉన్నాయి. ఖమ్మం మున్నేరు వరదలు కావొచ్చు లేదా భద్రాచలంలో గోదావరి వరదలు కావొచ్చు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో కూడా ముగ్గురు వేర్వేరుగా పర్యటించడం, ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలపై ఎవ్వరికి వారే అధికారులతో వేర్వేరుగా సమీక్షలు జరపడంతో పరోక్షంగా వీరి మధ్య అగాధం ఉందనే సాంకేతాలు బయటకి వెళ్ళసాగాయి. హైదరాబాద్‌లో జరిగే మంత్రివర్గ సమావేశాలు, ఉన్నతాధికారుల సమీక్షా సమావేశాల్లో పలు సందర్భాల్లో కలిసి పాల్గొంటున్నప్పటికీ ఈ జిల్లాకు వచ్చేసరికి గడిచిన ఏడాదిన్నర కాలంలో ముగ్గురు మంత్రులు కలిసి ఒకే వేదికను పంచుకున్న సందర్భాలు అరుదు. ఉమ్మడి జిల్లా పర్యటనల్లోనూ ఈ ముగ్గురు మంత్రులు కలిసి పార్టీ కార్యక్రమాలకు హాజరైన సంఘటనలు కూడా చాలా తక్కువే. పార్లమెంట్ ఎన్నికల ప్రచార సభల్లో, ఉమ్మడి జిల్లాకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వచ్చిన సందర్భంలోనే ముగ్గురు మంత్రులు ఒక వేదికను పంచుకున్నారు. భద్రాచలం పట్టణంలో జరిగిన ఇందిరమ్మ పథకం ప్రారంభం, వైరాలో జరిగిన సీతారామా ప్రాజెక్టు, వైరా లింక్ కెనాల్ ప్రారంభ సభలో, శ్రీరామ నవమి వేడుకల్లో, మున్నేరు వరదల సమయంలో మాత్రమే కలిసి పాల్గొన్నారు. మల్లు భట్టి మొదటినుంచి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తుండగా, 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు బిఆర్ఎస్ నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావులు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం విదితమే. ఆనాడు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి ఎవ్వరికి వారే తమ వంతు పాత్ర పోషించారు. వంద రోజుల పాటు మల్లు భట్టి రాష్ట్ర వ్యాప్తంగా పాదయాత్ర చేయగా, పొంగులేటి, తుమ్మల చేరికతో కాంగ్రెస్ పార్టీకి కొత్త జోష్ వచ్చిందనేది నగ్నసత్యం. సీతారామా ప్రాజెక్టును పాలేరు రిజర్వాయర్‌కు అనుసంధానం చేసి గోదావరి నీళ్ళను పాలేరుకు మళ్ళించే డిజైన్ ఉండగా మున్నేరు వరద నీటిని పాలేరుకు మళ్ళించేందుకు రూ. 102 కోట్లతో పాలేరు లింక్ కెనాల్ తేవడం, కల్లూరుని కొత్తగా మున్సిపాలిటీ చేయడంలో ఒక గ్రామాన్ని ఆ మున్సిపాలిటీలో విలీనం చేసే సందర్భంలో, సీతారామా ప్రాజెక్టు పనులు వేగంగా కొనసాగడానికి ఏర్పడ్డ అవరోధాల విషయంలో, జిల్లాకు చెందిన సుడా చైర్మన్, ఇతర నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపించినప్పటికీ అది అంతర్గతంగానే కొనసాగింది. ఎక్కడ కూడా బహిర్గతం కాలేదు. ఇప్పుడు ముగ్గురు మంత్రులకు జ్ఞానోదయం అయిందేమో గాని ప్రస్తుతం మాత్రం ముగ్గురు మంత్రులు కలిసి ఉంటే కలదు సుఖం అని భావించి ఐక్యత రాగాన్ని ఆలపిస్తున్నారు. ఇలా ముగ్గురూ కలిసి తరచుగా అభివృద్ధి, సంక్షేమ, అధికార కార్యక్రమాలనే కాదు, పార్టీ వేదికలను కూడా పంచుకుంటే క్రింది స్థాయిలో కూడా ఇదే విధంగా ఐక్యతను ప్రతిబింబిస్తుందనడంలో ఏమాత్రం సందేహం లేదు. మూడు కీలక శాఖలను నిర్వహిస్తున్న ముగ్గురు మొనగాళ్ళు, పదేపదే అభివృద్ధి జపం చేసేవాళ్ళు కలిసి నడిస్తే ఉమ్మడి జిల్లాలో అభివృద్ధి పరుగులు పెడుతుందనేది జగమెరిగిన సత్యం. అయితే ఈ సఖ్యత తాత్కాలికమా? అనే దానికి వేచిచూడక తప్పదు.